www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 256 | గురువారం 08-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

హోదా హక్కుపై లాఠీ

ఢిల్లీలో గర్జించిన వామపక్షాలు

- నేతలు, కార్యకర్తలపై పోలీసుల లాఠీలు
- పార్లమెంటు స్ట్రీట్‌లో ఉద్రిక్తత...
- రామకృష్ణ, ముప్పాళ్ల, మధు, శ్రీనివాస్ ప్రభృతుల అరెస్టు
- ప్రత్యేక హోదా ఇచ్చే వరకు ఢిల్లీ వదిలేది లేదని స్పష్టీకరణ





విశాలాంధ్ర బ్యూరో -న్యూఢిల్లీ :
ప్రత్యేక హోదా అంశంపై వామపక్ష పార్టీలు దేశరాజధాని ఢిల్లీలో భారీ ఆందోళన నిర్వహించాయి. బుధవారం పార్లమెంటు స్ట్రీట్‌లో నిర్వహించిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఎం నేతలు పి.మధు, వి.శ్రీనివాసరావుతో పాటు వంద మంది కార్యకర్తలను అరెస్టు చేసి మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రత్యేక హోదా నినాదాలతో పార్లమెంటు స్ట్రీట్ మారుమోగిపోయింది. వామపక్షాల కార్యకర్తలపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. పార్లమెంటు స్ట్రీట్‌లో బహిరంగ సభను నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి పార్లమెంటు వైపు వెళ్లారు. పార్లమెంటు ముట్టడికి వెళ్తున్న వామపక్ష నేతలను పోలీసులు అడ్డుకుని కదలకుండా నిలువరించారు. నేతలు, కార్యకర్తలు పోలీసు బ్యారికేడ్లను కూడా నెట్టుకుంటూ ముందుకు వెళ్ళారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే వరకు వెనుదిరిగేది లేదని పోలీసులతో కార్యకర్తలు వాగ్వివాదానికి దిగారు. తొలుత పారామిలిటరీ దళాలు కార్యకర్తలను అడ్డుకున్నాయి. ఆ తర్వాత సీఆర్‌పీఎఫ్ పోలీసులు కూడా రంగంలోకి దిగి కార్యకర్తలను నిలువరించే ప్రయత్నం చేయగా కార్యకర్తలు తమ పట్టువిడవ లేదు. దీంతో పోలీసులు కర్కశంగా కార్యకర్తలపై లాఠీఛార్జి చేశారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు వాటర్‌క్యానన్‌లను కూడా సిద్ధం చేశారు. పోలీసులు ఒకటవ నెంబరు హెచ్చరికను జారీ చేశారు. పార్లమెంటు స్ట్రీట్ వదిలి వెళ్లిపోవాలని సూచించినా కార్యకర్తలు కదలకపోవటంతో వెంటనే లాఠీఛార్జి చేశారు. పలువురు కార్యకర్తలకు ఈ లాఠీఛార్జిలో తీవ్రమైన గాయాలు అయ్యాయి. పోలీసులు ప్రత్యేకంగా నాలుగు బస్సులను ఏర్పాటు చేసి కార్యకర్తలను మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మహిళా కార్యకర్తలను కూడా ఈడ్చుకుంటూ వెళ్లి బస్సుల్లో తోసేయటం నాయకులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. పోలీసులకు , నాయకులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగిన నేపథ్యంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అందర్నీ పార్లమెంటు

- మిగతా 2 లో



ఆగని
దమనకాండ

- అంబేద్కర్ విగ్రహం ధ్వంసం
- యూపీలో మనువాదుల దాష్టీకం
- దళితుల ఆగ్రహం... రాస్తారోకో

మీరట్ :
త్రిపుర మతోన్మాదులు...వేర్పాటువాదుల ధ్వంసరచన..దేశవ్యాప్తంగా రగులుతోంది. రష్యా విప్లవ నేత లెనిన్ విగ్రహాన్ని త్రిపురలో పెకలిస్తే...తమిళనాడులో సామాజిక విప్లవ నేత పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన కలవర పెట్టగా..తాజాగా యూపీలో మనువాదులు భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి అక్కసు చాటుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లా మవానాలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు కొందరు అంబేద్కర్ విగ్రహం తలను, విరగొట్టి కిందపడేసి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన దళితులు బుధవారం ఉదయం నుంచి ఆందోళనలకు దిగారు. మవానా రహదారిపై బైఠాయించి, విద్వేషకారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారిని పోలీసులు అడ్డకునే సమయంలో కొంత ఉద్రిక్తత తలెత్తింది. గంటలపాటు రాస్తారోకో చేసిన దళితులు.. నిందితులను పట్టుకునేదాకా ఆందోళన

- మిగతా 11 లో


లేదంటే వినరేం..!



- సెంటిమెంట్‌తో డబ్బులు రావు
- నిధులు ఎక్కడి నుంచి ఇవ్వాలి
- ఆందోళనలతో ఒరిగేదీ ఏమీ లేదు
- ఏపీనే తేల్చుకోవాలి : అరుణ్‌జైట్లీ

విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ :
ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని కేంద్రం అధికారికంగా తేల్చి చెప్పేసింది. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వలేమన్న అంశానికి కారణాలు వివరిస్తూ అంతా పాతపాటే పాడారు. ఏపీకి ఇష్టం లేకుండానే విభజన జరిగిందని, దాంతో వనరుల లేమితో రాష్ట్రం బాధపడుతోందన్న ఆయన కేంద్రం వద్ద మాత్రం నిధులు లేవని చెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం తేల్చి చెప్పిందని సాకుగా చూపారు. ఈశాన్య రాష్ట్రాల్లో ప్రత్యేక హోదా ఇవ్వడం అనేది ఆనవాయితీగా వస్తోందని, పూర్తి స్థాయిలో వెనుకబడిన రాష్ట్రాలు అయినందునే వాటికి హోదా ఇస్తున్నామని, 14వ ఆర్థిక సంఘం ప్రకటన చేసేనాటికే వాటికి హోదా ఉందని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంపై పెద్ద ఎత్తున చర్చజరుగుతున్న నేపథ్యంలో అరుణ్‌జైట్లీ మీడియా

- మిగతా 11 లో




కేంద్రమంత్రి పదవులకు
గుడ్‌బై



- జైట్లీ ప్రకటన తరువాత బాబు కీలక నిర్ణయం
- కేంద్రం నుంచి బయటకు రావాలని టీడీపీ నిర్ణయం
- రాష్ట్ర మంత్రివర్గం నుంచి వైదొలగనున్న బీజేపీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:
రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా ఇచ్చేది లేదంటూ కేంద్రం స్పష్టం చేయడంతో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు కేంద్రం నుంచి బయటకు రావాలని బుధవారం రాత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ఆర్థికశాఖమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటన వెలువడిన అనంతరం సచివాలయం నుంచి ఢిల్లీలోని ఎంపీలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే అందుబాటులో ఉన్న మంత్రులతో చర్చించిన ఆయన కేంద్రమంత్రివర్గం నుంచి బయటకు రావాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని ప్రధాని మోడీకి స్వయంగా చంద్రబాబు

- మిగతా 2 లో



వైసీపీ రాజ్యసభ అభ్యర్థిగా వేమిరెడ్డి నామినేషన్

11లో

ఇదీ లోకం!



రాష్ట్ర బడ్జెట్ నేడే

రూ.1.80 లక్షల కోట్ల నుంచి రూ.1.86 లక్షల కోట్లు

- ముహూర్తం ఉ.11.30 గంటలు
- అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న యనమల
- మండలిలో మంత్రి నారాయణ
- ప్రతిపక్షాల్లేకుండా తొలిసారిగా
- కేంద్ర సహాయ నిరాకరణతో కుదింపు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి :
రాష్ట్ర విభజన సందర్భంగా జరిగిన అన్యాయాన్ని భర్తీ చేసేందుకు కేంద్రం నుంచి సరైన సహకారం అందకపోగా, కేంద్ర బడ్జెట్‌లోనూ పెద్దగా కేటాయింపులు లేకపోవటం రాష్ట్ర బడ్జెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపించనుంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే ప్రసక్తేలేదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ మరోసారి పునరుద్ఘాటించారు. గతంలో అమలు చేస్తామన్న ప్యాకేజీ నేటికీ అమలుకాకపోగా, 2014-15 ఆర్థిక సంవత్సరంలో పది నెలలకు సంబంధించిన రూ.16 వేల రెవెన్యూ లోటును కూడా భర్తీ చేయలేదు. ఈ నేపథ్యంలో 2018-19 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. కేంద్రం నుంచి ఎలాంటి సహాయం లేకుండా బడ్జెట్ రూపకల్పన చేయటం టీడీపీ ప్రభుత్వానికి కత్తి మీద సాములాంటిదే. దీంతో

- మిగతా 2 లో

డయేరియా 'పంజా'

గుంటూరులో పైపులకు లీకులతో తాగు నీరు కలుషితం



చికిత్స పొందుతున్న డయేరియా రోగులు



మురుగు కాలువ నుంచి వెళ్ళుతున్న తాగునీటి పైపులైన్లు

- తొమ్మిదికి చేరిన మృతుల సంఖ్య
- బుధవారం మరో ఆరుగురు మృతి
- అధికారుల నిర్లక్ష్యానికి నగరవాసులు బలి
- ఆస్పత్రిలో 300 మందికి చికిత్స

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు :
గుంటూరు నగరంలో డయేరియా విస్తరిస్తోంది. గత మూడురోజుల నుంచి జనం మృత్యువాత పడుతున్నారు. తాగునీటి పైపులైన్లలో లీకులు ఏర్పడటం వలన మురుగునీరు కలిసి కలుషితం అయ్యింది. దీంతో నగరవాసులకు డయేరియా సోకి వాంతులు, విరోచనాలతో ఆస్పత్రులలో చేరుతున్నారు. తొలి రోజు ఒకరు మృతి చెందగా రెండో రోజు మరో ఇద్దరు మృతి చెందారు. తాజాగా బుధవారం ఆరుగురు మృతి చెందారు. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి మొత్తంగా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది.
సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు. గుంటూరు నగరంలో సుమారు 10 లక్షల మంది జనాభా నివాసం ఉంటున్నారు. అయితే వేసవిలో వీరికి తాగునీటిని తగినంత సరఫరా చేయలేపోతున్నారు. పైగా కాలం చెల్లిన తాగునీటి పైపులైన్లు లీకులు ఏర్పడి తరచూ నీరు కలుషితం అవుతుంది. ప్రధానంగా నగరంలోని పాతగుంటూరు, ఆనందపేట, సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్డు, పొన్నూరు రోడ్డు, రెడ్ల బజార్, వసంతరాయపురం, లాలాపేట వంటి ప్రాంతాలలో నీరు కలుషితం అయ్యింది. ఈ ప్రాంతాల నుంచే డయేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. తొలి రెండు రోజులలో

- మిగతా 2 లో

కేంద్ర ఉద్యోగులకు 2 శాతం డీఏ పెంపు

జనవరి ఒకటి నుంచి అమలు

న్యూఢిల్లీ :
కేంద్ర ప్రభుత్వోద్యోగుల డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ)ని 2 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. అదేవిధంగా పింఛనుదారులకు కూడా డియర్‌నెస్ రిలీఫ్‌ను 2 శాతం పెంచేందుకు ఆమోదించింది. 2018 జనవరి 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. దీంతో 48.41 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులకు, 61.17 లక్షల మంది పింఛనుదారులకు ప్రయోజనం కలుగుతుంది. డీఏ పెంపు వల్ల ఖజానాపై సంవత్సరానికి రూ.6,077 కోట్లు భారం పడుతుంది. ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 7 శాతానికి పెరిగింది.

పార్లమెంటులో మూడోరోజూ...

9లో

మహారాష్ట్రలో కదం తొక్కిన రైతాంగం

9లో


సాంకేతిక లోపంతోనే రష్యా విమాన ప్రమాదం : 39కి చేరిన మృతుల సంఖ్య



మాస్కో : సాంకేతిక లోపంతోనే సిరియాలో తమ రవాణా విమానం ప్రమాదానికి గురై ఉండవచ్చునని పౌర విమానయాన మంత్రిత్వశాఖ తెలియజేసింది. విమానంపై ఎవరూ దాడి చేసినట్టుగా సమాచారం ఏమీలేదని ఆ శాఖ తెలిపింది. సిరియాలోని విమానాశ్రయంలో దిగుతున్న రష్యా విమానం ఒక్కసారిగా కూలిపోయిందని రష్యా రక్షణమంత్రిత్వశాఖ తెలిపింది. విమానంలో వున్న మొత్తం 39మంది చనిపోయారు. వీరిలో 33మంది ప్రయాణీకులుకాగా 6గురు సిబ్బంది ఉన్నారు. రన్‌వేకు 500 మీటర్ల దూరంలో ఉండగా విమానం కూలిపోయినట్టు మాస్కో రక్షణశాఖ తెలిపింది. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ప్రస్తుతం ఆయన ఉరల్స్ ప్రాంతంలో పర్యటిస్తున్నారు. విమాన ప్రమాదానికిగల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు కమిషన్‌ను నియమిం చినట్లు రక్షణశాఖ తెలియజేసింది. 2016 డిసెంబర్‌లో రష్యా సైనిక విమానం "రెడార్మీకాయర్' సిరియాకు వెళుతుండగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో 92 మంది చనిపోయారు. తాజాగా జరిగిన విమాన ప్రమాదానికి సంబంధించి బ్లాక్‌బాక్స్‌లు లభించినట్టుగా రష్యా పత్రిక ఇజ్వెస్టియా తెలియజేసింది.

వైట్‌హౌస్‌కు మరో అధికారి గుడ్‌బై

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో జాతీయ ఆర్థికమండలి డైరెక్టర్ గ్యారీకోహన్ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. స్టీలు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలు విధిస్తున్నట్టు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కోహన్ రాజీనామా చేశారు. ట్రంప్ అధికార బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి కోహన్ ఆయనకు ప్రధాన ఆర్థిక సలహాదారుగా పని చేస్తున్నారు. అమెరికా ప్రజలకు ప్రయోజనం కలిగే అభివృద్ధికరమైన ఆర్థిక విధానాలను రూపొందించి దేశ ప్రజలకు సేవచేయటం తనకు గౌరవంగా భావిస్తానని కోహన్ చెప్పినట్టుగా వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. చరిత్రాత్మకమైన పన్నుల సంస్కరణలను రూపొందించడం తనకెంతో గౌరవంగా భావించానని ఆయన పేర్కొన్నారు. ట్రంప్‌తో చాలాకాలంగా ఆయన సన్నిహితంగా ఉన్నారు. దేశంలో పన్నుల తగ్గింపు సంస్కరణ బిల్లు రూపొందించడంలో కోహన్ ప్రధానపాత్ర వహించారు. స్టీలు 25శాతం, అల్యూమినియంపై10 శాతం దిగుమతి పన్ను విధించనున్నట్టు ట్రంప్ ఈనెల 1వ తేదీన ప్రకటించాడు. ఈ ప్రకటన అమెరికాకే నష్టం కలిగిస్తుందని అత్యధిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సుంకాల విధింపు ప్రకటనకు కట్టుబడి ఉన్నట్టుగా ట్రంప్ మరోసారి ప్రకటించారు. వాణిజ్య యుద్ధాలు చెడ్డవేమీకాదని దీనివల్ల ఇతరులు ఇబ్బంది పడవచ్చుకాని తాము ఇబ్బంది పడబోమని ట్రంప్ ప్రకటించారు.



భద్రతకు హామీ ఇస్తే చర్చలు

అమెరికాకు తేల్చిచెప్పిన ఉత్తరకొరియా



సియోల్ : తమ దేశ భద్రతకు హామీ ఇచ్చినట్లయితే అణురహితంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు ఉత్తరకొరియా సంసిద్ధత వ్యక్తం చేసింది. దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్ ప్రత్యేక దూత ఉత్తరకొరియాకు వెళ్లి ఆదేశ అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌తో ఇతర ఉన్నతస్థాయి అధికారులతో జరిపిన చర్చల ఫలితమే ఇది. మంగళవారం దక్షిణకొరియా ఈ అంశాన్ని వెల్లడించింది. అణ్వాయుధ పరీక్షలను, మిస్సైల ప్రయోగాన్ని నిర్వహించకుండా ఉంటామని ఉత్తరకొరియానేత కిమ్ తెలిపినట్టుగా దక్షిణకొరియా వెల్లడించింది. దక్షిణకొరియా జాతీయ భద్రతా ప్రధానాధికారి చుంగ్‌ఇయాంగ్ నాయకత్వంలో 5గురు సభ్యులుగల బృందం ఉత్తరకొరియానేత కిమ్‌తో మాట్లాడి స్వదేశానికి తిరిగి చేరుకుంది. అణురహితం సమస్య, సాధారణ సంబంధాలను ఏర్పరచుకొనే అంశాలపైన అమెరికాతో చర్చలు జరపాలంటే తమ దేశ భద్రతకు ఆదేశం హామీ ఇవ్వాలని కిమ్ తెలియజేశారు. తమ దేశానికి సైనిక ముప్పు లేకపోయినట్లయితే సమస్య పరిష్కారమవుతుందని కిమ్ చెప్పినట్టుగా దక్షిణకొరియా వివరించింది. కిమ్ కోరినట్టు భద్రతకు హామీ ఉంటుందని చుంగ్ అన్నారు. గత కొన్ని నెలలుగా అమెరికా, ఉత్తరకొరియా మధ్య మాటలయుద్ధం జరుగుతూనే ఉంది. తాజాగా మరోసారి ఉత్తరకొరియాపై ఆంక్షలు విధిస్తామని కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దక్షిణకొరియా దూత చుంగ్‌తో ముఖాముఖి కిమ్ మాట్లాడారు. విదేశీ దూతతో కిమ్ మాట్లాడటం ఇదే మొదటిసారి. చర్చలకు కిమ్ అంగీకరించినట్లుగా వెల్లడైన తరువాత ట్రంప్ మాట్లాడుతూ ఉత్తరకొరియా చిత్తశుద్ధితో ఉన్నదని తాను నమ్ముతున్నట్టుగా తెలిపారు. అయితే దక్షిణకొరియాతో కలిసి సంయుక్త సైనిక విన్యాసాలను నిర్వహించనున్నట్టుగా ట్రంప్ ప్రకటించడం మొత్తం పరిస్థితిని తల్లకిందులుచేసే అవకాశం ఉంటుంది. సైనికరహిత జోన్‌లో ఏప్రిల్‌లో రెండు కొరియాల మధ్య చర్చలు జరుగుతాయి. మూన్‌జాయ్‌ఇన్, కిమ్‌జాంగ్‌ఉన్‌లు ఈ చర్చలకు హాజరవుతారని చుంగ్ చెప్పారు. రెండు దేశాల మధ్య హాట్‌లైన్ ద్వారా మాట్లాడుకునేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతాయని చుంగ్ చెప్పారు.

ముస్లిం వ్యతిరేక హింసతోనే లంకలో ఎమర్జన్సీ



కొలంబో : ముస్లిం వ్యతిరేక హింసాకాండ విస్తరించడంతో దేశంలో అత్యవసర పరిస్థితి విధించినట్టు శ్రీలంక ప్రభుత్వవర్గాలు తెలిపాయి. దేశంలో అసంతృప్తికరమైన భద్రతా పరిస్థితి ఉన్నందున ఎమర్జన్సీ విధించినట్టు దేశాధ్యక్షుడు సిరిసేన ప్రకటించారు. ముఖ్యంగా సెంట్రల్ రాష్ట్రంలో ముస్లిం వ్యతిరేక హింస తీవ్ర ఉద్రిక్తతలకు దారితీయడం వల్ల ఎమర్జన్సీ విధించక తప్పలేదని ఆయన అన్నారు. మంత్రివర్గం సమావేశమై ఎమర్జన్సీ ప్రకట నను ఆమోదించింది. ఈ హింసాకాండలో అనేక డజన్ల మసీదులు, పందలాది ముస్లింల షాపులు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా కాండీ ప్రాంతంలో ఈ హింసాకాండ జరిగింది. దహనం చేసిన ఒక ఇంటిలో ముస్లిం యువకుడి మృతదేహం కనిపించిందని పోలీసులు తెలిపారు. ప్రజలలో విశ్వాసాన్ని పాదుకొల్పేందుకే ఎమర్జన్సీ విధించినట్టు మంత్రి దయాసిరి జయశేఖర తెలిపారు. ఘర్షణలు చెలరేగితే సైన్యాన్ని వినియోగించేందుకు ఎమర్జన్సీ ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కొద్దిరోజులుగా జరుగుతున్న ఘర్షణలను అదుపుచేయడంలో పోలీసులు విఫలమయ్యారని సైన్యం రంగంలోకి దిగితే పరిస్థితి చక్కబడుతున్నదని ఆయన చెప్పారు. ఎమర్జన్సీని పొడిగించేందుకు పార్లమెంటు అంగీకరించకపోతే రెండువారాల తరువాత ఎమర్జన్సీ అమలులో ఉండదనిప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాండీలో దాడులకు పాల్పడుతున్నారన్న అనుమానంతో 24మందిని అరెస్టు చేశారు. కొంతమంది ముస్లింలు జరిపిన దాడిలో 40 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని దీంతో హింస చెలరేగిందని పోలీసు వర్గాలు తెలిపాయి. సింహళ బుద్దిస్టు శక్తులే హింసాకాండని రెచ్చగొట్టాయని తెలుస్తోంది. ప్రధానమంత్రి రణిల్‌విక్రమసింఘే ఇటీవల శాంతి భద్రతల శాఖను సైతం తనవద్దే ఉంచుకుని మతఘర్షణలు, జాతి విద్వేషాలు జరగకుండా నివారించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. తాజాగా జరిగిన ఘర్షణల సందర్భంగా పోలీసులు సమయానికి స్పందించలేదన్న విమర్శలున్నాయి.

పటిష్ట ఆర్థిక సమాజ నిర్మాణంలో వివిధ పార్టీలు



బీజింగ్ : చైనాలో ఘనమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి కమ్యూనిస్టేతర పార్టీలు తమవంతు కృషి చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశాయి. చైనా పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ 13వ జాతీయ కమిటీ సమావేశాలు బీజింగ్‌లో జరిగాయి. కమ్యూనిస్టు పార్టీ నేతలతో పాటు 8 కమ్యూనిస్టేతర పార్టీలు, పారిశ్రామిక వాణిజ్యమండలి ప్రతినిధులు హాజరై పటిష్ట ఆర్థిక సమాజ నిర్మాణానికి తమవంతు పలు సూచనలు అందించారు. ఈ అంశాన్ని ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయా పార్టీల నేతలు వెల్లడించారు. చైనాలో బహుళపార్టీ వ్యవస్థ ఉన్నదని చెప్పేందుకు ఇది ప్రబలమైన తార్కాణం. అన్ని రాజకీయ పార్టీలు దేశ నిర్మాణంలో తమవంతు కృషి చేయడానికి ముందుకు వచ్చాయి. సమావేశంలో పాల్గొన్న పార్టీలలో రెవల్యూషనరీ కమిటీ ఆఫ్‌ది చైనీస్ కొమింగ్‌టాంగ్, చైనా డెమొక్రటిక్ లీగ్, చైనా నేషనల్ డెమొక్రటిక్ కన్‌స్ట్రక్షన్ అసోసియేషన్, చైనా అసోసియేషన్ ఫర్ ప్రమోటింగ్ డెమొక్రసీ, చైనా పెజెంట్స్ అండ్ వర్కర్స్ డెమొక్రటిక్ పార్టీ, చైనా జిగాంగ్‌పార్టీ, జియిసాన్ సొసైటీ, తైవాన్ డెమొక్రటిక్ సెల్ఫ్ గవర్నమెంట్ లీగ్ పార్టీలు ఉన్నాయి. దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు కమ్యూనిస్టేతర పార్టీల నాయకులు కూడా చర్చలలో పాల్గొన్నారు.

బ్రెగ్జిట్‌పై చర్చలకు మార్గదర్శకాలు



బ్రస్సెల్స్ : యూరోపియన్ యూనియన్ నుంచి (ఈయూ) బ్రిటన్ వైదొలగేందుకు (బ్రెగ్జిట్) రెండవదశ చర్చలు ఈనెల చివరిలో ప్రారంభం కానున్నాయి. ఈ చర్చలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు డొనాల్డ్ టస్క్ మార్గదర్శకాలను రూపొందించారు. ఈ మార్గదర్శకాలను బ్రెగ్జిట్‌పై చర్చలు జరగటానికి ముందే ఈయూ నాయకులు తమ ఆమోదం తెలియజేస్తూ సంతకాలు చేయవలసివుంటుంది. భవిష్యత్తు వాణిజ్య ఒప్పందంలో ఆర్థిక సేవలను కూడా చేర్చాలని ఛాన్సలర్ ఫిలిప్‌హమ్మండ్ కోరారు. దీనిపై ఈయూ బ్రెగ్జిట్ ప్రధాన సంధానకర్త మైఖేల్‌బర్నియర్ మాట్లాడుతూ అలాంటి ఒప్పందం గతంలో జరగలేదని అన్నారు. అయితే వాణిజ్య ఒప్పందంలో ఆర్థిక సేవలను చేర్చడం తప్పనిసరి అవుతుందని అన్నారు. అమెరికా, కెనడా మధ్య జరిగిన వాణిజ్య చర్చలలోను ఇలాంటి ఒప్పందాలు చేసుకునేందుకే గతంలో ప్రయత్నాలు జరిగాయని హమ్మండ్ ఈయూ నాయకులతో మాట్లాడుతూ చెప్పారు. పరస్పర ప్రయోజనాల కోసం వాణిజ్య ఒప్పందంలో ఆర్థిక సేవలను చేర్చడం మంచిదని ఆయన అన్నారు.

చర్చలకు కావలసిన మార్గదర్శకాల ముసాయిదాను ప్రకటించవలసివుంది. ఈనెల 22వ తేదీన బ్రస్సెల్స్‌లో బ్రెగ్జిట్‌పై రెండవదశ చర్చలు జరుగుతాయి. అందువల్ల ఈయూలోని తక్కిన 27 దేశాల నాయకులు ఈ ముసాయిదాపైన తమ సంతకం చేయవలసివుంటుంది. వాణిజ్య ఒప్పందంపైన చర్చలు ఏప్రిల్‌లో జరిగే అవకాశాలున్నాయి. సింగిల్ మార్కెట్‌నుంచి కూడా వైదొలగాలని బ్రిటన్ ప్రధాని థెరిసామె ఆలోచనను టస్క్ విమర్శించారు.

డయేరియా 'పంజా'

(మొదటిపేజీ తరువాయి)

ముగ్గురు మృతి చెందారు. తాజాగా బుధవారం ఆరుగురు మృతి చెందగా వారిలో జియాఉద్దీన్‌నగర్‌కు చెందిన సాధికొమ్ము చినబాలకోటిరెడ్డి(65), లాలాపేటకు చెందిన ఎస్.కె. గౌషియ(54), మంత్రివారివీధికి చెందిన సామ్రాజ్యం(50), సంగడిగుంటకు చెందిన ఎం.పద్మావతి(45), వసంతరాయపురానికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావు(35), బాలాజీనగర్‌కు చెందిన అనపాల వెంకట్రావు(61) ఉన్నారు. వీరిలో ఐదుగురు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా బాలకోటిరెడ్డి అమరావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రస్తుతం జీజీహెచ్‌లో 100 మంది, ఇతర ప్రైవేటు ఆస్పత్రులలో మరో 200 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. దీంతో గుంటూరులో విషాద ఛాయలు అలముకున్నాయి.

పైప్ లైన్ తనిఖీల్లో నిర్లక్ష్యం

గుంటూరు నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి నగరవాసులు బలి అయిపోయారు. పైపులైన్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలనే ఇలాంటి దుర్ఘటన జరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. గుంటూరులో 1073 కిలోమీటర్ల పరిధిలో తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. దీనిలో 700 కిలోమీటర్లకు పైగా ఉన్న పైపులైన్లు కాలం చెల్లినవే ఉన్నాయి. దాదాపు 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్ల ద్వారానే నీటి సరఫరా జరుగుతుంది. పురాతన పైపులైన్లు కావడం వలన తుప్పుపట్టి లీకులు ఏర్పడుతున్నాయి. పైగా ఇవి మురుగునీటి కాలువకు సమీపంలో ఉండటం వలన మురుగునీరు కలిసిపోయి తాగునీరు కలుషితం అవుతుంది. ఈ పాతకాలం పైపులైన్లు మార్పు చేయాలని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు గతంలో ప్రతిపాదనలు తయారు చేశారు. అయితే అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోవడంతో నగరంలో ఇలాంటి దుస్థితి నెలకొంది.

నమూనా పరీక్ష ఎంత వరకు..?

గుంటూరు నగరంలో 30 రిజర్వాయర్లు ఉన్నాయి. వాటి నుంచే నగరం మొత్తానికి శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతుంది. ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది నిత్యం ఈ రిజర్వాయర్ల నుంచి నీటి నాణ్యత ఎలా ఉందో నమూనాలు సేకరిస్తారు. ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, వాల్వ్ ఆపరేటర్లు, ఇంజినీరింగ్ ఏఈలు ఇలా అందరూ పని చేసే ప్రదేశాల్లో సరఫరా చేసే పైపులైన్లు నుంచి. ఇళ్లకు వెళ్లే రిజర్వాయర్ల నుంచి నీటి నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం గుంటూరు వైద్య కళాశాలలో ఉన్న ప్రాంతీయ ప్రయోగశాలకు పంపించి నాణ్యత తెలుసుకుంటారు. అలాగే జలాశయంలో ఆలం, క్లోరినేషన్ కలిపిన తర్వాత పరీక్షించిన తర్వాతే నీటిని ఇళ్లకు సరఫరా చేస్తారు. ఈ ప్రక్రియ అంతా సక్రమంగా జరగకపోవడం వలనే నీటి కాలుష్యం జరిగినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

హోదా హక్కుపై లాఠీ

(మొదటిపేజీ తరువాయి)

స్ట్రీట్ నుంచి మందిర్‌మార్గ్‌కు తరలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చే వరకు దేశరాజధాని ఢిల్లీని విడిచి వెళ్ళేది లేదని స్పష్టంచేశారు. కేంద్రం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మూడు రోజుల నుంచి ఢిల్లీలో నిరసన చేస్తుంటే కేంద్రం నుంచి సరైన స్పందన కూడా కరవైందన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల నాలుగేళ్లుగా కేంద్రం ఎప్పుడూ సానుకూలంగా స్పందించలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే ఢిల్లీకి రావాలని డిమాండు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జెట్లీ వ్యాఖ్యలు చాలా దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఏపీని మోసం చేయాలని కేంద్రం కంకణ కట్టుకున్నదని రామకృష్ణ అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ లాఠీఛార్జి చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. విభజన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతున్న తమపై పోలీసులు ఈ విధంగా వ్యవహరించటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి నేత చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వనని తేల్చి చెప్పేసిందన్నారు. ఇక కేంద్రంతో టీడీపీ తాడో పేడో తేల్చుకోవాలని, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి ఢిల్లీలో ఆందోళన చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ప్రత్యేక హోదాపై సీపీఐ గత నాలుగేళ్ల నుంచి ఆందోళన చేస్తున్నదన్నారు. ఏపికి జరిగిన అన్యాయాన్ని సరి చేయటానికి కేంద్రం సిద్ధంగా లేదని చెప్పారు. బీజేపీ తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేరనందున ఏపీకి అన్యాయం చేయాలని చూస్తున్నదన్నారు. బీజేపీతో తాడో పేడో తేల్చుకోవాల్సింది చంద్రబాబు నాయుడేనని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు ముగిసేలోగా ప్రత్యేక హోదాపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటన చేయకపోతే రాష్ట్ర ప్రజలు బీజేపీకి తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, డివైఎఫ్ఐతో పాటు అనేక విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.



ఢిల్లీలో రామకృష్ణను అరెస్టు చేస్తున్న పోలీసులు



ఢిల్లీలో ర్యాలీ నిర్వహిస్తున్న రామకృష్ణ, మధు, చలసాని, రావుల వెంకయ్య తదితరులు

నేడు సీపీఐ అర్ధనగ్న ప్రదర్శన : దేశరాజధాని ఢిల్లీలో సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నేతృత్వంలో గురువారం అర్ధ నగ్న ప్రదర్శన జరగనున్నది. ఢిల్లీలోని తెలుగు ప్రజలు, వామపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలు భారీగా హాజరుకానున్నారు. ప్రత్యేక హోదా ఇచ్చే వరకు ఢిల్లీలో ఆందోళన కొనసాగిస్తామని నేతలు పేర్కొన్నారు. అర్ధనగ్న ప్రదర్శన ఏపి భవన్ నుంచి పార్లమెంటు వరకు ఉంటుందని సీపీఐ ఒక ప్రకటనలో పేర్కొంది.

రాష్ట్ర బడ్జెట్ నేడే

(మొదటిపేజీ తరువాయి)

అందరి దృష్టి రాష్ట్ర బడ్జెట్‌పైనే ఉంది. బడ్జెట్‌పై రాష్ట్ర మంత్రి మండలి సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉదయం ఏడున్నర గంటలకు సీఎం నివాసం వద్దనున్న గ్రీవెన్స్ సెల్‌లో సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. ఇదిలావుండగా, బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఒక్క రోజు ముందుగా ప్రత్యేక హోదాలేదని కేంద్రం నుంచి స్పష్టమైన సంకేతాలు రావటంతో సీఎం చంద్రబాబుతోపాటు మంత్రులంతా తమ భవిష్యత్ కార్యాచరణపైనే దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌కు ఎవరూ అంత ప్రాధాన్యం ఇవ్వకపోటం గమనార్హం. ప్రతిపక్షాలు లేకుండా తొలిసారిగా రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనుండటం బహుశా ఇదే తొలిసారి కావచ్చు.

ఈ ఏడాది బడ్జెట్ సుమారు రూ.1.80 లక్షల కోట్ల నుంచి రూ.1.86 లక్షల కోట్ల వరకు రాష్ట్ర బడ్జెట్ ఉండొచ్చని అంచనా. తొలుత రూ.2 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడే స్వయంగా ప్రకటించారు. జాతీయ ప్రాజెక్టు పోలవరాన్ని 2018కల్లా పూర్తి చేసి గ్రావిటీ ద్వారా సాగునీటిని సరఫరా చేయాలని సీఎం చంద్రబాబు యోచిస్తున్నారు. కాని కేంద్రం నుంచి ఈ ప్రాజెక్టుకు చెప్పుకోదగిన రీతిలో నిధులు రాని పరిస్థితి నెలకొంది. అలాగే రాజధాని అమరావతి నిర్మాణం, అసెంబ్లీ, హైకోర్టు, రాజ్‌భవన్‌తోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కేటాయింపు రాష్ట్రానికి భారంగానే మారనుంది. మరోవైపు రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ, జలవనరులశాఖ, బీసీ సంక్షేమం, యువతకు అధిక ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణ ఎలా అంశంపై కసరత్తు చేసిన అనంతరం రూ.1.80 లక్షల కోట్ల నుంచి రూ.1.86 లక్షల కోట్లకు కుదించినట్లు తెలిసింది. అసెంబ్లీలో గురువారం ఉదయం 11.30 గంటలకు ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ఆ తర్వాత శాసనమండలిలో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అలాగే వ్యవసాయ బడ్జెట్‌ను అసెంబ్లీలో వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మండలిలో రవాణాశాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టనున్నారు.

అన్నిశాఖలకూ కోతలే...

ఈసారి అన్ని ప్రభుత్వశాఖలకు నిధుల కోత పడే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఏడాది రూ.1,56,999 కోట్ల బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆ బడ్జెట్ అంత అద్భుతంగాలేదని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈసారి కేంద్ర సహకారం లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టే బడ్జెట్‌లో మరిన్ని కోతలు కనిపించనున్నాయి. 2016-17లో రూ.1,35,689 కోట్లుగా ఉన్న బడ్జెట్‌ను రూ.1,56,999 కోట్లకు పెంచారు. ఈసారి దీనిని రూ.1,86,000 కోట్లకు పెంచితే రూ.23 వేల కోట్లు పెరిగే అవకాశం ఉంది. గత బడ్జెట్ రూ.81,310 కోట్లు పెరగ్గా, ఈసారి అందులో సగం కూడా పెరిగే అవకాశంలేదని ఆర్థికశాఖ అధికారులే చెబుతున్నారు.

ఏపీపై ఎందుకీ వివక్ష

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడంలో రాజీపడను : బాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : హోదాతో సహా విభజన చట్టంలోని అంశాలన్నీ తుచ తప్పక అమలు చేయాల్సిందేనని సీఎం చంద్రబాబు డిమాండు చేశారు. విభజన చట్టాన్ని, ఎన్నికల సందర్భంగా మోడీ ఇచ్చిన హామీలను, బీజేపీ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను గౌరవించాలని కోరారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని పురస్కరించుకొని గురువారం అసెంబ్లీలో చంద్రబాబు సుమారు రెండున్నర గంటల పాటు సుదీర్ఘంగా ప్రసంగించారు. రాష్ట్రానికి మేలు చేయాల్సిన గురుతర బాధ్యత నాపై ఉంది. కేంద్రం ఇవ్వాల్సిన నిధుల్ని కచ్చితంగా ఇవ్వాల్సిందే. ఏ మాత్రం రాజీపడబోం. హక్కులను సాధించుకొనేందుకు దేనికైనా సిద్ధం. కేంద్రం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవడం వల్ల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ప్రతి మనిషికి ఆత్మగౌరవం ఉంటుంది. అన్యాయం జరిగినప్పుడు అంతా ప్రశ్నిస్తారు. అదే ఇప్పుడు ఏపీలో జరుగుతోంది. సరిచేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందా లేదా అని చంద్రబాబు ప్రశ్నించారు. హోదా వేరే రాష్ట్రాలకు ఇచ్చినప్పుడు మాకెందుకు ఇవ్వరు. ద్రవ్య లోటును ఎందుకు పరిష్కరించరు. రెండు పార్టీలు కలిసి పొత్తుపెట్టుకున్నాయంటే లాభం వస్తుందనే తప్ప ఇంకొకటి కాదు. న్యాయం చేస్తారని చాలా ఓపిక పట్టాను. ఢిల్లీ చుట్టూ దాదాపు 29 సార్లు తిరిగాను. బడ్జెట్‌కి ముందు ప్రధానిని కూడా కలిసి రాష్ట్ర పరిస్థితి అంతా వివరించాను. అయినప్పటికీ చివరి బడ్జెట్‌లో ఏపీ గురించి కనీసం ప్రస్తావించలేదు. ఇక ఇప్పుడు కూడా అడగకపోతే ప్రజలు చరిత్రలో నన్ను క్షమించరనే బాధతోనే గట్టిగా అడిగాను. కేంద్రం తీరు సరిగా లేదు. తలసరి ఆదాయంలో దిగువన ఉన్నాం. ఆ రోజు యూపీఏ-2 ప్రభుత్వం రాష్ట్రాన్ని విడగొట్టినప్పుడు రాజకీయపార్టీలన్నీ పార్లమెంట్‌లో ఉన్నాయి. మొండి వైఖరి అవలంబిం చడం సరి కాదు. అది సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమవుతుంది. ఇందులో రాజకీయం ఏమీ లేదు.

మోడీయే అన్యాయం జరిగిందన్నారు

విభజన సమయంలో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ 'పురుడు పోసి తల్లిని చంపేశారని' వ్యాఖ్యానించారు. తాము అధికారంలో ఉంటే తల్లీబిడ్డను బతికించేవాళ్లమని చెప్పారు. నాడు రాజ్యసభలో ప్రధాని మన్మోహన సింగ్ 5 ఏళ్ళు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పగా, తాము అధికారంలోకి వస్తే పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని మోడీ తిరుపతి సభలో ప్రకటించారు. ఢిల్లీని తలదన్నేవిధంగా అమరావతి రాజధాని అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామికంగా ప్రోత్సాహం కల్పించేందుకు పన్ను రాయితీలు, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. ఇప్పుడెందుకు ఇవ్వడం లేదని చంద్రబాబు ప్రశ్నించారు. 14వ ఆర్థిక సంఘం వద్దని చెప్పినందువల్లే ఎవరికీ ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని ఇప్పుడు బీజేపీ అంటోందని, అలాంటప్పుడు ప్రస్తుతం హోదా కింద ఏయే రాష్ట్రాలకు ఎంతమేర నిధులు, సౌకర్యాలు కల్పిస్తున్నారో అవన్నీ ఏపీకి తప్పకుండా ఇవ్వాల్సిందేనని డిమాండు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని పునరుద్ఘా టించారు. విభజనాంశాలపై రెండు రోజుల్లో కేంద్రం స్పష్టత ఇవ్వాలని డిమాండు చేశారు. పోలవరం ప్రాజె క్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తే అనుకున్న సమయానికి పూర్తవుతుందని భావించి రాష్ట్రానికి ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసింది. రాష్ట్రానికి అది జీవనాడి. ఇప్పటివరకు పోలవరం కోసం రూ.13,054 కోట్లు ఖర్చు పెట్టాం. కేంద్రం దీని కోసం రూ.5,349.70 కోట్లు ఇచ్చింది. మనం ఖర్చుపెట్టిన దాంట్లో ఇంకా రూ.2,568 కోట్లు రావాల్సి ఉంది. రూ.4,932 కోట్లకు లెక్కలను పోలవరం అథారిటీ ద్వారా కేంద్రానికి పంపాం. పోలవరం అథారిటీకి ఎప్పటికప్పుడు వివరాలు ఇస్తున్నాం. అయినా లెక్కలు చెప్పలేదని చెప్పడం బాధేస్తోంది.

రెవెన్యూ లోటు తేల్చింది కేంద్రమే కదా !

రాష్ట్ర విభజన తర్వాత గవర్నర్ పాలనలో ఆదాయ లోటును నిర్ధారించారు. రెవెన్యూ లోటు రూ.16,072 కోట్లు ఉందని అప్పట్లో తేల్చారు. కేంద్రం మాత్రం రూ.3,900 కోట్లు మాత్రమే ఇచ్చింది. రెవెన్యూ లోటు గురించి అడిగితే లెక్కలు అడుగుతున్నారు. రెవెన్యూ లోటు కింద ఇచ్చిన నిధులకు లెక్కలు చెప్పాల్సిన అవసరం లేదు. విభజన తర్వాత ఆర్నెళ్లలోపు రైల్వేజోన్ ఇస్తామని కేంద్రం స్పష్టంగా చెప్పింది. నాలుగేళ్లయినా ఎందుకు ఇవ్వడంలేదని ఆయన ప్రశ్నించారు.

సీట్ల పెంపు కూడా పక్కనబెట్టారు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు విభజన చట్టంలో ఉంది. దీనివల్ల కేంద్రంపై పైసా భారం పడదు. అయినా దీనిని కూడా చేయడం లేదు. సీట్లు పెంచాలంటే నాకోసం అడుగుతున్నానని దుష్ప్రచారం చేస్తున్నారు. అందుకే నేను ఆ డిమాండును అడగడం లేదు. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్ అంశాలను అమలు చేయాలని కోరుతున్నాం. దీనినీ తేల్చడం లేదు. ఇక రాష్ట్రంలో 11 జాతీయ విద్యా సంస్థలకు రాష్ట్రం తరపున భూములు కేటాయించాం. వాటి నిర్మాణానికి ఇప్పటివరకు కేవలం రూ.420 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఇలా ఇస్తే వచ్చే 30 ఏళ్ళకు కూడా పూర్తి కావు. కేవలం వాటి ప్రహరీల కోసమే రాష్ట్ర ప్రభుత్వం రూ.130 కోట్లు ఖర్చు పెట్టింది. దుగరాజపట్నం పోర్టు నిర్మాణం సాధ్యం కాదంటున్నారు. ఎందుకు సాధ్యం కాదంటే చెప్పట్లేదు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి. అది మీ బాధ్యత. ఆంధ్రుల తరపున విభజనాంశాలను అమలు చేయాలని డిమాండు చేస్తున్నానని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

గుడ్‌బై..?

(మొదటిపేజీ తరువాయి)

తెలపాలనుకున్నా ఆయన అందుబాటులో లేరు. గత నెల రోజులుగా బీజేపీ-టీడీపీ మధ్య ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై చోటుచేసుకున్న వైరుధ్యాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరని మరోసారి అరుణ్‌జైట్లీ తేల్చిచెప్పడంతో.. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఢిల్లీలోని ఎంపీలతో చంద్రబాబు నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కొందరు కేంద్రంతో తెగతెంపులు చేసుకుందామని సూచించగా, మరికొందరు మరికొన్ని రోజులు వేచి చూద్దామన్న ధోరణిని వెలిబుచ్చినట్లు సమాచారం. ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అయితే ఇంకా తాత్సారం చేసినట్లయితే ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతామని గట్టిగా చెప్పినట్లు తెలిసింది.

దీంతో కేంద్రప్రభుత్వం నుంచి వైదొలగే అంశంపై కేంద్రమంత్రులు పి అశోక్‌గజపతిరాజు, వై సుజనచౌదరిలతో చంద్రబాబు రాత్రి ఫోన్ ద్వారా మాట్లాడారు. అధినేత నిర్ణయానికి వారు కట్టుబడి ఉంటామని, తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి కేంద్రంపై వత్తిడి పెంచుతామని బదులిచ్చినట్లు సమాచారం. ఇదే సమయంలో రాష్ట్రప్రభుత్వంలో ఉన్న బీజేపీ మంత్రులు కూడా మంత్రివర్గం నుంచి బయటకు వచ్చేందుకు గురువారం సీఎంను కలిసి రాజీనామాలు సమర్పించనున్నారు. ఈ విషయమై ఓ హోటల్‌లో సమావేశం జరిగింది. దీనికి ఆకుల సత్యనారాయణ, మాధవ్, విష్ణుకుమార్ రాజు హాజరయ్యారు

ప్రత్యేకహోదాపై జైట్లీ పాత పాట: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా ఇవ్వడం కుదరదని కేంద్ర ఆర్థికశాఖమంత్రి అరుణ్‌జైట్లీ మరోసారి ప్రకటించడాన్ని సీపీఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాజకీయ ఆందోళనలు, ప్రజల సెంటిమెంటు ఆధారంగా నిధుల కేటాయింపు ఉండదని జైట్లీ చెప్పడం ఏపీ ప్రజలను అవమానించడమే అన్నారు. పార్లమెంటులో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి, ప్రజా ఉద్యమాలను అవమానపరచడం గర్హనీయమన్నారు. రాష్ట్ర రెవెన్యూలోటు భర్తీకి రూ. 137 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉందని, రాయితీలు మొదటి రెండు సంవత్సరాల్లోనే ఇచ్చామని పేర్కొనడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర వైఖరిని నిరసించాలని సీపీఎం తరపున రాష్ట్ర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

హోదా భిక్ష కాదు.. హక్కు : కత్తి

విశాలాంధ్ర అమరావతి : ఏపీ కి ప్రత్యేక హెూదా బిక్ష కాదని ..ఆంధ్రుల హక్కు అని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు .బుధవారం మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా రాష్ట్రాన్ని విభజించారు ..విభజన హామీలను అమలు చేసే బాధ్యత కేంద్రం పైనే ఉందన్నారు.పోలవరం పునరావాసులకు రూ.33 వేలకోట్లు ఇవ్వలిసి ఉందన్నారు.మోడీ తిరుపతిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఢిల్లీ తరహా రాజధాని ఆంధ్ర ప్రజలకు నిర్మించి ఇస్తామని హామీఇచ్చారన్నారు.రాజధాని పూర్తి కావటానికి 48 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఆ మొత్తని కేంద్రం భరించాలన్నారు.9 ,10 షెడ్యూలు ప్రకారం ఆస్తుల పంపకాలు నాలుగు ఏళ్ళు గడిచిన న్యాయం జరగలేదన్నారు.చట్ట సభలో చేసిన వాటినే అమలు చేయకపోతే ,ప్రజలకు చట్ట సభలపై నమ్మకం పోతుందన్నారు.రైతులు గిట్టు బాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు.ఐదువేల కోట్ల తో రాష్ట్ర ప్రభుత్వం స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలనీ కోరారు.

స్వప్రయోజనాలకు హోదా సాకు : పవన్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదాన్ని సరిచేసుకునేందుకే ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ తమ పార్టీ అధికారంలోకి వస్తే తొలి సంతకం ప్రత్యేక హోదాపై పెడతామంటూ ప్రకటన చేశారని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు పోరాటం చేయాలన్నారు. నాలుగేళ్ల పాటు మంత్రి పదవులు అనుభవించిన నాయకులు రాజీనామాలు చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర మంత్రులు రాజీనామాలు చేయడం వల్ల ఏలాంటి ప్రయోజనం వుండదన్నారు. బుధవారం విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన పవన్ ప్రత్యేక హోదాను వివిధ రాజకీయ పక్షాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయని ఆరోపించారు. గత ఎన్నికల్లో తనను కొంత మంది వాడుకుని వదిలేశారనే భావన తనలో వుందని 2019లో తన వైఖరి ఏలా వుండబోతుందనే విషయాన్ని గుంటూరు సభలో వెల్లడించనున్నట్లు స్పష్టం చేశారు. మాఫియా లీడర్లు సైతం ఇచ్చిన మాట మీద నిలబడతారని కాని రాజకీయ నాయకులు మాత్రం ఇచ్చిన మాటపై ఏనాడు నిలబడరనే విషయం స్పష్టంగా అర్థం అయ్యిందన్నారు. తనను తాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించుకునే అవకాశాలు లేవని, టీడీపీ, వైసీపీ నేతలు కేసులకు భయపడుతున్నారని అందుకే హోదా విషయంలో వారు పూర్తిస్థాయిలో ఉద్యమాలకు సిద్ధం కావడం లేదని అన్నారు.

మధ్యంతర భృతి కోరుతూ 9న ధర్నాలు

ఆర్టీసీ ఈయూ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) ఉద్యోగులకు వెంటనే మధ్యంతర భృతి (ఐఆర్)ను ప్రకటించాలని కోరుతూ ఈనెల 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 128 డిపోలు, 4 జోనల్ వర్క్‌షాప్ యూనిట్ల వద్ద ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర నాయకులు వైవీరావు, కె పద్మాకర్, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఈమేరకు బుధవారం వారు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు జరగాల్సిన వేతన సవరణ గడువు దాటి ఏడాది గడుస్తున్నందున ఐఆర్‌ను ప్రకటించి ఆదుకోవాలన్నారు. తొలగించిన కాంట్రాక్టు కండక్టర్లు, డ్రైవర్లను పనుల్లోకి తీసుకొని రెగ్యులర్ చేయాలని వారు డిమాండు చేశారు. అలాగే 60 రోజుల స్పెషల్ క్యాజువల్ లీవు మంజూరుకు సర్క్యులర్ మంజూరు చేయాలనే తదితర డిమాండ్లతో ఈయూ పోరాటాలు సాగిస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 10వ తేదీన విజయవాడలోని కేంద్ర కార్యాలయంలో జరగబోయే ఈయూ రాష్ట్ర కమిటీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

టెట్ వెయిటేజీపై అభ్యర్థుల గాబరా..!

- డీఎస్సీకి కీలకంగా మారిన మార్కులు
- ఒక్కమార్కు తేడాతో పోటీలో మార్పులు
- రేపటితో ప్రాథమిక కీపై అభ్యంతరాలకు గడువు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్ రాసిన అభ్యర్థులలో వెయిటేజీపై గాబరా నెలకొంది.ఒక్క మార్కు తేడాతో వెయిటేజీ మారిపోనుంది. టెట్‌లో సాధించిన వెయిటేజీ మార్కులే డీఎస్సీ(టీఆర్టీ)లో పోటీ పడేందుకు కీలకంగా మారనున్నాయి.టెట్‌లో అతి తక్కువగా వెయిటేజీ సాధించి అర్హత సాధించిన వారంతా డీఎస్సీలో మరిన్ని మార్కులు పెంచుకోవాల్సి వుంది.త్వరలో టెట్ వెయిటేజీ మార్కుల్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం అధికారికంగా ప్రకటించనుంది.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏపీ టెట్‌ను 150 మార్కులకుగాను(ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు) నిర్వహించింది.ఈ పరీక్షకు మైనస్ మార్కుల్లేవు.టెట్‌లో 150 మార్కులకుగాను 20 మార్కుల వెయిటేజీని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కసారి టెట్ అర్హత సాధించిన అభ్యర్థులకు ఏడేళ్ల వరకూ అర్హత వుంటుంది. టెట్ అర్హత సాధించిన వారే డీఎస్సీకి దరఖాస్తు చేసేలా ప్రభుత్వం నిబంధన విధించింది.దీంతో 80 మార్కులకు నిర్వహించే డీఎస్సీకి టెట్ వెయిటేజీ యాడింగ్ కీలకంగా నిలుస్తుంది. టెట్‌లో అర్హత పొందాలంటే ఓసీ-90, బీసీ-75, ఎస్సీ,ఎస్టీ, పీహెచ్‌సీ-60 మార్కుల చొప్పున అర్హత సాధించాలి. టెట్‌లో 60 మార్కులు సాధించిన వారికి 8.00 వెయిటేజీ వస్తుంది.ఆయా కేటగిరీల ఆధారంగా వెయిటేజీ సాధించకుంటే అనర్హులవుతారు. 75 మార్కులు సాధించిన వారికి వెయిటేజీ 10.00గాను, 90 మార్కులకుగాను 12.00 వెయిటేజీ లభిస్తుంది.150 మార్కులకు 150 మార్కులు సాధించిన వారికి 20 మార్కుల వెయిటేజీ వుంటుంది.61 మార్కులు(8.13 వెయిటేజీ) నుంచి 150 మార్కుల మధ్యన ప్రతి మార్కునకూ వెయిటేజీ పెరుగు తుంది. డీఎస్సీలో 80 మార్కులకు నిర్వహించే మార్కులలో టెట్ వెయిటేజీ కలుస్తుంది.టెట్ పరీక్షను రాష్ట్రంలోని 13జిల్లాలతోపాటు హైదరాబాద్, చెన్నయి, బెంగుళూరు నగరాల్లో 190 కేంద్రాల్లో ఆన్‌లైన్లో జరిగాయి.పేపర్-1, పేపర్-2, పేపర్-3 పరీక్షలకు మొత్తంగా 4,46,833 మంది దరఖాస్తు చేయగా, వారిలో 4,10,828 మంది(91.94శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో తూర్పుగోదావరి జిల్లా నుంచి అత్యధికంగా 58,991 మంది హాజరవ్వగా, అతితక్కువగా అనంతం నుంచి 8,413 మంది పరీక్ష రాశారు. కర్నూలు- 35,083 మంది, చిత్తూరు-41,128, కడప- 24,721, ప్రకాశం-16,677, నెల్లూరు-19,234, గుంటూరు- 57,649, కృష్ణా-45,706, పశ్చిమ గోదావరి- 10,973, విశాఖపట్నం-58,071, విజయనగరం- 14,358, శ్రీకాకుళం-9,670, హైదరాబాద్-6,418, చెన్నయి-599, బెంగుళూరు-2,537 అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

ప్రాథమిక కీ అభ్యంతరాలకు గడువు ముగింపు

టెట్ ప్రాథమిక కీలో నెలకొన్న అభ్యంతరాల్ని తెలపేందుకుగాను అభ్యర్థులు ఈ నెల 9వ తేదీలోగా ఆన్‌లైన్లో పంపాల్సి వుంటుంది.అభ్యర్థుల హాల్ టిక్కెట్లు, పుట్టిన తేదీతో ఏపీ టెట్ వెబ్‌సైట్ నుంచి లాగిన్ అవ్వాలి. సంబంధిత ప్రశ్నకు కీలో తప్పిదం వుంటే వివరణాత్మకంగా తెలపాల్సి వుంటుంది.ప్రాథమిక కీ అనతరం ఫైనల్ కీను ప్రభుత్వం విడుదల చేయనుంది.

విజయవాడకు పూర్తిస్థాయిలో 'ఏపీపీఎస్సీ'

హైదరాబాద్ నుంచి ఫర్నీచర్, రికార్డుల తరలింపునకు చర్యలు
ఆగస్టు 11 నుంచి 26 వరకూ టెండర్ల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యాలయ విభాగాలను పూర్తిస్థాయిలో విజయవాడకు తరలించనున్నారు.రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్ల తర్వాత ఇటీవల విజయవాడ బందరురోడ్డులో ఏపీపీఎస్సీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో హైదరాబాద్ నాంపల్లి కేంద్రంగా ఏపీపీఎస్సీ కార్యాలయం వుంది.విభజన అనంతరం ఏపీలోని 13జిల్లాలకు చెందిన రికార్డులు, ఉద్యోగుల సమాచారం, రాష్ట్రానికి వాటాగా వచ్చిన కంప్యూటర్లు, ప్రింటర్లు, జెరాక్స్ మిషన్లు, ఫర్నీచర్, కార్యాలయ దస్త్రాలను ఇంతవరకూ తరలించలేదు.విజయవాడలో కార్యాలయం, హైదరాబాద్‌లో పూర్తిస్థాయి సమాచారం వుండటంతో ఏపీపీఎస్సీకి పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏపీపీఎస్సీ నుంచి ఉద్యోగ ప్రకటనల జారీలో పూర్తిస్థాయి అసౌకర్యం నెలకొంది.రిక్రూట్‌మెంటు కేలండరును క్రమంగా ప్రకటించడంతో అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి.

ఆగస్టు 11 నుంచి టెండర్ల స్వీకరణ

హైదరాబాద్ నుంచి ఏపీపీఎస్సీ కార్యాలయం ఫర్నీచర్, దస్త్రాల్ని తరలించేందుకుగాను ఆగస్టు 11 నుంచి 26 వరకూ టెండర్లను స్వీకరించనున్నారు.ఆసక్తిగల రవాణాదారులంతా హైదరాబాద్ నాంపల్లిలోగల ఏపీపీఎస్సీ కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి 5 గంటల మధ్య టెండర్లు దాఖలు చేయాలని అసిస్టెంట్ సెక్రటరీ సాయిరామ్ తెలిపారు.

అనుమానంలేదు.. హోదా ముఖ్యమే..!

- 14వ ఆర్థిక సంఘం వద్దంది
- కేంద్రం పెద్దల దృష్టికి రాష్ట్ర సమస్యలు
- బీజేపీ శాసనసపక్ష నేత విష్ణుకుమార్ రాజు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : 'హేతుబద్ధత లేకుండా విభజించిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ముఖ్యమే. ఈ విషయంలో ఎలాంటి అనుమానం అవసరంలేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని రాజ్యసభలో కోరింది బీజేపీయే. 14వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులో రాష్ట్రాల మధ్య వివక్షత చూపించొద్దని సిఫార్సు చేసింది. అందుకే కేంద్రం ప్రత్యేక ప్యాకేజీని అమలు చేస్తానన్నది. విభజన చట్టంలోని అంశాలే కాదు లేనివి కూడా అమలు జరుగుతున్నాయి. రాష్ట్ర సమస్యలను కేంద్ర పెద్దల దృష్టికి తీసుకువెళతాం' అని బీజేపీ శాసనపక్ష నేత పి. విష్ణుకుమార్‌రాజు అన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై విష్ణుకుమార్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అంటే బీజేపికి ఇష్టమని, రాష్ట్రానికి న్యాయం చేయాలనేదే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకే విభజన చట్టంలో పొందుపరిచిన సంస్థలతో పాటు లేనివాటిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విభజన చట్టంలో ప్రతి అంశాన్ని పరిశీలించాలని పేర్కొన్నప్పటికీ, రాష్ట్రానికి అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో అన్నింటినీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయ లబ్ధి, ఉనికి కోసం ప్రతిపక్షాలు ఆందోళన చేస్తుంటే, ఆ జాబితాలో ఈమధ్య మిత్రపక్షం టీడీపీ కూడా చేరిందని అన్నారు. ఒక వైపు సీఎం చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తిన విష్ణుకుమార్ రాజు, మరోవైపు కేంద్రంలోని బీజేపీ రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, ప్రాజెక్టులను సభకు ఏకరవు పెట్టారు. రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఆంధ్రప్రదేశ్‌శాఖ చూస్తూ ఊరుకోదని ఆయన స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలకు కేంద్రం ప్రకటించిన వరాలపై విమర్శలు చేయకూడదని, మనకు కావాల్సినవి అడిగి తెచ్చుకోవాలన్నారు.

హోదాపై నా భార్యే ప్రశ్నిస్తోంది : రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై తన భార్యే ప్రశ్నిస్తోందని విష్ణుకుమార్ సభలో ప్రస్తావించినపుడు సీఎంతో సహా సభ్యులంతా నవ్వులు పూయించారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీ, కేంద్రం ఏం చేస్తానందో వివరించినపుడు ఆమె సంతృప్తి చెందారన్నారు. హోదాలో ఉన్న లాభాలే, ప్యాకేజీలో ఉన్నాయని వివరించానని చెప్పుకొచ్చారు. తాను ఎవరికీ భయపడే ప్రసక్తేలేదని, ఉన్న విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెబుతానని పేర్కొన్నారు.

ప్రశ్న అడిగారు, సభలో లేరు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటు సమక్షంలో కేంద్ర ప్రభుత్వం చేసిన అన్ని వాగ్దానాలు నెరవేరాయా? అని ప్రతిపక్ష పార్టీ వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్న వారు లేకపోవడంతో చర్చకు నోచుకోలేదు. శాసనసభలో బుధవారం ఆయన ప్రశోత్తరాల కార్యక్రమంలో ప్రశ్న నెంబరు 3652గా ఎమ్మెల్యేలు బుగ్గన రాజేంద్రనాథ్, రాజన్నదొర, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే సభలో వారు లేకపోవడంతో దానిని వాయిదా వేసినట్లు స్పీకర్ కోడెల శివప్రసాద్ తెలిపారు. రాజ్యసభలో ప్రధానమంత్రి ఇచ్చిన 5 హామీలకు సంబంధించి అనుంధాన్ని మాత్రం ప్రశ్నావళికి జత చేసారు. కేంద్రం చేసిన వాగ్దానాలను వేగంగా నెరవేర్చ డానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలేవి? అనే ప్రశ్నకు ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు సమధాన మిస్తూ.. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరాయంగా సంప్రదింపులు జరుపుతోంది' అని పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలో జన్మభూమి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల సంఖ్య, గతంలో జరిగిన కార్యమాల్లో ఎన్ని దరఖాస్తులు అందాయి, వాటిలో ఎన్ని పరిష్కరించారనే విషయమై ప్రతిపక్ష వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్న నెంబరు 3653పై సభలో చర్చించి, రాష్ట్ర విభజన అంశానికి సంబంధించిన ప్రశ్నను వాయిదా వేయడం గమనార్హం.

హడావుడిగా సభ నుంచి బీజేపీ బయటకు...

శాసనసభ నుంచి బీజేపీకి చెందిన ఇద్దరుమంత్రులు కామినేని శ్రీనివాస్, పి మాణిక్యాలరావు శాసనసభపక్షనేత విష్ణుకుమార్‌రాజు సభ్యుడు ఆకుల సత్యనారాయణ బయటకు వెళ్లడం సభలో చర్చనీయాంశమైంది. సభ ప్రారంభమైన 9 నిముషాలకు విష్ణుకుమార్‌రాజు వద్దకు మంత్రులు ఇద్దరు వచ్చి మంతనాలు జరిపారు. తర్వాత నలుగురూ సభాపతిని బయటకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ నమస్కరించారు. కొద్ది నిముషాల తర్వాత ఒక్కొక్కరుగా సభలోకి వచ్చి వారివారి స్థానాల్లో కూర్చు కున్నారు. ఒకేసారి బీజేపీకి చెందిన నలుగురూ వెళ్లడంపై టీడీపీ సభ్యుల్లో చర్చించుకున్నారు. ఆ సమయంలో రాష్ట్రంలో జన్మభూమి కార్యక్రమం గురించి చర్చ జరుగుతోంది. ఒకపక్క ఎమ్మెల్యేలు ఈ ప్రశ్నకు అనుబంధంగా మాట్లాడు తుంటే మరోపక్క సభ్యులు బీజేపీ గురించి గుసగుసలాడు కోవడం కన్పించింది. ఇదిలా ఉండగా బీజేపీ మంత్రులు రాజీనామాలు చేస్తున్నారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ కథనాలను మంత్రి కామినేని ఖండించారు. 'ఢిల్లీ నుంచి తమకు ఎటువంటి సంకేతాలు, ఆదేశాలు లేవు..' అన్నారు.

గుంటూరులో అతిసారపై సమగ్ర విచారణకు ధూళిపాళ్ల డిమాండు

మెరుగైన వైద్యం అందించాలని స్పీకర్ సూచన

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : గుంటూరులో అతిసార ప్రబలి ఏడుగురు మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని ప్రభుత్వ విప్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర డిమాండు చేశారు. రాజధానిలో భాగంగా ఉన్న గుంటూరులో మంచినీరు కలుషితం కావటం వల్లే అతిసార ప్రబలిందన్నారు. అసెంబ్లీ బడ్జెట్‌లో సమావేశాలలో భాగంగా బుధవారం జరిగిన జీరో అవర్‌లో నరేంద్ర ఈ అంశాన్ని ప్రస్తావించారు. గుంటూరు నగరంలోని ఆనందపేట, పాత గుంటూరు, సంగడిగుంట, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో వందలాది మంది ప్రజలు అతిసార వ్యాధి ప్రబలటంతో ఆసుపత్రులలో చేరుతున్నట్లు సభ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే ప్రభుత్వం ప్రజలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన వైద్యం అందించటంతోపాటు ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని ఆయన కోరారు. అతిసార ప్రబలటానికి కారణాలను అన్వేషించాలన్నారు. దీనిపై స్పీకర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు కూడా స్పందించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇదిలావుండగా, గుంటూరు నగర ప్రజలకు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ల నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని సభలో ఉన్న పశుసంవర్థకశాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి వివరించారు.

మాజీ ఎమ్మెల్యేల మృతికి అసెంబ్లీ సంతాపం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : మాజీ ఎమ్మెల్యేల మృతికి అసెంబ్లీ బుధవారం సంతాపం ప్రకటించింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా ప్రశ్నోత్తరాల అనంతరం స్పీకర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇటీవల మృతి చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గాలి ముద్దు కృష్ణమనాయుడు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మాదాల జానకిరామ్, ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు, గిత్తలూరు ఎమ్మెల్యే పగడాల రామయ్య మృతికి సభ సంతాపాన్ని తెలియజేసింది. ఈ సందర్భంగా స్పీకర్ కోడెల మాజీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల అభివృద్ధి చేసిన కృషిని శ్లాఘించారు.

గోపాలమిత్రల వేతనం రూ.5 వేలు

అసెంబ్లీ జీరో అవర్‌లో మంత్రి ఆదినారాయణరెడ్డి

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : పశుసంవర్థక శాఖలో పని చేస్తున్న గోపాలమిత్రలకు నెలకు రూ.5 వేల వేతనం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పశు సంవర్థక శాఖ మంత్రి సీహెచ్ ఆదినారాయణరెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం జరిగిన జీరో అవర్‌లో ఈ మేరకు ప్రకటన చేశారు. త్వరలో దీనిని అమలు చేయనున్నట్లు తెలిపారు.

జీరో అవర్‌లో తిరుపతి శాసనసభ్యురాలు ఎ.సుగుణమ్మ గోపాలమిత్ర వేతనాల అంశాన్ని ప్రస్తావించారు. పశువులకు వైద్యం చేసేందుకు గ్రామాలకు సైతం గోపాలమిత్ర తక్కువ సమయంలోనే చేరుకుంటున్నారని, 108 అంబులెన్స్‌లతో పోటీగా వీరు పని చేస్తున్నట్లు ఆమె చెప్పారు. అందుకే ప్రభుత్వం వీరి అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి వేతనాలు పెంచాలని కోరారు. ఆ సమయంలో సభలోనే ఉన్న మంత్రి ఆదినారాయణరెడ్డి సమాధానమిస్తూ, త్వరలోనే గోపాల మిత్రల వేతనాలను రూ.5 వేలు పెంచనున్నట్లు చెప్పారు. పామర్రు ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన మాట్లాడుతూ చంద్రన్న బీమా పథకంపై ప్రజల్లో పలు అనుమానాలు ఉన్నాయని, వాటిని తక్షణమే నివృత్తి చేయాలన్నారు. బీమా వయస్సు, బీమా పరిహారంపై స్పష్టత లేదన్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వారు ప్రమాదంలో మృతి చెందితే రూ.5 లక్షలు, సాధారణంగా మృతి చెందితే రూ.2 లక్షలు పరిహారం ఇస్తున్నట్లు తెలిపారు. ఇటీవల తన నియోజకవర్గంలో ఒక డిగ్రీ విద్యార్థి మృతి చెందితే పరిహారం వర్తించదని బీమా మిత్రలు చెప్పారని, కాని అతను రూ.15 చెల్లించే బీమా చేయించుకున్నట్లు చెప్పారు. అలాగే 60 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు వయస్సున్న వారు మృతి చెందినా ఎంతో కొంత పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ధర్మవరం ఎమ్మెల్యే జి.సూర్యనారాయణ మాట్లాడుతూ, ధర్మవరం ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినా తగినన్ని డాక్టర్ పోస్టులు లేవన్నారు. ఐదారుగురు డాక్టర్లు రోగులకు సరైన వైద్యం అందించలేకపోతున్నట్లు తెలిపారు. సుమారు 12 మండలాల నుంచి ప్రజలు ఆస్పత్రికి వస్తున్నందున తగినన్ని డాక్టర్ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ మాట్లాడుతూ శాఖ నగరంలోని మద్దెలపాలెం, హనుమంతువాక వద్ద ఫ్లై ఓవర్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యం ఆ రెండు జంక్షన్‌లలో ట్రాఫిక్ స్తంభిస్తోందన్నారు షాపింగ్ మాల్స్, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గమని, అందువల్ల ఫ్లై ఓవర్‌లు నిర్మించాలని కోరారు. అమలాపురం ఎమ్మెల్యే ఎ.ఆనందరావు మాట్లాడుతూ గోడి మండల పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి అల్లవరంలో సీహెచ్‌సీని ఏర్పాటు చేశారని, కాని పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించకపోవటంతో ఇబ్బంది కలుగుతోందన్నారు. అలాగే గోడిలోని పీహెచ్‌సీని పూర్తిగా అల్లవరం సీహెచ్‌సీకి తరలించాలన్నారు. కనిగిరి ఎమ్మెల్యే కదిరి బాబూరావు మాట్లాడుతూ నిమ్మ, బత్తాయి తోటలకు ట్యాంకర్ల ద్వారా సాగునీటిని సరఫరా చేయాలని కోరారు. రంపచోడవరం ఎమ్మెల్యే రాజేశ్వరి మాట్లాడుతూ ఫింగర్ ప్రింట్స్ పడకపోవటం వల్ల వృద్ధులకు పింఛన్లు ఇవ్వటం లేదన్నారు. పెనుగొండ ఎమ్మెల్యే బి.కె.పార్థసారధి మాట్లాడుతూ అనంతపురం - బెంగళూరు జాతీయ రహదారిపై పాలసముద్రం, కృష్ణదేవరాయ, రాప్తాడు కూడళ్లలో ఫ్లై ఓవర్లు లేదా అండర్ పాస్‌లు నిర్మించి, రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కోరారు. మడకశిర ఎమ్మెల్యే కె.ఈరన్న మాట్లాడుతూ లోటు వర్షపాతం అధికంగా ఉన్న మడకశిరలో 0.6 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.



డిజిటల్‌కు ఏపీ రోల్‌మోడల్

విజయవాడలో ఎంపీలు, ఎమ్మెల్యేల విచారణకు ప్రత్యేక కోర్టు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రంలో ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల విచారణ కోసం విజయవాడలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టును బుధవారం హైదరాబాద్ నుంచి ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు జడ్జి జస్టిస్ వి.రామసుబ్రహ్మణియన్ డిజిటల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల పరిధిలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసులన్నీ విజయవాడ ప్రత్యేక కోర్టుకు బదలాయించి విచారణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడ ప్రత్యేక న్యాయమూర్తి, 14 మంది ఉద్యోగులు ఉంటారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కేటగిరీలో 124 కేసులు ఉన్నట్లు ఆయన చెప్పారు. దేశ వ్యాప్తంగా ఇటువంటి కేసుల విచారణకు 12 కోర్టులు పనిచేస్తున్నట్లు వివరించారు. డిజిటల్ విధానంలో కోర్టులను ప్రారంభించడంలో ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్‌గా నిలుస్తోందని చెప్పారు. కృష్ణాజిల్లా జ్యుడిషియరీ ఎక్కువ కోర్టు కేసులు పరిష్కారంలో న్యాయపరమైన విధానంలో ముందుండటమే కాకుండా ఆదర్శంగా కూడా నిలుస్తోందన్నారు. దేశంలోనే డిజిటల్ విధానంలో మూడు కోర్టులు ప్రారంభించిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. ఇంతకు ముందు తిరువూరు, జగ్గయ్యపేటలో ప్రారంభించామని వివరించారు. ప్రజలకు విశిష్టమైన సేవలు అందించడంలో బెజవాడ బార్ అసోసియేషన్ కీలకమైన బాధ్యతలను నిర్వహిస్తోందన్నారు. సాంకేతికంగా సహాయ సహకారాలు అందించిన వాసవి కళాశాల డిపార్ట్‌మెంట్ హెడ్ డా.హరికృష్ణ, బీఎస్ఎన్ఎల్ అధికారి ఎస్.శ్రీనివాసులను, న్యాయవాదులను ఆయన అభినందించారు. కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి వై.లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ ప్రత్యేక కోర్టు ద్వారా కేసుల పరిష్కారం త్వరితగతిన చేపట్టి తీర్పులు వెల్లడించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రత్యేక కోర్టుల జడ్జిగా 8వ అదనపు డిస్ట్రిక్ట్ జడ్జి ఎస్.రమేష్‌బాబుకు పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఏపీ రవీంద్రబాబు, 8వ అడిషనల్ జిల్లా జడ్జి, ప్రత్యేక కోర్టు జడ్జి ఎస్.రమేష్‌బాబు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ కందుల శ్రీనివాస్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో శీతల గిడ్డంగులు

- ఒక్కో గిడ్డంగికి రూ.2.45 కోట్ల వ్యయం
- శాసనసభలో మంత్రి ఆదినారాయణరెడ్డి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ శీతల గిడ్డంగులను నిర్మించనున్నట్లు మార్కెటింగ్, గిడ్డంగులు, పశుసంవర్థక శాఖ మంత్రి పి.ఆదినారాయణరెడ్డి తెలిపారు. మిరప, పసుపు, చింతపండు వంటి నిత్యావసర వస్తువులకు రైతు బంధు పథకం (ఆర్‌బీపీ)ని విస్తరింపచేస్తామన్నారు. శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. తొలుత 13 శీతల గిడ్డంగుల నిర్మాణానికి టెండర్లను పిలిచి ఏప్రిల్‌లో పనులు చేపడతామన్నారు. ఒక్కో గిడ్డంగి నిర్మాణానికి రూ.2.45 కోట్ల వ్యయం కానుందని, 4 వేల టన్నుల సామర్థ్యంతో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. నిర్దేశించిన ప్రాంతంలోని నిజమైన రైతుకు ఆర్‌బీపీ కార్డుల జారీని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లు కట్టుదిట్టం చేయాల్సి ఉందన్నారు. తొలుత నిడదవోలు ఎమ్మెల్యే బి.శేషారావు మాట్లాడుతూ సాధారణ, శీతలీకరణ గిడ్డంగుల అవసరం చాలా ఉందన్నారు. పుంత రోడ్లను అభివృద్ధి చేసి ఇతర రోడ్లతో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు నియోజకవర్గాల వారీగా ఏఎంసీలను పున: వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్ర చౌదరి మాట్లాడుతూ ఆర్‌బీపీలో రైతులు రుణాలు పొందేందుకు విపరీతమైన జాప్యం జరుగుతోందని, దానిని నివారించాలని కోరారు. కోవూరు ఎమ్మెల్యే పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏఎంసీ నిధుల నుంచి పుంతలు, లింక్ రహదారులను నిర్మించాలన్నారు. పాలకొల్లు ఎమ్మెల్యే ఎన్.రామానాయుడు మాట్లాడుతూ ఆర్‌బీపీకి మరింత ప్రచారం జరగాలని, ఇందులో కేవలం 3వేల మంది రైతులే సభ్యులుగా ఉన్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తెనాలి ఎమ్మెల్యే ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతంలో పశుక్రాంతి పథకంలో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన అనేక పశువులు మరణించిన విషయాన్ని ప్రస్తావించారు. మంత్రి ఆదినారాయణరెడ్డి స్పందిస్తూ స్థానిక వాతావరణ పరిస్థితులను తట్టుకోలేకపోవడంతో పాటు జీవక్రియరాహిత్యం, వత్తిడి, గాయాలు తదితర కారణాల వల్ల ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన పశువులు మరణించాయన్నారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిని పెంచేందుకు సంకరణాన్ని నివారించడమే కాకుండా మెరుగైన జెర్మ్ ప్లాస్మాను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా వ్యాధుల నివారణ కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున చేపట్టేందుకు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి చెప్పారు.

40 లక్షల మందికి ఉచిత విద్య : చంద్రమోహనరెడ్డి

రాష్ట్రంలో ఉచిత విద్యను 40 లక్షలకు పైగా విద్యార్థులకు అందచేస్తున్నట్లు మంత్రి చంద్రమోహనరెడ్డి వివరించారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు 35,41,000 మందికి, ఇంటర్మీడియట్ విద్యార్థులు 5,34,757 మంది, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు 4,670 మందికి ప్రభుత్వం ఉచితంగా విద్యను అందచేస్తోందన్నారు. అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఫీజును రీయింబర్స్ చేస్తున్నట్లు చెప్పారు.

క్వారీ ప్రమాదాల్లో 14 మంది మృతి : మంత్రి సుజయకృష్ణ రంగారావు

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ క్వారీల్లో జరిగిన ప్రమాదాల్లో 14 మంది మరణించినట్లు మంత్రి సుజయకృష్ణ రంగారావు తెలిపారు. ఎమ్మెల్యేలు టి.శ్రావణ్‌కుమార్, పి.గోవింద సత్యనారాయణ, అప్పలనాయుడు, కె.రవికుమార్ అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ మైన్‌సేఫ్టీ కార్యాలయం నవ్యాంధ్రలో ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. గనుల్లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు నిర్దేశించిన నిబంధనలు నిర్వాహకులు తప్పకుండా పాటించాలన్నారు. లేదంటే లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగిన ఘటనకు సంబంధించి మృతుల కుటుంబాలకు నిర్వాహకుల నుంచి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

సంపాదకీయం

బాల్యానికి 'మూడు ముళ్లు'

పసితనం పలుపుతాడుకు బలైపోతోంది. బాల్య వివాహాల్లో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఆధునికత, ఉన్నత విద్య, మహిళల ముందంజ.. వంటి పదాలు చెప్పుకోవడానికే తప్ప ఆచరణలో అంతగా కనిపించడం లేదు. ముఖ్యంగా వివాహ వ్యవస్థలో స్త్రీ పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. మన సమాజం ఎదుర్కొంటున్న సామాజిక సమస్యల్లో బాల్య వివాహం ప్రధానమైనదిగా తయారైంది. ప్రపంచంలో 40 శాతం బాల్యవివాహాలు మనదేశంలోనే జరుగుతున్నాయని యునిసెఫ్ లెక్కతేల్చింది. దేశంలో ఏటా 2.66కోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయి. వర్ధమాన దేశాల్లోని 24ఏళ్లలోపు మహిళల్లో మూడొంతులమంది 18ఏళ్లలోపు వివాహం అయినవారే ఉన్నారు. దేశంలో రాజస్థాన్ 3.7 శాతంతో మొదటిస్థానాన్ని ఆక్రమించగా, మహారాష్ట్ర 2.9, ఆంధ్రప్రదేశ్ 1.6, మిజోరం 1.2 శాతాలతో తదుపరి స్థానాల్లో ఉన్నాయి. బాల్య వివాహాలకు కుల, మత భేదాల్లేవు. ధనిక, బీద తారతమ్యం లేదు. చదువు, డబ్బు, హోదా వంటివి కూడా బాల్య వివాహాల నుంచి యువతులను కాపాడలేకపోతున్నాయి. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 32.7శాతం బాలికలకు, 23.5శాతం బాలురకు మైనారిటీ తీరకముందే పెళ్లిళ్లు చేసేస్తున్నారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో 35శాతం, పట్టణ ప్రాంతాల్లో 15.2 శాతం అమ్మాయిలకు 18 ఏళ్లలోపే వివాహాలు జరుగుతున్నాయి. అబ్బాయిల విషయానికొస్తే గ్రామీణ ప్రాంతాల్లో 32.3 శాతం, పట్టణాల్లో 14.5శాతం మందికి బాల్యవివాహాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం పేదరికం, నిరక్ష్యరాస్యత, అవగాహనలోపం, ఆడపిల్లను భారంగా భావించడం, ఆచారాలు, మూఢనమ్మకాలే. బాల్య వివాహాల వల్ల అధిక సంఖ్యలో అమ్మాయిలకు గర్భస్రావాలవంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయి. ఆటపాటలతో ఎదగాల్సిన పిల్లలు రక్తహీనతకు గురై బలహీనమవుతారు. ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ల చిన్నారుల్లో 60.8శాతం, 15-49ఏళ్ల లోపు మహిళల్లో 60.2శాతం, 15-49ఏళ్ల లోపు గర్భిణుల్లో 52.9శాతం, 15-49ఏళ్ల లోపు పురుషుల్లో 26.9శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. మాతృమరణాల సంఖ్య పెచ్చరిల్లుతోంది. ఏటా 70వేలమంది 15-19 సంవత్సరాల వయస్సు బాలికలు ప్రసవ సమయంలో మరణిస్తున్నారు. 18ఏళ్లలోపు వివాహం చేయడం వల్ల శారీరక ఎదుగుదల లేక పోషకాహార లోపాలతో పుడుతున్న పిల్లలు ఎక్కువగా అకాల మృత్యువాత పడుతున్నారు. చిన్న వయసులో పిల్లలు పుడితే పసిపిల్లలకు రక్తహీనతతోపాటు జన్యులోపసమస్యలూ ఉత్పన్నమవుతున్నాయి. గృహహింసకు గురవుతున్న ఆడపిల్లల్లో 15 ఏళ్లలోపువారే అధికం. చిన్న వయస్సులో పెళ్లిళ్లతో భార్యభర్తల మధ్య అవగాహనలేమి తలెత్తి విడాకులకు దారితీస్తున్న కేసులూ పెరుగుతున్నాయి. ఈ సంక్షోభంలో చిక్కుకున్న అమ్మాయిలు కొందరు సులభంగా అక్రమ రవాణాకు ఎర అవుతున్నారు. వీటిని నిరోధించే లక్ష్యంతోనే వివాహాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలనీ, ఆధార్‌తో అనుసంధానిస్తూ చట్టం తీసుకురావాలని ఇటీవల లా కమిషన్ సిఫార్సు చేసింది. వివాహాల నమోదు తప్పనిసరి చేస్తూ ప్రతి దేశమూ చట్టం తీసుకురావాలని ఐక్యరాజ్యసమితి నాలుగు దశాబ్దాల కిందటే ఈ ఒడంబడిక తీసుకువచ్చింది. దీనిపై మన ప్రభుత్వం కూడా సంతకం చేసింది. అయితే 1993లో ఆ ఒప్పందాన్ని ధ్రువీకరించే సందర్భంగా పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేస్తున్న ఒప్పందంలోని 16(2) అధికరణం ఆచరణ సాధ్యం కాదంటూ చేతులెత్తేసింది. ఇలా నమోదు లేకపోవడం వల్ల జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు అన్యాయం జరుగుతున్నప్పుడు.. ఎన్ని అవరోధాలనైనా అధిగమించి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నమోదు ఒక్కటే పరిష్కారం కాదనుకుంటే, దాంతోపాటే చేయాల్సినవేమిటో గుర్తించి అమలు చేయాలి. ఈ నమోదు వల్ల బాల్య వివాహాలను అరికట్టగలగడమే కాదు, ఎన్నారై పెళ్లిళ్లలో చోటుచేసుకుంటున్న అన్యాయాలను నివారించడం, అవివాహితుణ్ణి అని చెప్పి నలుగురైదుగురిని పెళ్లాడే నేరగాళ్లను కట్టడి చేయడమూ వీలవుతుంది. పెళ్లికి సంబంధించిన వయసు నిర్ధారణలో మనం అనేక మార్పులు చేసుకుంటూ వస్తున్నాం. వాస్తవానికి 1860లో బాలిక వివాహానికి వయసు నిర్ధారించలేదు కానీ, భర్తతో కాపురం చేయడానికి పదేళ్ల వయసును అప్పటి సమాజం నిర్ణయించింది. 1891లో బ్రిటిష్ ప్రభుత్వం బాల్యవివాహాల నిరోధ చట్టాన్ని తెచ్చింది. 12సంవత్సరాల లోపు ఆడపిల్లల వివాహాలను నిషేధించింది. 1929లో వివాహవయస్సు 14 ఏళ్లకు పెంచుతూ శారద చట్టాన్ని తెచ్చారు. 2006లో మార్పులుచేసి 18 ఏళ్లు నిండని బాలికలకు, 21 ఏళ్లు నిండని బాలురకు వివాహాలు చేయడం నేరంగా పరిగణించారు. ఆ తర్వాత 18ఏళ్లలోపు వారికి వర్తించేలా లైంగిక వేధింపుల నుంచి పిల్లల రక్షణ చట్టం (2012) తెచ్చారు. 2017లో సుప్రీంకోర్టు ఐపీసీ 375ను అమలులోకి తీసుకువచ్చింది. దీని ప్రకారం బాలికను వస్తువుగా చూడరాదని, ఆమెకూ ప్రాథమిక హక్కులున్నాయని పేర్కొంది. కాబట్టి బాలికతో శృంగారం అత్యాచారం కిందకే వస్తుందనీ, 375 సెక్షన్ ప్రకారం నేరానికి పాల్పడ్డ వ్యక్తికి మినహాయింపులు లేవని కూడా సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇన్ని రక్షణ చట్టాలున్నా బాల్యవివాహాలను అవేవీ అడ్డుకోలేకపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో పెళ్లయినట్టు సాక్ష్యం చూపలేక, భార్యగా గుర్తింపులేక, వారసత్వహక్కులు పొందలేక, భరణం రాక మహిళలు రోడ్డున పడుతున్నారు. ఒక్కోసారి పిల్లల కస్టడీ కూడా సమస్యవుతోంది. పెళ్లిళ్లపై అధికారిక రికార్డులు లేకపోవడం వల్ల మోసగాళ్ళు సులువుగా తప్పించుకుంటున్నారని 2005లో సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఆ వెంటనే జాతీయ మహిళా కమిషన్ ఒక బిల్లును కూడా రూపొందించింది. ఈ క్రమంలో మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేశాయి. దేశంలో ప్రధానమైన హిందూ, ముస్లిం, క్రైస్తవ, పార్శీ మతాలకు వేర్వేరుగా వైయక్తిక చట్టాలున్నాయి. 1872నాటి క్రైస్తవ వివాహ చట్టం, 1936నాటి పార్శీ వివాహచట్టం పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశాయి. ముస్లిం వైయక్తిక చట్టం ప్రకారం నిఖానామాలో వివాహాన్ని కాజీ నమోదు చేస్తారు. 1955నాటి హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 8లో పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ గురించి ఉన్నా మత విశ్వాసాల ప్రకారం పెళ్లి చేసుకున్నాక దాన్ని నమోదు చేయించుకోవడమా లేదా అన్నది ఆ జంటకే విడిచిపెట్టారు. ఏ మతానికీ సంబంధంలేని 1954నాటి ప్రత్యేక వివాహ చట్టం ఉంది. అయితే హిందూ వివాహచట్టం తప్పనిసరి చేయకపోవడంవల్ల అధిక సంఖ్యాకులు వివాహ నమోదు ప్రక్రియ జోలికే పోవడం లేదు. ఈ నిబంధన ఉంటే బాల్య వివాహాల జోరుకు అడ్డుకట్టపడుతుంది. బాలల ప్రత్యేక సంరక్షణ పట్ల శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరముందని 1924లోనే బాలలహక్కులపై జెనీవా ప్రకటన విడుదలైంది. వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీచేసే వ్యవస్థలను కట్టుదిట్టం చేయాలి. ప్రతి జిల్లాకు బాల్య వివాహాల నిరోధక అధికారి ఉంటారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వారు విధిగా అమలు చేయాలి. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి. చిన్న వయసు వివాహాల వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు, ఇతర అనర్థాలను తల్లిదండ్రులకు బోధించాలి. బాల్య వివాహాల కట్టడి కోసం ప్రభుత్వాలతోపాటు, పౌరసంఘాలూ పాటుపడాలి. అప్పుడే బాల్యవివాహాల దురాచారానికి అడ్డుకట్ట పడుతుంది. బాలికల బంగారు భవిష్యత్తుకు మార్గం సుగమం అవుతుంది. అందుకొరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సంఘాలు కంకణబద్ధులు కావాలి.

చంద్రబాబు పోరాడరని తేలిపోయింది!

విశ్లేషణ



కంచల జయరాజ్

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని , దీనికి కేంద్ర ప్రభుత్వమే కారణమని పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని పదే పదేకేంద్రం తెగేసి చెపుతున్నా ఇంకా సావధానంగానే మాట్లాడు తున్నారు. ఐదుకోట్ల మంది ఆంధ్రుల తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు కూడా అసెంబ్లీలో చెప్పారు. కేంద్రం గతంలోనే ప్రత్యేకహోదా ఇచ్చేదిలేదని తేల్చింది.విభజనచట్టంలోని హామీ లను దశలవారీగా అమలు చేస్తామని కూడా చెప్పింది. అయితేగత కొన్నిరోజులుగా బీజ;పీ నాయకత్వం తెలుగుదేశం ప్రభుత్వంపైన కారాలు, మిరియాలు నూరుతోంది. ప్రతిగా సమాధానం ఇవ్వబోయిన తెలుగుదేశం పార్టీ నాయకత్వాన్ని అనుక్షణం వారించే యత్నమే చేశారు చంద్రబబునాయుడు. కానీ బుధవారం నాడు అసెంబ్లీలో రెండున్నరగంటల పాటు ముఖ్యమంత్రి మాట్లాడారు. బడ్జెట్ సమావేశాలకుగవర్నర్ చేసినప్రసంగానికి ధన్యవాదాలు చెప్పేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అనేక కీలకమైన అంశాలను కూడా ప్రస్తావించారు. అయితే అవేవీ కొత్తవి మాత్రంకావు. ఇప్పటి వరకూ అందరూ చర్చించుకునేవే. అందరికీ తెలిసినవే.కొత్తగా ముఖ్యమంత్రి చెప్పిన అంశాలు తనపై ఎలాంటి కేసులు లేవని,తాను నిప్పులాంటి మనిషిని అని. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తాను పోషించిన పాత్రగురించి కూడా ఆయన తనప్రసంగంలో వివరించారు. అయితే అందరూ ఊహించిన విధంగా ముఖ్యమంత్రి ప్రసంగం లేదు. ఒకవైపు కేంద్రం రాష్ట్రానికి అన్యాయంచేసిందని అంటూనే మరో వైపు విజ్ఞాపనలు చేయడం ఏమిటన్నది ప్రశ్న. ప్రత్యేకహోదా అనేది ఆంధ్రుల హక్కు అయినపుడు దాన్ని ఇస్తామని కేంద్రం చెప్పి అధికారంలోకి వచ్చినపుడు ఇప్పుడు మాట మార్చి తప్పుకుంటే నిలదీయాల్సిన అవసరం లేదా? నొప్పింపక.. తానొవ్వక.. తప్పించుకు తిరిగేలా వ్యవహరిస్తే రాష్ట్ర ప్రయోజనాలు ఏమవ్వాలి? పత్ర్యేకహోదా విషయంలో బీజ;పీ ప్రభుత్వం మాట తప్పిన విషయాన్ని రాష్ట్రప్రజలకు తెలిసేలా చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపైన ఉంది. అదేవిధంగా ప్రత్యేకహోదా విషయంలో గతంలో రాజీపడటానికి కారణాలనుకూడా తెలియ జేయాల్సిన అవసరం ఉంది. ప్యాకేజీ సరిపోతుంది అనడానికి కారణం ఏమిటోకూడా రాష్ట్ర ప్రజలు ఇప్పుడు చంద్రబాబునుంచి తెలుసుకోవాలనుకుంటున్నారు. కేంద్రం నుంచి ఇప్పటి వరకూ 3.75 లక్షలకోట్ల రూపాయలు రాష్ట్రానికి వచ్చినట్లు బీజేపీ నాయకత్వం పేర్కొంటుంటే దానికి సరైన సమాధానం కూడా ఇప్పటివరకూ ఇవ్వలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గడచిన మూడున్నరేళ్లలో ఏ రాష్ట్రానికి ఏ కేంద్రప్రభుత్వం అందించనంత సాయం మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అందించిందని బీజేపీ అధికారికంగా ప్రకటిం చింది. విభజన చట్టంలో చెప్పిన సంస్థలను 83వ సెక్షన్ ప్రకారం పదేళ్లలో ఏర్పాటు చేయాలని అదే చట్టంలో గడువు విధించడాన్ని కూడా బీజేపీ అధికారికంగా వెల్లడించింది. కానీ కేంద్ర ప్రభుత్వం గడచిన మూడున్న రేళ్లలో 85శాతం ప్రాజెక్టులను మంజూరు చేసి ప్రారంభించినదని కూడా బీజేపీ వివరించింది. వీటితోపాటు శాఖల వారీగా ఇప్పటి వరకూ చేసినకేటాయింపుల గురించి బీజేపీ పూసగుచ్చినట్లు అధికారికంగాప్రకటించింది.దీనిపై తెలుగుదేశం పార్టీలోని కింది స్థాయినాయకత్వం విభిన్నంగాస్పందించింది. కానీ ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు మాత్రం అసెంబ్లీలో అన్నింటికీ సమాధానం ఇచ్చారు.అయితే కేంద్రం మాత్రం ఇప్పటి వరకూ ఆంధ్రాకు ఇచ్చిన నిధులకుసంబంధించి లెక్కలు చెప్పలేదని, తగినబిల్లులు అందివ్వలేదనేపేర్కొంటోంది. ముఖ్యమంత్రి మాత్రం అన్నీ ఇచ్చేశాం.బిల్లులు ఏమీ ఇవ్వాల్సిన అవసరం లేదనే చెప్పారు.

ఎప్పటిలాగే బాబు ప్రసంగం!

ప్రత్యేకహోదా విషయంలో కేంద్రం తేల్చి చెప్పినా సరే ముఖ్యమంత్రిచంద్రబాబు మాత్రం ఇంకా నాన్చుడు ధోరణే అవలంభిస్తున్నారు. కేంద్రంపై కొంతమేర పరుషంగా మాట్లాడాలని ప్రయత్నించి, మళ్లీ సర్దుకున్నారు. ముఖ్యమంత్రి ప్రసంగం సందర్భంగా అందరూ ఆసక్తిగా ఎదురు చూశారు. కేంద్రాన్నితూర్పారపడతారు, బీజేపీతో తెగదెంపులు చేసుకుంటారు అనే చర్చజరిగింది. ముఖ్యమంత్రి ప్రాజెక్టుల వారీగాచెప్పే గణాంకాలు, సాధించే ప్రగతి గురించి చెప్పేటప్పుడు అసెంబ్లీలోని ఎమ్మెల్యేలుసైతం నీరసపడినట్లు కన్పించింది. ఎక్కువ మంది తెలుగుదేశం సభ్యులు బీజేపీతో తెగదెంపులుచేసుకోవాలనే కోరుకుంటున్నారు. ప్రజలనుంచి అదే స్థాయిలో సంకేతాలు ఉన్నాయనే అంశాన్ని ముఖ్యమంత్రికి కూడా చెప్పారు. ఎందుకో ముఖ్యమంత్రి ఇంకా సావధాన ధోరణి ప్రదర్శిస్తున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన రూ.21.57 లక్షలకోట్ల బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌ప్రస్తావనలేదు. అమరావతి, పోలవరం నిర్మాణాల గురించి ఎక్కడా మాటమాత్రంగా అయినా ఎర్కొనలేదు. విశాఖరైల్వేజోన్,విభజన హామీల గురించి, పెండింగ్ ప్రాజెక్టుల గురించి ప్రస్తవన కూడా చేయలేదు. కొత్త రాష్ట్రం అయినా, అనేక ఆర్థికసమస్యలు ఉన్నా, ప్రత్యేక నిధుల కేటాయింపులు లేకపోవడాన్ని ముఖ్యమంత్రి సభలో మరోసారి ప్రస్తావించారు. కానీ కేంద్రం పదే పదే ప్రత్యేకహోదా ఇచ్చేదిలేదు, ఇప్పటికే చాలా ఇచ్చాం. అని చెపుతున్నా సరే ముఖ్యమంత్రి స్వరం పెంచకపోగా, ఆంధ్రులు ఆత్మాభిమానం, తన పనితనం గురించి వివరించే యత్నమే చేశారు. దీనివల్ల ఒనగూరే ప్రయోజనం ఏమాత్రం ఉండదని అందరికీ తెలుసు. ప్రత్యేకహోదా సంజీవినికాదు అన్నముఖ్యమంత్రే ఇపుడు ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు అని పేర్కొంటున్నారు. ప్రత్యేకహోదా పదేళ్లపాటు ఇస్తామని చెప్పిన బీజేపీ అగ్రనేతలను ప్రశ్నించక పోవడంపై ఇప్పుడు అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నాలుగేళ్లుగా పన్నెత్తి మాట అనకుండా, అన్నీ వచ్చేస్తాయి,కేంద్రం సానుకూలంగా ఉంది, రాష్ట్రానికి మోడీ న్యాయం చేస్తానన్నారు అని ఇన్నాళ్లు ఆయన నమ్మి ప్రజల్ని కూడా నమ్మేలాచేశారు. తీరా ఇప్పుడు కూడా కేంద్రంపై పోరాడేదిశగా శక్తుల్ని కూడగట్టుకోకుండా, విన్నపాలు, విజ్ఞాపనలు చేసినందువల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని ముఖ్యమంత్రి ఇప్పటికైనా తెలుసుకుంటే బాగుంటుంది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని పోరాటం చేస్తేనే వచ్చింది. ప్రత్యేకహోదా గతించిన అధ్యాయం అని బీజేపీ చెప్పినంతమాత్రానరాజీ పడాల్సిన పనిలేదు. పోరాట పటిమ ఉంటేనే సాధించుకోగలం. ఈ విషయంలో ఇంకా సాచివేతధోరణి అవలంభిస్తే భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుంది. ప్రత్యేకహొదా ఇవ్వకపోవడానికి కేంద్రంఅనేక కారణాలు చూపుతుంది. కానీ ఇచ్చిన హామీని విస్మరించే కేంద్రాన్నిఎందకునిలదీయడం లేదు? చెప్పింది చేయకుండా మోసపూరిత ధోరణిఅవలంభించే బీజేపీతో ఇంకా ఎందుకు చెలిమిచేయడం? ఎన్డీయే ప్రభుత్వంలో కొనసాగడం? అన్నింటితో పాటు వీటికికూడా ముఖ్యమంత్రి అసెంబ్లీలో సమాధానం ఇచ్చిఉంటే రాష్ట్రప్రజలు నిజం ఏమిటో గ్రహించేవారు.కానీ ఇవితప్ప అన్నీమాట్లాడారు. కేంద్రం ఇస్తానన్నవి ఏమిటి, ఇచ్చినవి ఏమిటి? వచ్చిన నిధులు ఏమిటి? ఖర్చు ఏ మేరకు చేశారు. వంటి అంశాలపై ఇప్పటి వరకూ బీజేపీ నాయకత్వం చేసిన అభియోగాలకు ముఖ్యమంత్రి వివరణ ఇచ్చారే తప్ప, ఆంధ్రుల ఆత్మాభిమానం, ఐదుకోట్ల మంది ఆగ్రహం గురించి మాట్లాడ లేదు.

ఇప్పుడు రాజీ ధోరణి ఏమాత్రం ఉపయోగం లేదు. తెగింపువిధానాన్ని అవలంభిస్తేనే కేంద్రం కదులుతుంది. దీనికి అన్ని పక్షాలను సమాయాత్తం చేయాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకహోదా విషయంలో ఐదుకోట్లమంది ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఫిబ్రవరి 8వ తేదీన జరిగినబంద్ దీనికి నిదర్శనం. దీన్ని గుర్తించిన చంద్రబాబు ఇప్పుడు స్వరం మార్చారు. ప్రత్యేకహొదా గురించి మళ్లీ మాట్లాడుతున్నారు. ప్రత్యేక హోదానా, ప్రత్యేక ప్యాకేజీనాఅన్నది ఆయనకే స్పష్టత లేదు. అందుకే జనసేనధినేత పవన్‌కళ్యాణ్‌కూడా చంద్రబాబు మాట్లాడే విధానం అందరినీ అయోమయానికి గురిచేస్తోంది అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉండి, సీనియర్ రాజకీయనేతగా ఉండి, కేంద్ర,రాష్ట్రాల్లో కీలకమైన పాత్ర పోషించినచంద్రబాబు ఇపుడు స్వతంత్రంగా వ్యవహరించ లేకపోతున్నారు. పవన్‌కళ్యాణ్ వేసిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం, వైసీపీ వేసినసవాల్‌కు రెడీ అనడం, బీజేపీ చేసిన అభియోగాలకు వివరణలు ఇవ్వడంతోనే చంద్రబాబు సమయం సరిపోతుంది. రాజకీయ వ్యూహాన్ని రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రూపొందించడం, అమలు చేయడంలో ఇటీవలి కాలంలో చంద్రబాబు బాగా వెనుకబడుతున్నారు. దీనికి వ్యక్తిగత, పార్టీపరమైన భయాలే వెన్నాడుతున్నాయని భావిస్తున్నారు. ఇపుడున్న పరిస్థితుల్లో బీజేపీతో తెగదెంపులు చేసుకుంటే తెలుగుదేశం పార్టీకి కలిసి వస్తుంది. కొనసాగితే నష్టమేజరుగుతుంది. బీజేపీతో టీడీపీ తెగదెంపులు చేసుకుంటే వైసిపి ఎక్కడ బీజేపీతో మైత్రి కొనసాగిస్తుందో అన్నభయం కూడా చంద్రబాబులో ఉంది. మరోవైపు ఇప్పటి వరకూ ఇచ్చిన నిధులకు లెక్క, జమా ఖర్చులపై కేంద్రం నుంచి ఇప్పటికే ఆరాతీయడం ఆరంభించారు. ఈవిషయంలోనూ కొంత ఇబ్బంది అవుతుందనే భయం కూడా ఉందని భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రధాని మోడీ కక్షపెట్టుకుంటేఎక్కడివరకైనా వెళతారనే భయంకూడా ఉంది. అనేక రాష్ట్రాల్లో పరిస్థితులు దీనికి నిదర్శనంగా చూపిస్తున్నారు. బీజేపీ కిందిస్థాయినాయకత్వం సైతం తెలుగుదేశం పై నిప్పులు చెరుగుతున్నా, తెలుగుదేశంనాయకత్వాన్నిపన్నెత్తు మాట అననీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటికీ అదే ధోరణి ప్రదర్శించడం వల్ల చంద్రబాబులో తెగింపు తగ్గిందనే భావన ఏర్పడుతోంది. ఇపుడు రాష్ట్రానికి న్యాయం జరగాలి. ప్రత్యేకహొదా కావాలి. విభజన చట్టంలోనిఅంశాలు అమలు కావాలి. దీనికోసం నాలుగేళ్లుగా విన్నపాలు చేశారు. ససేమిరా అన్న కేంద్రంపై ఇంకా ఎందుకు పోరాటం చేయడానికి వెనకాడతారు? దీనికి చంద్రబాబే నాయకత్వం వహించి, ప్రజా ఉద్యమాన్ని నిర్మించవచ్చు. కానీ ఈ దిశగా చేపట్టే చర్యలు ఇప్పటి వరకూ అడుగు ముందుకు వేయడం లేదు. ప్రత్యేక హోదా ఇవ్వకపోతే బీజేపీకి ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అదనపు ప్రయోజనం ఏమీలేదు. కానీ తెలుగుదేశంపార్టీకి మాత్రం ప్రత్యేకహొదా సాధించకపోతే తీరని నష్టమే జరుగుతుంది. ఈ విషయాన్నిచంద్రబాబు గుర్తించాల్సి ఉంది. ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారు. వామపక్షాలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షం సైతం ప్రత్యేకహొదా కోసం కేంద్రంపై అమీతుమీకి సిద్ధం అంటున్నాయి. ఇప్పటికైనా పోరాటానికి సంసిద్ధం అయితేనే చంద్రబాబుపై రాష్ట్రప్రజలకు నమ్మకం కలుగుతుంది.

వ్యాస రచయిత : అధ్యక్షులు, విజయవాడ ప్రెస్‌క్లబ్

సెల్ : 9848992299

మహిళా సాధికారతతోనే సమాజ పురోగమనం

పోతుల సునీత, ఎంఎల్సీ

మన దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలు శారీరక, మానసిక, లైంగిక, ఆర్థిక హింసకు బలవుతున్నారు. మహిళలపై హింసకు సంబంధించి ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదికలో ఎన్నో దిగ్భ్రాంతికరమైన నిజాలు వున్నాయి. ఆదిమ సమాజంలో పురుషునితో సమానంగా స్త్రీ స్వేచ్ఛ అనుభవించింది. "అడవికి వెళ్ళా-పిట్టను కొట్టా-పొయ్యిలో పెట్టా' అనేంత కాలం స్త్రీ స్వేచ్ఛకు ఆటంకం రాలేదు. సంతానోత్పత్తి కారణంగా స్త్రీ ఇంటికి పరిమితం అయి పురుషుడు బయటకు వెళ్ళి సంపాదన ప్రారంభించటంతో విభజన మొదలైంది. అంతరాల దొంతర లాంటి సమాజంలో పురుష బానిసకు మరో బానిసగా స్త్రీ మారింది. పురుషస్వామ్య సమాజంలో నేటికి తల్లకిందు భావనలే సవ్యమైనవిగా చలామణీ కావటం విచిత్రం. మనిషి పుట్టకకు, యవ్వనంలోనూ, వృద్ధాప్యంలోనూ, నిరంతరం స్త్రీ పైనే ఆధారపడి వుంటాడు. కానీ స్త్రీ పరాధీన అనటం మనుస్మృతిని అణువణువున జీర్ణించుకుని పోయిన పురుషులకు అలవాటై పోయింది.

స్త్రీ హక్కుల గురించి సాధికారత గురించి మాట్లాడగానే అది పురుషులకు వ్యతిరేకం ఏమాత్రం కాదు. అంతర్జాతీయ ఆర్థిక వేదిక వెలువరించిన స్త్రీ పురుష సమానత నివేదిక-2017లో 144 దేశాల జాబితాలో భారత్ 108వ స్థానంలో వుండటం చాలా విషాదం. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఝాన్సీ లక్ష్మీబాయి నుంచి కెప్టెన్ లక్ష్మీ సెహగల్, అరుణా అసఫలీ, కల్పనాదత్ లాంటి వారి వరకు ఎందరో మహిళలు అసాధారణ ప్రతిభ చూపించారు. కానీ క్రమంగా రాజకీయాల్లో మహిళ ప్రాధాన్యం తగ్గుతోంది. 1993 నాటికి 73-74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పించారు. పార్లమెంట్లోనూ, రాష్ట్రాల శాసనసభల్లోనూ మహిళలకు మూడో వంతు ప్రాతినిధ్యం కల్పించాలన్న బిల్లు నేటికి 22 ఏళ్ళు గడిచినా పార్లమెంట్ ఆమోదం పొందలేదు. పార్లమెంట్లో మహిళల ప్రాతినిధ్యం మన దేశంలో 12శాతం, బంగ్లాదేశ్లో 20శాతం, పాకిస్తాన్లో 17.5 శాతం వుంది. స్కాండినేవియన్ దేశాలైన డెన్మార్క్ నార్వే స్వీడన్లో మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ ఎప్పటినుంచో వుంది.

2011లో భారత రాష్ట్రపతి, లోకసభ స్పీకర్, ప్రతిపక్ష నాయకురాలు లాంటి అత్యున్నత పదవులను మహిళలు చేపట్టినా మహిళా రిజర్వేషన్ బిల్లులో కదలిక రాలేదు. మార్చి 9, 2016న మహిళా రిజర్వేషన్ బిల్లు వెంటనే ఆమోదించాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రపంచంలోనే మొదటిసారిగా జాతీయ మహిళా పార్లమెంట్ ను 2017, ఫిబ్రవరిలో విజయవాడలో జరిపి 'అమరావతి డిక్లరేషన్' ను 2017, నవంబర్ 17న ప్రకటించారు. విద్య, చట్టపరమైన హక్కులు, ఆరోగ్యం-పోషకాహారం, ఎంటర్ప్రేనర్షిప్, రీసెర్చి మరియు ఇన్నోవేషన్, రాజకీయాలు, సామాజిక భద్రత, సమతుల్య అభివృద్ధి లక్ష్యాలు, సామాజిక అభివృద్ధి-డిజిటల్ అక్షరాస్యత లాంటి పది అంశాలపై దృష్టి సారించి మహిళల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అమరావతి డిక్లరేషన్ కార్యాచరణ ప్రణాళిక సూచించింది.

బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహాలు లాంటి సాంఘిక దురాచారాలు రూపుమాపేందుకు కందుకూరి వీరేశలింగం లాంటి వారు చేసిన కార్యాచరణ మనకు ఆదర్శం కావాలి. ఇలాంటి సమస్యలు ప్రస్తుతం మరో రూపం తీసుకుంటున్నాయి. ఆడపిల్లలకు వేధింపులు, వరకట్న సమస్య, గృహహింస పెరిగిపోతున్నాయి. గృహ హింస చట్టం కూడా పురుషస్వామ్య భావజాలానికి అడ్డుకట్ట




వేయలేకపోతోంది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ నివేదిక ప్రకారం ప్రతి 44 నిమిషాలకు ఒక కిడ్నాప్, 47 నిమిషాలకు ఒక రేప్, 17 నిమిషాలకు ఒక వరకట్న హత్య జరుగుతున్నాయి. స్త్రీల పట్ల ఘోరమైన నేరాలు జరుగుతుంటే సమాజం చూపిస్తున్న నిర్లిప్తత ఆందోళన కలిగిస్తోంది.

మనకు రాజ్యాంగం ప్రకారం అన్ని హక్కులు వున్నాయి. కానీ ఆచరణలో మాత్రం వెనుకబడి వున్నాం. రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్ అన్నట్లు "ఆచరణలోకి రాని చట్టాలు ఎన్ని మాత్రం వుంటే ఏం?" అనేది ఎంతో నిజం. అప్పుడూ, ఇప్పుడూ స్త్రీ జీవించే హక్కు కోసం, స్వేచ్ఛ, భద్రతల కోసం, ప్రైవసీ కోసం, రాజ్యాంగబద్ధ హక్కుల కోసం పోరాడుతూనే వుంది. చట్టం తన పని తాను చేయకపోవడం వల్ల, పోలీసులు శాంతి భద్రతలను మాత్రమే తమ బాధ్యతగా భావించడం మహిళల దుస్థితికి మరో కారణం జనాభాలో సగభాగం వున్న మహిళల మీద జరుగుతున్న హింసని నివారించాల్సిన, అడ్డుకట్ట వేయాల్సిన అంశంగా పోలీసులు భావించకపోవడం వల్ల ప్రభుత్వాలు చేసిన సర్వ చట్టాలు బూడిదలో పోసిన పన్నీరుగా పనికి రాకుండా పోతున్నాయి.

సతీ సహగమనం దురాచారాన్ని వ్యతిరేకిస్తూ నాటి బ్రిటిష్ పాలకులు చట్టం చేశారు. సతీ సహగమనం వద్దని ఈ రోజు ఎవరికీ చెప్పాల్సిన పనిలేదు. సంఘ సంస్కార స్థాయి ఆ మేరకు పెరిగింది. వరకట్న నిషేధ చట్టం వున్నప్పటికీ కూడా కట్నం సమస్య అలానే వుంది. స్త్రీ సంక్షేమ చట్టాలు చేయటంతో పాటు, అమలు కోసం గట్టి చర్యలు , ప్రణాళిక అవసరం. మహిళ పురుషుడితో సమానమని, ఎందులోనూ తక్కువ కాదని చిన్నతనం నుంచే ప్రతి మగవానికి తలిదండ్రులు చెబుతూ ఉత్తమ సంస్కారాన్ని అందించటం అవసరం. 'ఆడపిల్లగా పుట్టినందుకే నాకు ఇన్ని కష్టాలు' అని ఏ ఆడపిల్ల అనుకోకుండా సమాజంలోని సంస్కార స్థాయి పెరిగేందుకు , పితృస్వామ్య భావజాలాన్ని వ్యతిరేకించేందుకు అందరమూ కృషి చేయాలి. మహిళా సాధికారితతోనే సమాజ పురోగతి సాధ్యం అని గుర్తించాలి. అప్పుడే మహాకవి గురజాడ చెప్పినట్లు ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాయగలదు'.

(నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)

ఆమెకున్న విలువ!



(అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)

ఆమె జీవితాన్నిచ్చింది!
ఆమె ఒక భార్య! ఆమె ఒక తల్లి!
ఆమె ఒక స్నేహితురాలు! ఆమె ఒక సోదరి!
జీవితాంతం అలా కొనసాగుతుందామె!
ఆమెను ప్రశంసించడానికి మనం ధైర్యం చేయం!
ఆమె బాధలను మనం పట్టించుకోం!
అదృశ్యంగా కార్చే ఆమె కన్నీరు తుడుద్దాం!
ఆమె వంటపనితో, ఇంటిపనితో
సతమతమౌతుంటుంది!
తన బాధలు దిగమింగుతూ
ఇతరుల సౌఖ్యం కోసం
నవ్వుతూ బతుకుతుంది!
నిన్ను కష్టాల కడలి నుంచి బయటకు లాగుతుంది!
ఇంత చేసే ఆమెకు మనం ఇచ్చిందేమిటి!
మానసిక వేదన, దిగులు!
ఆమె సలహాలకు విలువనీయకపోవడం
దేనికీ పనికిరానిదానివని ప్రక్కకి తోసేయడం!
ఆమెపై లైంగిక దాడి చేస్తారు!
ఆమెను చిత్రహింసలు పెడ్తారు!
ఆమెను బూతులతో సత్కరిస్తారు!
నీ ఉనికే ఈ లోకంలో దండగంటారు!
ఆమె తన ఆత్మగౌరవాన్ని దిగమింగుకొని
తన ఉద్వేగాలను పక్కన పెట్టేస్తుంది!
నీవు కోరినట్లు ప్రవరిస్తుంది
నీ అజ్ఞానాన్ని పట్టించుకోదు
నీ తప్పులు సహిస్తుంది!
కాని ఆమెను నీవు బండ బూతులతో సత్కరిస్తావు!
అయినా ఆమె గాంభీర్యం వీడదు!
ఆత్మత్యాగం చేస్తుంది!
ఆమెను నీవు పనికిరాని దానవంటావు!
నేనైతే ఆమెను సబల అనీ, చురుకైనదనీ,
సహనశీలియనీ, శక్తిమంతమైనదనీ,
ఆమెను స్త్రీ అని అంటాను.

ఆంగ్లమూలం - అజ్ఞాతకవి
అనువాదం - కొత్తపల్లి రవిబాబు

విశాలాంధ్ర
బతుకు
The Life
గురువారం
08 మార్చి 2018





ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే పద్ధతి నుంచి మహిళలను విముక్తి చేయాలని సూచిస్తూ 1932లో సోవియట్ యూనియన్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన వాల్‌పోస్టర్

> శ్రామిక జనావళి ఉద్యమానికి ఎదురయ్యే అత్యంత ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానాలివ్వ గలిగే విధంగా మహిళల ప్రచారం ఉండాలి
>
> - క్లారా జెట్కిన్

వామపక్ష మహిళా ఉద్యమ ధృవతారలు

- డా. కె. రజని,
ఆం. ప్ర. మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు



క్లారా జెట్కిన్



జర్మన్ కమ్యూనిస్టు ధృవతార, ప్రపంచ వామపక్ష మహిళా ఉద్యమ నిర్మాత అయిన క్లారా జెట్కిన్ 5 జూలై 1857 లో జర్మనీలోని ఈస్నర్ సంపన్న కుటుంబంలో జన్మించారు. పదిహేడవ ఏటనే టీచర్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో చేరిన ఆమె (నాలుగేళ్ళు శిక్షణ) ఈ సమయంలోనే వామపక్ష భావాలను అలవర్చుకున్నారు. ఆమె తన రాజకీయ జీవితాన్ని మహిళా సాధికారతకోసం పోరాటాలకే వెచ్చించారు. శ్రామిక మహిళలు వర్గ దృక్పధాన్ని అలవర్చుకొని, పురుష కార్మికులతో సమానంగా, భుజంకలిపి పోరాడాలంటూ ఆమె తాను నడిపే 'డీ గ్లీష్ హైట్' పత్రిక ద్వారా స్త్రీల ఉద్యమానికి రూపమిచ్చారు. 1881లో జర్మన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ వ్యవస్థాపకులలో ఆమె ఒకరు. తన ఆప్త మిత్రురాలు, సహచరి అయిన రోజా లక్జంబర్గ్‌తో కలిసి వామపక్ష స్త్రీ ఉద్యమ నిర్మాణానికి అంకురార్పణ చేసి, ఒక ప్రపంచ వ్యాప్త ఉద్యమంగా మలచటానికి విశేష కృషి చేశారు. తన భర్త ఓసిప్ జెట్కిన్ జర్మనీ నుండి దేశ బహిష్కరణకు గురయినప్పుడు, ఆమె కూడా ఆయనతోబాటు స్విట్జర్లాండ్, పోలండ్ తదితర దేశాలలో తలదాచుకుని, వివిధ దేశాల విప్లవకారులతో సన్నిహిత సంబంధాలను పెంచుకున్నారు. 1890లో జర్మనీకి తిరిగి వచ్చిన తరువాత ఆమె సోషల్ డెమోక్రాటిక్ పార్టీలో చురుకుగా పనిచేశారు. స్త్రీ కార్మికులకు పురుషులతోబాటు సమాన వేతనాలు కావాలని, స్త్రీలకు ఓటు హక్కు కావాలని చరిత్రలో తొలిసారిగా నినదించిన వ్యక్తి క్లారా జెట్కిన్. ఆ తరువాత, ఆమె లేవనెత్తిన ఈ డిమాండ్లను ప్రపంచవ్యాప్తంగా వామపక్ష మహిళా ఉద్యమాలు అనుసరించాయి. మార్చి 8వతేదీని అంతర్జాతీయ మహిళాదినంగా పాటించాలని తొలిసారిగా సూచించిందీ క్లారా జెట్కినే. జర్మన్ విప్లవకారులలో అంతర్జాతీయ సంఘీభావాన్ని పెంపొందించటంలో ఆమె ఎనలేని కృషి చేశారు. జర్మన్ రీచ్ స్టాగ్ (పార్లమెంటు)కు పలుమార్లు ఎన్నికైన ఆమె కార్మిక, కర్షకుల వాణిని వినిపించారు. రెండవ ఇంటర్నేషనల్ (సోషలిస్టు ఇంటర్నేషనల్) నిర్మాణంలో విశేష కృషి చేసిన ఆమె అంతర్జాతీయ విప్లవోద్యమానికి అంకురార్పణ చేశారు. ఫ్రెడరిక్ ఏంగెల్స్ ఆమె విప్లవ కృషిని ప్రశంసించారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ఆరంభమయినప్పుడు, జర్మన్ సోషల్ డెమోక్రాట్ పార్టీలో చీలిక వచ్చింది. యుద్ధాన్ని వ్యతిరేకించే అతివాదులంతా కలిసి కార్ల్ లీబ్నెక్ట్, రోజా లక్జంబర్గ్ తదితరుల నాయకత్వాన స్పార్టక్ లీగ్‌గా ఏర్పడి విప్లవోద్యమ నిర్మాణానికి కృషిచేశారు. లీబ్నెక్ట్, రోజాలను కుట్రపూరితంగా హత్యచేసిన జర్మన్ ప్రభుత్వం తర్వాత స్పార్టక్ లీగ్‌ను అణచివేసింది. క్లారా జెట్కిన్ అజ్ఞాత జీవితం గడుపుతూ జర్మన్ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషిచేశారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఆమె కోమింటర్న్‌లో పనిచేయటానికి సోవియట్ యూనియన్ వెళ్ళి మాస్కోలోనూ ఉన్నారు. ఆమెకు వ్లాదిమిర్ లెనిన్, ఇతర ప్రపంచ కమ్యూనిస్టు నాయకులతో సన్నిహిత స్నేహ సంబంధాలు ఉండేవి. 1932లో జర్మనీ పార్లమెంటులో అందరికంటే సీనియర్ సభ్యురాలిగా సత్కారాన్ని అందుకుంటూ ప్రసంగించిన ఆమె హిట్లరు ఫాసిజానికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ శక్తులూ కలిసి పోరాడాలని పార్లమెంటు సాక్షిగా పిలుపునిచ్చారు. 1933లో తన 75వ ఏట ఆమె మాస్కోలో తుదిశ్వాస విడిచారు. ఆరులక్షల మంది కమ్యూనిస్టులు ఆమె అంతిమ క్రియలకు హాజరయ్యారు. ఆమె విప్లవజీవితాన్ని, త్యాగ నిరతిని ఈనాటికి కూడా జర్మన్ ప్రజలు గౌరవిస్తారు.

అరుణా అసఫాలీ



విప్లవకారులు భగత్ సింగ్, గురుదేవ్‌ల తరపున లాహోర్ కోర్టులో వాదనలు వినిపించిన లాయరు, వీరనారి అరుణా అసఫ్ అలీ. 1909 సంవత్సరం జూలై 16న ఆనాటి పంజాబ్‌లోని కల్కా పట్టణంలో సంప్రదాయ బెంగాలీ కుటుంబంలో జన్మించారు. లాహోర్‌లోని సేక్రెడ్ హార్ట్స్ కాన్వెంట్‌లోనూ, నైనిటాల్‌లోని ఆల్‌సైంట్స్ కాలేజీలోనూ విద్యనభ్యసించారు. తర్వాత ఉపాధ్యాయ వృత్తి స్వీకరించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు అరుణా గంగూలీ కాగా తన 19వ ఏటనే, కాంగ్రెస్ నాయకుడు, తన కంటే 23 ఏళ్ళు పెద్ద అయిన అసఫ్ అలీని వివాహమాడి అరుణా అసఫ్ అలీగా మారారు. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, ఒక ముస్లిమ్‌ను వివాహమాడినందుకు ఆమె బంధువులు ఆమెకు బ్రతికుండగానే శ్రాద్ధకర్మలు నిర్వహించి, ఆమెను బహిష్కరించారు. అయినా తన భర్తతో కలిసి ఆమె స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలు పాలయ్యారు. విడుదల అనంతరం మళ్ళీ 1931లో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని 'వీరనారి'గా పేరుగాంచారు. జైలులోనూ ఆమె పోరాటబాటను వీడలేదు. ఖైదీలపై అమానుషంగా ప్రవర్తిస్తున్న ఢిల్లీ తీహార్ జైలు అధికారులపై నిరాహారదీక్షతో తిరుగుబాటు బావుటా ఎగురవేసి ఖైదీలకు అందే ఆహారం, సదుపాయాల విషయంలో ప్రభుత్వం లొంగి వచ్చేటట్లుగా విజయాన్ని సాధించారు. ఆమెపై కక్షతో, ఆమెను పురుష ఖైదీలను మాత్రమే ఉంచే అంబాలా జైలుకు తరలించి, అక్కడ ఒంటరి జీవితాన్ని గడిపేటట్లుగా నిర్బంధించారు. ఆ కాలంలోనే ఆమె సోషలిస్టు భావాలకు ఆకర్షితులయ్యారు. జైలునుండి విడుదల తరువాత, ఆమె తిరిగి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని కాంగ్రెస్‌లోని సోషలిస్టులతోబాటు, "కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ" లో ప్రముఖ పాత్ర వహించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా నడుస్తున్న రోజుల్లో, ఆమె బొంబాయిలో జరుగుతున్న కాంగ్రెస్ మహాసభలకు (ఏఐసీసీ) హాజరయ్యారు. సభ జరుగుతుండగా కాంగ్రెస్ నాయకులందరినీ అరెస్టు చేసినప్పటికీ ఏ మాత్రం జంకకుండా అరుణ బొంబాయిలోని గౌలియా టేంక్ మైదానంలో జాతీయ జెండా ఎగురవేసి, బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టులద్వారా ఉద్యమాన్ని ఆపలేదని నినదించారు. ఆమె ధైర్యాన్ని స్పూర్తిగా తీసుకుని, దేశ వ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమాలు ఉవ్వెత్తున లేచాయి. నాయకులందరినీ నిర్బంధించినా ఉద్యమానికి అరుణ నాయకురాలుగా మారి మొక్కవోని ధైర్యంతో నడిపించినందునే బ్రిటిష్ వారికి ముచ్చెమటలు పట్టాయి. ఈ ఉద్యమాన్ని అణచటం అసాధ్యమనిపించేలా ఆమె బ్రిటీష్ అధికారులకు గుణపాఠం నేర్పారు. అందుకు ప్రతిగా, ఆమెపై అరెస్టు వారంటు జారీచేసి, ఆమెను పట్టుకుంటే 5000 రూపాయల బహుమానాన్ని ప్రకటించారు. అరుణ అజ్ఞాతంలోకి వెళ్ళి కమ్యూనిస్టులతో కలిసి పోరాటాన్ని కొనసాగించారు. పిచ్చెక్కిన బ్రిటీషు అధికారులు ఆమె ఆస్తిని, ఇంటిని జప్తు చేశారు. 1946లో భారత సైనిక దళాలు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా బొంబాయిలో తిరుగుబాటు చేసినప్పుడు అక్కడకు వచ్చిన ఆమె వారిని తన ఉత్తేజకరమైన ప్రసంగాలతో ముందుకు నడిపించారు. సైనిక తిరుగుబాటులో పాల్గొన్నందుకు ఆమెపై గాంధీగారు ఆగ్రహం చెందినా లెక్కచేయలేదు. బ్రిటీషువారికీ లొంగలేదు. స్వాతంత్ర్యానంతరం ఆమె భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి, 1953లో అఖిల భారత మహిళా సమాఖ్యను స్థాపించారు. ఢిల్లీ నగరానికి తొలి మహిళా మేయరుగా ఎన్నికైన అరుదైన గౌరవం ఆమెకే దక్కింది. భర్త చనిపోయినా ఒంటరిగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఇద్దరు బిడ్డలనూ పెంచారు. ఢిల్లీలో పేట్రియట్ దినపత్రికని, లింక్ పత్రికను దీర్ఘకాలంపాటు నిర్వహించారు. పాత్రికేయురాలిగా, మంచి విలువలతో, వామపక్ష ఉద్యమానికి ఎనలేని సేవలందించారు. గాంధీ, నెహ్రూ, రజని పామీదత్, క్రిష్ణమీనన్, రామ్ మనోహర్ లోహియా, జయ ప్రకాష్ నారాయణ్, ఇందిరా గాంధీ వంటి అగ్రనాయకులతో ఆమెకు ఎంతో సాన్నిహిత్యం ఉండేది. ఆమె ఎన్నడూ దర్పాలకు పోలేదు. భారత ప్రభుత్వం ఆమెకు ఒక బంగళాను ఇచ్చినా, ఆమె దానిని పేట్రియట్ పత్రిక ఆఫీసుగా వినియోగించి, తన భర్త పేరున ఉన్న అసఫ్ అలీ రోడ్డులోని ఒక చిన్న అపార్టుమెంటులో సామాన్య జీవితాన్ని గడిపారు. 1996 జూలై 29న, తన 87వ ఏట ఆమె తుది శ్వాస విడిచే వరకూ, ప్రజాసేవలోనే నిమగ్నమయ్యారు. 1992లో ఆమెను పద్మ విభూషణ్‌తో సత్కరించారు. 1964లో లెనిన్ శాంతి బహుమతి అందుకున్నారు. మరణానంతరం భారతరత్న పురస్కారాన్ని పొందారు. భారతదేశంలో లక్షలాదిమంది ఆడబిడ్డలకు అరుణ అనే పేరు ఆమె స్పూర్తితోనే పెట్టారంటే ఆశ్చర్యం కాదు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జర్మనీతో 1914లో విడుదలైన పోస్టర్. దీన్ని జర్మనీ ప్రభుత్వం నిషేధించింది

> మనలో సగం వెనుకాడితే మనం అన్నింటా విజయం సాధించలేము
>
> - మలాలా



కల్పనా జోషి



బ్రిటిష్ వారి చెర నుంచి భారతదేశ విముక్తికి సాయుధ పోరాటమార్గాన్ని ఎంచుకున్న తూర్పుబెంగాల్‌లోని చిట్టగాంగ్‌కు చెందిన సూర్య సేన్ బృందంలో ఒకరిగా, ఆయన ఏర్పాటు చేసిన హిందూస్తాన్ రిపబ్లికన్ ఆర్మీలో ప్రధాన కార్యకర్తగా పనిచేశారు కల్పనా జోషి. ఆమె ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో 1913లో జన్మించారు. ఆమె అసలు పేరు కల్పనాదత్తా. హిందూస్తాన్ రిపబ్లికన్ ఆర్మీతో తన 16వ ఏటనే సంబంధాలు ఏర్పరుచుకున్న కల్పన తుపాకీ పేల్చటం, బాంబులు తయారు చేయటంలో ప్రావీణ్యం సంపాదించడమే కాదు మిగతావారికీ శిక్షణ ఇచ్చేవారు. ఒకపక్కన కలకత్తా కాలేజీలో విద్యనభ్యసిస్తూనే మరోవైపున చిట్టగాంగ్ పోరాటానికి సమాయత్తం అయే పనుల్లో నిమగ్నమయ్యేవారు. బ్రిటిష్ పోలీసులు ఆమెను గృహనిర్బంధంలో ఉంచినా రహస్యంగా తన విప్లవ కార్యకలాపాలు కొనసాగించారు. జైలునుండి విడుదల కాగానే తిరిగి సూర్యసేన్ వద్దకు చేరి అడవులలో ఉన్న విప్లవకారులకు ఆయుధాలు, మందుగుండు సామాగ్రి అందించారు. 17 ఏళ్ళ వయసులోనే కలకత్తా నుండి భారీ మందుగుండు సామాగ్రిని సేకరించి, చిట్టగాంగ్‌కు రహస్యంగా తరలించారు. అక్కడ బాంబులు, ఇతర ప్రేలుడు సామాగ్రిని సమకూర్చుకుని సూర్యసేన్ అనుచరులకు అందించేవారు. 1931లో సూర్యసేన్ పోలీసులకు దొరికిపోయారు. ఆయనను చిత్రహింసలకు గురిచేసి, కాళ్ళూ, చేతులూ విరిచేసి, స్పృహ కోల్పోయిన ఆయనను ఉరికంబం వద్దకి మోసుకువచ్చి ఉరితీశారు. కల్పనను 1933లో నిర్బంధించి, జీవిత ఖైదు విధించారు. ఆమెను ఖరగ్‌పూర్‌లోని కేంద్ర కారాగారంలో బంధించారు, ఏడు ఏళ్ళ జైలు జీవితంలో ఆమె కమ్యూనిస్టు విప్లవకారులద్వారా మార్క్సిజం వైపు ఆకర్షితురాలయ్యారు. విడుదల తరువాత 1940లో నిషేధంలో ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. తన కాలేజీ చదువు పూర్తిచేస్తూనే, శ్రామిక వర్గ పోరాటాలలో, అనేక రైతాంగ పోరాటలలో, స్వాతంత్ర్య పోరాటంలో ఆమె చురుకుగా పాల్గొన్నారు. అప్పటి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన పూరణ్ చంద్ జోషీ (పి.సి. జోషీ) గారిని 1943లో వివాహమాడారు. బెంగాలులో అతిభయంకరమైన కరువు వచ్చి లక్షలాదిమంది ఆకలి చావులపాలైనప్పుడు పార్టీకార్యకర్తగా సహాయ చర్యల్లో పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం జోషీ దంపతులు కలకత్తాలో స్థిరపడ్డారు. భర్త పార్టీకి అంకితమై పని చేస్తుంటే, కల్పనా జోషీ కుటుంబ పోషణకోసం కలకత్తాలోని "ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్" లో (తన పదవీవిరమణవరకూ) పని చేశారు.

కల్పనా, పి.సి. జోషీ దంపతులకు ఇద్దరు కుమారులు చాంద్, సూరజ్‌లు. వారి కోడలు మాలినీ ముఖర్జీ ఆమె జీవిత కథను రచిస్తూ, "మా అత్తగారు జీవితాంతం అతి సామాన్యమైన, ఆదర్శపూరితమైన జీవితాన్ని గడిపారు. ఆమెతో వ్యక్తిగతంగా పరిచయం ఉన్నవారు...ఉన్నతమైన వ్యక్తిత్వం, అకుంఠిత దేశభక్తి ఆమె విశిష్ట లక్షణాలుగా చెపుతుంటారు. 80 ఏళ్ళ వయసులో కూడా ఆమె సిటీ బస్సులలోనే ప్రయాణించేవారు. ఎప్పుడూ నవ్వుతూ, మనవలతో సరదాగా ఆమె కాలం గడిపేవారు. "చిట్టగాంగ్ జ్ఞాపకాలు ఆలోచనలో పడవేసేవి. చిట్టగాంగ్ రోజులు నా జ్ఞాపకాలు మాత్రమే కాదు. అవి నా జీవితాంతం నన్ను వెంటాడుతుంటాయి. ఆరోజులు నా జీవితంలో త్యాగానికీ, వీరత్వానికి చిహ్నం. తోటి కామ్రేడ్ల కోసం ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడాలనే ఆ తపన నేను మర్చిపోలేనివి." అని కల్పనా జోషి చెప్తుండేవారు. అల్జిమర్స్ వ్యాధి సోకే వరకూ, వృద్ధాప్యంలో కూడా ఆమె తన బట్టలు తానే ఉతుక్కొనేవారు, వ్యాయామం చేసేవారు, తన వంట తానే చేసుకునేవారు. మరొకరిపై ఆధారపడకూడదనేది విప్లవ కారిణిగా ఆమె జీవితసూత్రం. 1995 ఫిబ్రవరి 8న ఢిల్లీలో 82వ ఏట కల్పనా జోషీ అంతిమ శ్వాస విడిచారు. భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో, భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్రలో ఆమె పాత్ర నేటి యువత మరువరానిది, స్పూర్తి దాయకమైనది.

(తరువాయి 7వ పేజీలో)

మహిళా దినోత్సవ నేపథ్యం...!

మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడడానికి చాలా కారణాలు వున్నాయి. మహిళా సాధికారత కోసం జరిగిన, జరుపుతున్న పోరాటానికి ప్రతీకే ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం. 19వ శతాబ్ధంలో యుద్ధాలు, పారిశ్రామిక అభివృద్ధి మూలంగా ఏర్పడిన పరిణామాలు మహిళలపై పెను ప్రభావాన్ని చూపాయి. ఇందులో ప్రధాన చెప్పకోదగింది....1908వ సం॥లో అమెరికాలోని న్యూయర్క్ సిటీలోని గార్మెంట్ ఫ్యాక్టరీలో మహిళల గురించి. ఇక్కడ 15,000 మంది మహిళలు పనిచేసేవారు. వారి పని పరిస్థితులు చాలా ఘోరంగా ఉండేవి, ఎముకలు కొరికే చలిలో వణుకుతూ, సరియైన ఆహారంలేక, రోజుకి 12 గంటలు పనిచేసేవారు. అయినా సరైన వేతనం, సమాన వేతనం ఉండేది కాదు. ఈ క్రమంలో వేతనం పెంచాలని, పనిగంటలు తగ్గించాలని, ఓటుహక్కు కావాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 28వ తేదీన న్యూయర్క్‌లో పెద్ద ప్రదర్శన జరిపారు. సమ్మె చేసి తమ హక్కులు సాధించుకున్నారు. ఈ నేపథ్యంలోనే 1909లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా నేషనల్ ఉమెన్స్‌డే నిర్వహించారు. 1910లో ఇంటర్‌నేషనల్ వర్కింగ్ ఉమెన్ కాన్ఫరెన్స్ డెన్మార్క్‌లోని కొపెన్ హెగెన్‌లో జరిగినది. జర్మనీ మహిళా నాయకురాలు కార్లా జెట్కిన్ ఇంటర్‌నేషనల్ ఉమెన్స్ డే అనే నిర్వహించాలని సూచించారు. ఈ సూచనకు ఆ కాన్ఫరెన్స్‌లో అందరూ ఆమోదం తెలిపారు. ఆ కాన్ఫరెన్స్‌కు 17 దేశాల నుండి 100మంది మహిళలు హాజరయ్యారు - వారిలో ముగ్గురు ఫిన్‌లాండ్ మహిళా ఎంపీలూ ఉన్నారు. న్యూయర్క్ సిటీలో ట్రయాంగిల్ ఫైర్ వలన 140 మంది చనిపోవడంతో 1913-14లో ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రష్యాలో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డేని ఫిబ్రవరి అఖరి ఆదివారం చేసేవారు. అదే జార్జియా క్యాలెండర్‌లో మార్చి 8వ తేదీ అయ్యింది. 1917లో రష్యాలో మహిళలు ఓటు హక్కు కావాలని అదే తేదీన సమ్మె చేశారు. 40 రోజులు తరువాత జార్‌ని తొలగించడంతో మహిళలకి ఓటు హక్కు వచ్చింది. 1975 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించడం తెలిసిందే. అది అప్పటి (జిడిఆర్) జర్మనీలోని బెల్విన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్నో దేశాలనుండి మహిళలు పాల్గొన్నారు. ఇలా...మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఏటా నిర్వహించుకుంటున్నాం.



జరిగిన కథ

అలాగ్గా నెల్లాళ్ళయి కుర్చీకి నేను అతుక్కుపడి పోయాను. ఈ ఆదివారం ఎలాగేనా గుండె ధైర్యం చేసుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళి ఆమెను చూసి ఆమె తల్లిదండ్రులను పరిచయం చేసుకోవాలి. లేకుంటే ఆమె ఏమేనా అనుకుంటే నేను బతకడం ఎలా! ఆమెకి నా మీద కోపంవస్తే నేను భరించగలనా? నా కెవరున్నారు ఈ ప్రపంచంమీద? 'ఏం జనార్ధనా, నిన్నుచూసి చాలారోజు లైందోయ్' అన్నవాళ్ళె వరున్నారు?

....సాయంకాలం నేను నా సెలూను బండికి ముందుగా వచ్చేశాను. స్నానంచేసి ఫలహారం చేస్తుండగా సీతారాం వచ్చాడు. ఎంతేనా తెలుగువాడు. తోడి ఇంజనీరు. మొహం మీద తలుపు వేసేయలేనుకదా? "దయచెయ్యండి" అన్నా. "మావాళ్ళ తప్పకి మీ ఎదుట బుర్రెత్తుకుని తిరిగ లేకుండా వున్నానంటే నమ్మండి జనార్ధనరావుగారూ! నేను వాళ్ళపైన చీఫ్ ఇంజనీరునైనా 'ఓటికుండ నీరుపోసిన చందాన విశ్వ దాభిరామ వినురవేమ' అని నేను ఎన్నిచెప్పినా వినిపించు కోరుగదా! ఉద్యోగం మానుకుందాం అని వుంది" అని అన్నాడు అతను విచారంగా.

(నిన్నటి సంచిక తరువాయి)

"అలాంటి పనేం చెయ్యకండి సీతారాంగారూ! ఇంత మాత్రానికే మీరు మనసు విరుచుకుని పనే మానేస్తానంటే ఎలాగు. మీ డిప్యూటీ చీఫ్‌తో చెప్పండి. అతను ఇంజనీర్లనూ, మేస్త్రీలనూ కేకలేస్తాడు. అంతేకాని!" అన్నాను అతన్ని సంబాళించడానికి. "మీరు చెపుతున్నారు గనుక నాకు కొంత ధైర్యం వస్తూంది. కాని, 'యేటిగట్టు మానుకెపుడు చలనంబు' అని వేమన స్త్రీల గురించి అన్నాడు. కాని మేస్త్రీలూ అంతేనండీ!" అన్నాడు సీతారాం. "ఇద్దరి చిత్తాలు మీకు బాగా తెలిసినట్టుందే" అన్నాను నేను నవ్వుతూను. "జనార్దనరావుగారు! మీరు అలా అంటే ధర్మమా? నాలుగు దేశాలు తిరిగితే నాలుగురకాల అనుభవాలు కలుగుతాయి. క్షమించండి. మనం ఇద్దరం విశాఖ పట్నం భాషే మాట్లాడుతున్నాం. మీది విశాఖపట్నమేనా యేమి టండీ?" అని అడిగాడు. "అవునండి" అన్నాను. "మొన్న బాంబింగులో మీ వాళ్ళందరూ అక్కడ క్షేమమేకదా?" అని అప్యాయంగా అడిగేడు. "నేను ఒంటిగాడిని. నాకు విశాఖపట్నంలో ఇళ్ళూ, వాకిళ్లూ యేం లేవు. అసలు మాది చాలా బీద కుటుంబంలెండి" అన్నాను. "మీరు యోగ్యులు కాబట్టి అలా చెప్పుకుంటున్నారు. 'అనువుగాని చోట అధికుల మన రాదు! కొంచెముండుటెల్ల గొదువకాదు, కొండ యద్దమందు కొంచమైయుండదా' అన్నాడు వేమన. అలాగ్గా మీరు... ఫాదరూ మదరూ కూడా పోయారండీ!...అయ్యయ్యో!" అని యెంతో సానుభూతి చూపించారు. "మీవాళ్ళుకూడా విశాఖపట్నంలో క్షేమమేనా?" అని కుశలప్రశ్న వేశా. "నేనూ వంటిగాణ్ణెలెండి. 'మదరు' నా చిన్నతనంలోనే పోయింది. 'ఫాదరు' విరక్తిపుట్టి బర్మా వెళ్ళిపోయాడు. అప్పటి నుంచి 'ఫాదరు' కూడా లేనట్టే. అతనేదో బర్మాలో వ్యాపారం చేసి నాలుగురాళ్ళూ చేసుకుని నన్ను సీమ పంపించాడు. అతనంతా ఈ యుద్ధం వచ్చాకే బర్మా నుండి మూటా ముల్లె కట్టుకుని వచ్చేసి ఉత్తరాదినే వుండిపోయి, అక్కడే కృష్ణా రామా అనుకుంటూ కాలక్షేపం చేసుకుంటున్నాడు" అన్నాడు. సంభాషణ యుద్ధం మీదికి దిగింది. అతను బర్మా అనగానే నాలాగే అతనూ తికమకపడుతూన్నట్టుంది. "ఒక్కొక్కప్పుడు జపాను గెలుస్తేనే మనకి మంచిదనిపిస్తుంది. మనకి స్వరాజ్యం తప్పకుండా ఇస్తారు. ఇంగ్లీషువాడి పని బేస్తుమీద కుదేలే. జపాను, జర్మనీల చేతుల్లో రాజు రాణీ జాకీ మణేలాలున్నాయి. వాళ్ళది చేతి వరస ఆటకూడాను. మరి అమెరికావాడి చేతిలో ఏం ముక్కలున్నాయో తెలియదు. కాని వాడి చేతిలో ఆసు మిగిలిపోయిందంటే మనం బేస్తు గెలిచాం అన్నమాటే. చూశారుకాదూ మనకి రూజువెల్టు ఎంత సాయం చేశాడోను. అతని మాటలని విని చర్చిల్ క్రిప్సుని మరిరెండు రోజులు మన దేశంలో వుండనిచ్చినట్టయినా, మనకి స్వరాజ్యం యీపాటికి చేతిలోకి వచ్చివుండేదే. బ్రిటిషువాడు గెలిచినా అమెరికావాడు బలవంతం చేసి మనకి స్వరాజ్యం ఇప్పిస్తాడు. జపాను గెలిస్తే ఇహ చెప్పనే అక్కరలేదు. సుభాను వుండనే వున్నాడుకదా!. మనకప్పుడు వద్దన్నా తప్పదు. నిజంగా మనం అదృష్టవంతులం అండీ! రవ్వా రొష్టూ లేకుండా స్వరాజ్యం వొళ్ళో వచ్చి పడుతుంది. ప్రపంచం అంతటిలో ఏ దేశానికండీ ఇంత అదృష్టం పండింది? అయినా మనకెందుకండీ రాజకీయాలు - రాయి, రప్పు, ఇంటికా, సున్నం, ఇసుం, సిమెంటు,



మన్నూ మశానంతో పనిచేసుకునేవాళ్ళం!" అన్నాడు చిరునవ్వుతో.

"మన్ను అంటే జ్ఞాపకం వచ్చింది. సీతారాంగారూ! మట్టి పనికి మీరు నాలుగు బుల్ దోజర్లు పెట్టకూడదూ - పని త్వరగా అయిపోతుంది" అన్నాను. "అమెరికావాడిని చూసి మనం ఎంతైనా నేర్చుకోవాలండి! మీరు అమెరికా వెళ్ళలేదు కాంసు. మనం పారా పలుగూ పిక్కాసు యెలావాడుతామో అక్కడవాళ్ళు బుల్ దోజర్లు, గ్రేడర్లు, స్క్రేపర్లు అలా వాడుతారు. ఒక్కటుందండోయ్! కూలీలు ఏ ప్రదేశంలో చవగ్గా దొరుకుతారో అక్కడ మాత్రం యంత్రాలని వాడరు సుమండీ! దమ్మిడీలతో సహా

డాక్టర్ వుప్పల లక్ష్మణరావు



లెక్కలు కట్టి ఏది చవకైతే అదే ఉపయోగిస్తారు. అంచేత అమెరికాలో అనుభవానికి హెచ్చు ప్రాముఖ్యత 'సానుభూతి లేక శాస్త్ర వాసనలచే - సంశయంబు చెడదు - సాధనకు - చిత్రదీపం బున జీకటి చెడనట్లు అన్నాడు వేమన మరి!' అన్నాడు మంచి హుషారుగా. "అవునండి, మీరు చెప్పినది సబబుగానే తోస్తూందండి" అన్నాను. "మహాయోగి వేమనమాట ఊరికినే పోతుందా? ఇక్కడ మనకి కూలీలు గిట్టుబడిగా దొరుకుతున్నారు. ఈ ధరల మూలాన్ని యంత్రాలు పెడితే ఖర్చు చాలా అవుతుంది. మరొక విషయం కూడా ఆలోచించాలి. యంత్రాలు పెట్టినట్టయినా పనులు పడిపోయి కూలీలు, మేస్త్రీలు, దళారీలు, కంట్రాక్టర్లు అందరికీ టొళ్ళెక్కం అవుతుంది. ఎన్ని యుద్ధాలొచ్చినా, మన దేశంలో జనం అశేషం. మన ఖద్దరు సాంప్రదాయానికి యంత్రాలు పనికిరావు. మనది అహింస, కాబట్టి యంత్రాలు మానేసి తంత్రాలుమీదే నడిపించాలి మన దేశాన్ని!" అన్నాడు. అతని దేశభక్తికీ, దూరదృష్టికీ నాకు చాలా ఆశ్చర్యం వేసింది. "పనులు తొందరగా అవుతాయని అన్నాడు లెండీ!" అన్నాను. "పనులు త్వరగా అవడానికీ ఈ యుద్ధం ఇంత త్వరగా అయి చచ్చిందా యేమిటి? తిండిలేని వాళ్ళకి కాస్త తిండి దొరుకుతూంది. నాలుగు కాలాలపాటు కానిద్దురూ, జనం బతుకుతారు!" అన్నాడు అతను.

నా కింతట్లోకి జ్ఞాపకం వచ్చి 'రైలు మార్గానికి పల్లవరం కారురాయ తెప్పిస్తున్నారు కదూ? మీ వాళ్ళు సూళ్ళూరుపేట ఎర్రరాయి వెయ్యగలరు సుమండీ!" అన్నాను. "అబ్బే! అలాంటిదేదీ జరగదు. జరిగినట్టయినా నా ఉద్యోగమే కదపా రాసియిస్తాను" అన్నాడు ధీమాగా.

సీతారాం తన జేబులోంచి బంగారపు సిగరెట్టు దబ్బీతీసి సిగరెట్టు కాలుస్తూ "మీ కీ చుట్టా, కాక్‌టైల్స్ ఏమీ అక్కరలేదుకదా! మిమ్మలిని చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. అయినా జనర్దనరావుగారూ! మనిషి అన్న తరువాత ఏదేనా వొక వ్యసనం అంటూ వుండాలి సుమండి" అన్నాడు నవ్వుతూ. "అది కాదండీ! నేను చదువుకునే రోజుల్లో అతి క్లుప్తంగా గడుపుకోవలసి వచ్చింది. జీతం డబ్బులకే సరిపోయేదికాదు. మా అమ్మ కష్టపడి సంపాదిస్తే పుస్తకాలు కొనుక్కొనేవాడిని. లేకపోతేలేదు. అంచేత ఏ అలవాట్లకీ అవకాశం వుండేదికాదు. ఇక ఇప్పుడు ముప్పయ్యోపడి దగ్గిర పడుతూంది. ఇంకే అలవాట్లు చేసుకోమంటారు?" అన్నాను నవ్వి. "మనలాంటి వారికి ఈ ఉగ్రతపస్సులు అవసరంలేదండి. శ్రీ రాములవారివల్ల అహల్య తరించింది. సుజాతవల్ల బుద్ధుడు పరినిర్వాణం పొందేడు. తాము తరించడానికీ, మన్ని తరింపజేయడానికి ఎంతమందో అహల్యలు, సుజాతలు కనిపెట్టుకుని వుండగా. ఈ కఠోర దీక్షలో అర్థంలేదు సరేకదా వ్యర్థం కూడాను" అన్నాడు. "మీ చమత్కారంలో నిజం యెంతో అబద్ధం ఎంతో తెలీదండీ సీతారాంగారూ!" అన్నాను. "అనగా, ఏ తపస్సుకి రంభవల్ల ఎప్పుడేనా భంగం కలిగిందా అని మీ ప్రశ్న అందురూ! నాకు చాలాసార్లు తపోభంగం జరగడం వాస్తవమే. నాది మొండి ఘటం కాబట్టి దేన్నీ పట్టించుకోకుండానే తిరుగుతున్నాను. అయినా ఒకటుందిలెండి. ఈ కాలపు అహల్యలనీ, సుజాతలనీ చూస్తుంటే 'గడుసురాలు మగని గంప బెట్టమ్మురా - విశ్వ దాభిరామ వినురవేమ' అన్నట్టు భయమే వేస్తుంది" అంటూ లేచాడు. నేను గడియారం చూశాను. "తొమ్మిదైందండోయ్ సీతారాంగారూ! ఇక ఎప్పుడు ఇంటికి చేరుకుంటారు, ఎప్పుడు భోంచేస్తారు? నలభై మైళ్ళుంది. భోంచేసి మరీ వెళ్ళండి" అన్నాను. "అదెంతండి! నా స్పోర్ట్సు కారులో అరగంటలో కొట్టి పారేస్తాను. రాత్రి క్లబ్బులో విందులెండి. చాలాసేపు కూర్చుండిపోయాను. క్షమించండి, సెలవు" అంటూ వెళ్ళిపోయాడు. తెలివైన బుర్ర. మంచి బాతాఖానీరాయుడు. హాస్యగాడు. అతను వేమన చదువుతుంటే నవ్వే వస్తుంది.

11 ఆమె

పడివేలు పెళ్ళాం ఇంకా ఆసుపత్రిలోనే వుంది. ఆపరేషను చేసి పిల్లని బైటకి తియ్యాల్సి వచ్చింది. పెళ్ళాం ఇంకా ప్రమాద స్థితిలోనే వుందిట. పాపం! ఆ మనిషి చూస్తే సన్నంగా పూచిక పుల్లలాగుంటుంది. అప్పుడే నలుగురు పిల్లలు. ప్రతిసారి పురిటికి చచ్చినంత జబ్బు. ఎందుకో ఇంకా తాపత్రయం? అమ్మా, నాన్నా ఊరినుంచి వస్తే రెండు కార్లకీ పూర్తిగా పని వుంటుంది. అంచేత ఇప్పుడే పెద్దకారుని 'సర్వీసింగు'కి కంపెనీకి పంపించేస్తే నాన్నా, అమ్మా వచ్చేటప్పటికి సిద్ధంగా వుంటుంది. ఇప్పుడు పడివేలుకి సెలవుకూడా ఇవ్వొచ్చు అని, పెళ్ళాం వంట్లో నింపాదిగా వున్నంతవరకూ పడివేల్ను రానక్కరలేదన్నాను. అమృతరావుకి ఈ వేళ సెలవురోజు. ఎండలింకా తగ్గుముఖం పట్టలేదు. తలంటుకుని ఆలస్యంగా భోజనంచేసి చిన్న నిద్దర తీశాను. మూడు కొట్టారు కాబోల్ను. పాపాయి నాపక్కలో కూర్చుని, "సుబ్బక్కా! ఈవేళ "రామచంద్ర విజయం" సినిమానే. మా బడిపిల్లలందరూ వెళుతున్నారే, నేను కూడా వెళతానే. మూడు గంటలకి నన్ను తీసుకువెళ్ళవే?" అని అడిగింది.

"పన్నెండేళ్ళొస్తున్నాయి. మూడో ఫారం చదువుతున్నావు. నిన్నొకళ్ళు సినిమాకి తీసుకువెళ్ళాలిటే? నాలుగడుగులు వేస్తే ట్రాముంది" అన్నాను. "అబ్బ! ఎండగా వుందే, ఆదివారం కాదంటే, ట్రాములూ, బస్సులూ నిండిపోయుంటాయే. సినిమా చాలా బాగా తీశారుటే. మాకీయేడు తెలుగు నాన్‌డిటైల్డు పుస్తకమే. నువ్వుకూడా రావే. నిన్ను బతిమాలుకుంటానే!" అని ప్రాధేయపడింది.

- ఇంకా వుంది.

ఐసీసీకి తొలి స్వతంత్ర మహిళా డైరెక్టర్‌గా ఎవరు నియమితులయ్యారు ?



కరెంట్ ఎఫైర్స్ అబ్జెక్టివ్ బిట్స్

1. అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో భాగమైన గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ) రూపొందించిన అంతర్జాతీయ మేధోహక్కుల (ఐపీ) సూచీలో ఏ దేశానికి అగ్రస్థానం దక్కింది ?
1. బ్రిటన్ 2. అమెరికా
3. స్వీడన్ 4. న్యూజిలాండ్

2. అణ్వస్త్ర సామర్థ్యమున్న స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-1ను భారత్ 2018 ఫిబ్రవరి 6న విజయవంతంగా పరీక్షించింది. ఇది ఎన్ని కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించగలదు ?
1. 350 కిలోమీటర్లు 2. 700 కిలోమీటర్లు
3. 1000 కిలోమీటర్లు 4. 2,000 కిలోమీటర్లు

3. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి హర్షవర్ధన్ విడుదల చేసిన ఇండియన్ స్టేట్స్ ఫారెస్ట్ రిపోర్ట్-2017 ప్రకారం అత్యధిక అటవీ ప్రాంతం వృద్ధి చెందిన రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచిన రాష్ట్రం ఏది ?
1. తెలంగాణ 2. కర్ణాటక
3. ఆంధ్రప్రదేశ్ 4. కేరళ

4. 2018 సంవత్సరానికి ఐయో ఆసియా ప్రతిభా పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?
1. మైఖేల్ ఎస్.హాల్ 2. జెరేమీ కార్బిన్
3. ప్రణీత సారంగి 4. సుమిత్రా మిత్ర

5. చిన్నారుల కోసం ఉద్దేశించిన గణితశాస్త్ర ప్రతిభా పోటీల్లో భాగంగా 'యూకే మ్యాథ్స్ హాల్ ఆఫ్ ఫేమ్' ఆన్‌లైన్ పోటీలో వివిధ దేశాల విద్యార్థులతో పోటీపడి 'లీడర్‌బోర్డ్'లో భారత సంతతి బాలిక చోటు సాధించింది. ఆ బాలిక పేరేమి?
1. అనన్య వినయ్ 2. సోహినీ రాయ్ చౌధురి
3. స్నిగ్ధ నందిపాటి 4. సంహిత కుమార్

6. పౌర విమానయాన రంగంలో నాణ్యమైన రవాణా సేవలు, సామాజిక బాధ్యత తదితర అంశాలలో ఏ విమానాశ్రయానికి 'గోల్డెన్ పీకాక్ అవార్డు 2017' దక్కింది ?
1. స్వామి వివేకానంద ఎయిర్‌పోర్ట్
2. గోవా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్
3. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్
4. తిరువనంతపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్

7. 2018 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక అలెన్ బోర్డర్ పతకానికి ఎవరు ఎంపికయ్యారు ?
1. దేవిడ్ వార్నర్ 2. ఆరోన్ ఫించ్
3. గ్లెన్ మాక్స్‌వెల్ 4. స్టీవ్ స్మిత్

8. న్యూజీలాండ్‌లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌ను ఏ జట్టు కైవసం చేసుకుంది ?
1. పాకిస్థాన్ 2. ఇంగ్లాండ్
3. భారత్ 4. ఆస్ట్రేలియా

9. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన పృథ్వీ-2 క్షిపణిని భారత్ 2018 ఫిబ్రవరి 7న విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి పరిధి ఎంత ?
1. 50 కిలోమీటర్లు 2. 150 కిలోమీటర్లు
3. 350 కిలోమీటర్లు 4. 750 కిలోమీటర్లు

10. కేంద్ర సాహిత్య అకాడమీ నూతన అధ్యక్షుడిగా ఎవరు ఎంపికయ్యారు ?
1. కె.వి.తిరుమలేశ్ 2. హెచ్.ఎస్.శివప్రకాశ్
3. ఆచార్య చంద్రశేఖర కంబర 4. వైదేహి

11. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖలీదా జియా అవినీతికి పాల్పడినందుకు ఎన్ని సంవత్సరాల కఠిన కారాగార శిక్ష అనుభవించాలని ఢాకాలోని ప్రత్యేక న్యాయస్థానం 2018 ఫిబ్రవరి 8న తీర్పు ఇచ్చింది ?
1. మూడు సంవత్సరాలు 2. నాలుగు సంవత్సరాలు
3. ఐదు సంవత్సరాలు 4. ఆరు సంవత్సరాలు

12. దేశంలో తొలి సాంస్కృత సంభాషణ కేంద్రాన్ని ఏ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది ?
1. సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయం
2. గుజరాత్ విశ్వవిద్యాలయం
3. అహ్మదాబాద్ విశ్వవిద్యాలయం
4. రక్ష శక్తి విశ్వవిద్యాలయం

13. నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ 'ఆరోగ్యకర రాష్ట్రాలు.. పురోగమన భారత్.. రాష్ట్రాలు- కేంద్రపాలిత ప్రాంతాల ర్యాంకులు' పేరుతో ఒక నివేదికను ఢిల్లీలో విడుదల చేశారు. దీని ప్రకారం దేశంలో ఆరోగ్య రంగంలో ఏ రాష్ట్రం మరోసారి అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది ?
1. కేరళ 2. అరుణాచల్ ప్రదేశ్
3. పశ్చిమ బెంగాల్ 4. మహారాష్ట్ర

14. భారతదేశంలో జాతీయ మహిళా కమిషన్ ఏర్పాటై 2018 జనవరి 31వ తేదీ నాటికి ఎన్ని సంవత్సరాలు పూర్తయ్యాయి ?
1. 26 సంవత్సరాలు 2. 27 సంవత్సరాలు
3. 28 సంవత్సరాలు 4. 30 సంవత్సరాలు

15. 'అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు' (గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్) 2018 ఫిబ్రవరి 3, 4 తేదీల్లో ఎక్కడ జరిగింది ?
1. గువాహతి (అస్సాం)
2. బెంగళూరు (కర్ణాటక)
3. లక్నో (ఉత్తరప్రదేశ్)
4. హైదరాబాద్ (తెలంగాణ)



16. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సంపన్న నగరాల్లో దేశ ఆర్థిక రాజధాని ముంబయికి చోటు దక్కింది. 950 బిలియన్ డాలర్ల (రూ.60.8 లక్షల కోట్లు) సంపదతో ముంబయి అంతర్జాతీయంగా ఎన్నవ స్థానంలో నిలిచింది ?
1. 10వ స్థానం
2. 11వ స్థానం
3. 12వ స్థానం 4. 13వ స్థానం

17. తెలంగాణలో ఆహారశుద్ధి విధానంపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనికి చైర్మన్‌గా ఎవరు వ్యవహరిస్తారు ?
1. పోచారం శ్రీనివాసరెడ్డి 2. ఈటల రాజేందర్
3. కె.టి.రామారావు 4. జూపల్లి కృష్ణారావు

18. నెక్స్‌బ్రాండ్ అందించే 'పవర్‌ఫుల్ ఉమెన్ అఛీవర్' అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ?
1. చందా కొచ్చర్ 2. చిత్రా రామకృష్ణ
3. నైనా లాల్ కిద్వాయ్ 4. షేక్ నౌహెరా

19. ఇండియా ఓపెన్ - 2018 బ్యాడ్మింటన్‌లో మహిళల సింగిల్స్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?
1. పూసర్ల వెంకట సింధు 2. రట్చనోక్ ఇంతనాన్
3. బీవెన్ జాంగ్ 4. చెయుంగ్ ఎన్‌గాన్

20. 'ముగ్గురు జననీజనకుల' విధానం ఆధారంగా తొలి సంతానోత్పత్తికి ఏ దేశ అధికారులు పచ్చజెండా ఊపారు ?
1. అమెరికా 2. బ్రిటన్
3. గ్రీన్‌లాండ్ 4. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్

21. మద్దతు ధరకు కొనే కందుల పరిమితిని గతంలో ఉన్న 53,300 టన్నుల నుంచి ఎంతకు పెంచుతూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది ?
1. 63,300 టన్నులు 2. 65,300 టన్నులు
3. 73,300 టన్నులు 4. 75,300 టన్నులు

22. నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ ఏటా అందించే ప్రతిష్ఠాత్మక నాయుడమ్మ అవార్డుకు ఈ ఏడాది ఎవరు ఎంపికయ్యారు ?
1. రాజు నరిశెట్టి 2. డాక్టర్ చెన్నుపాటి జగదీశ్
3. కుప్పిలి పద్మ 4. డాక్టర్ సుష్మీ బదులికా

23. అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో భాగమైన గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ) రూపొందించిన అంతర్జాతీయ మేధోహక్కుల (ఐపీ) సూచీలో భారతదేశానికి ఎన్నో స్థానం దక్కింది ?
1. 40వ స్థానం 2. 42వ స్థానం
3. 43వ స్థానం 4. 44వ స్థానం

24. భారత సైనిక దళాల సామర్థ్యాన్ని పరిపుష్టం చేసే దిశగా ప్రధాన ఆయుధ కొనుగోళ్లకు రక్షణ మంత్రిత్వశాఖ ప్రాథమిక ఆమోదం తెలిపింది. దీని విలువ ఎంత ?
1. రూ.15,935 కోట్లు 2. రూ.16,935 కోట్లు
3. రూ.17,935 కోట్లు 4. రూ.18,935 కోట్లు

25. ఈ ఏడాది 'శ్రీ ఎన్ఆర్ చందూర్-జగతి' పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?
1. రాజు నరిశెట్టి 2. కె.శివన్
3. డాక్టర్ హేమలత 4. కమలా హ్యారిస్

26. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి తొలి మహిళా స్వతంత్ర డైరెక్టర్‌గా ఎవరు నియమితులయ్యారు ?
1. ఇంద్రా నూయీ
2. చందా కొచ్చర్
3. మార్గరెట్ కీనె 4. కాథ్‌లీన్ మజ్జరెల్ల

27. ఆస్ట్రేలియా బెస్ట్ ఉమెన్ క్రికెటర్‌కు ఇచ్చే బెలిండా క్లార్క్ అవార్డు 2018 సంవత్సరానికిగాను ఎవరికి లభించింది ?
1. నికోల్ బోల్టన్ 2. ఎలిస్ పెర్రీ
3. రాచెల్ హేనెస్ 4. మెగాన్ స్కట్

28. 2018 ఫిబ్రవరి 11న జరిగిన ఆరవ ప్రపంచ ప్రభుత్వ సదస్సులో ప్రపంచంలోనే అత్యుత్తమ మంత్రిగా పురస్కారాన్ని అందుకున్నది ఎవరు ?
1. కెమి ఆడియోసన్ 2. శివ్ జెన్సన్
3. మగ్ద లీన అండర్సన్ 4. శ్రీ మూల్యానీ ఇంద్రావతి

29. ఫోర్బ్స్ తొలిసారి విడుదల చేసిన క్రిప్టో కరెన్సీ కుబేరుల జాబితాలో 7.5-8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.48.750-52,000 కోట్లు)తో అగ్రస్థానంలో నిలిచింది ఎవరు ?
1. ఆంటోనీ డి లారియో 2. మైఖేల్ నోవోగ్రాజ్
3. బ్రాడ్ గార్లింగ్‌హౌస్ 4. క్రిస్ లారెన్స్

30. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లర్ నేతృత్వంలోని నాజీ జర్మనీ సైన్యాన్ని ఎదిరించి పోరాడి రష్యన్ సేనలు విజయం సాధించిన స్టాలిన్‌గ్రాడ్ యుద్ధానికి ముగింపు పలికి 2018 ఫిబ్రవరి 2వ తేదీ నాటికి సరిగ్గా ఎన్ని సంవత్సరాలు గడిచాయి ?
1. 50 సంవత్సరాలు 2. 55 సంవత్సరాలు
3. 65 సంవత్సరాలు 4. 75 సంవత్సరాలు


31. 2018 ఫిబ్రవరి 3వ తేదీ నాటికి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాలో ఉన్న హౌరా బ్రిడ్జి ప్రారంభోత్సవం జరిగి సరిగ్గా ఎన్ని సంవత్సరాలు ముగిశాయి ?
1. 40 సంవత్సరాలు 2. 50 సంవత్సరాలు
3. 60 సంవత్సరాలు 4. 75 సంవత్సరాలు

32. రాష్ట్రంలో బోదకాలు బాధితులను ఆదుకోవాలని నిర్ణయించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వారికి నెలకు ఎంత ఫింఛను అందజేయాలని నిర్ణయించింది ?
1. రూ.500 2. రూ.1,000
3. రూ.1,500 4. రూ.2,000

సమాధానాలు

1. 2	2. 2	3. 3	4. 1	5. 2	6. 3
7. 4	8. 3	9. 3	10. 3	11. 3	12. 2
13. 1	14. 1	15. 1	16. 3	17. 1	18. 4
19. 3	20. 2	21. 4	22. 2	23. 4	24. 1
25. 1	26. 1	27. 2	28. 4	29. 4	30. 4
31. 4	32. 2				

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 62 పోస్టులు



న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ: నిఫ్ట్)... 62 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు : అసిస్టెంట్ ప్రొఫెసర్.

మొత్తం ఖాళీలు : 63 (అన్‌రిజర్వ్‌డ్-32+ ఎస్సీ-9+ ఎస్టీ-5+ ఓబీసీ-17).

వేతనం : రూ.66,000+ హెచ్ఆర్ఏ.

విభాగాలు : డిజైన్, కమర్షియల్/ విజువల్ ఆర్ట్స్, ఆర్ట్ హిస్టరీ, క్రిటిసిజం/ మ్యూజియాలజీ, క్లాతింగ్ అండ్ టెక్స్‌టైల్స్, ఫ్యాబ్రిక్ అండ్ అపెరల్ సైన్స్, కమ్యూనికేషన్ డిజైన్, విజువల్ కమ్యూనికేషన్, మాస్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ డిజైన్, అడ్వర్టైజింగ్ అండ్ బ్రాండింగ్, అడ్వర్టైజ్‌మెంట్ అండ్ జర్నలిజం, స్ట్రేటజిక్ డిజైన్, ఫిల్మ్ డిజైన్, ఫొటోగ్రఫీ, యానిమేషన్ అండ్ మల్టీ మీడియా, గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ఇంటరాక్షన్ డిజైన్, స్పేస్/ ఎగ్జిబిషన్/ఇంటీరియర్ డిజైన్, మెకానికల్/ ఇండస్ట్రియల్/ ప్రొడక్షన్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ తదితర విభాగాలు.

అర్హతలు : సంబంధిత విభాగాలను అనుసరించి పీజీ/ ఎంఆర్క్/ ఎంఎఫ్ఏ/ ఎంఎస్సీ/ ఎంటెక్/ ఎంఈ/ ఎంఎస్/ ఎంసీఏ/ ఎంసీఎం/ ఎంబీఏ.

వయసు : 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : రాతపరీక్ష, ఇంటర్వ్యూ/ ప్రెజెంటేషన్.

రాతపరీక్ష విధానం : ఇందులో రెండు భాగాలు ఉంటాయి. పార్ట్-1లో జనరల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ ఎబిలిటీ, టెస్ట్ ఆఫ్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్ నుంచి 50 మార్కులకు, పార్ట్-2లో ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్(సంబంధిత విభాగం) నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పార్ట్-1ను అర్హత పరీక్షగా పరిగణిస్తారు. ఇందులో క్వాలిఫై అయిన వారికి పార్ట్-2 ఉంటుంది. ఇందులోనూ ఉత్తీర్ణత పొందిన వారి మెరిట్ జాబితా నుంచి ఇంటర్వ్యూ, ప్రెజెంటేషన్/ క్లాస్ రూమ్ లెక్చర్/ డిమానిస్ట్రేషన్‌కు ఎంపిక చేస్తారు. అనంతరం తుది ఎంపిక ఉంటుంది.

దరఖాస్తు రుసుం : రూ.1,000; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ మహిళ/ నిఫ్ట్ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : మార్చి 21, 2018.

వెబ్‌సైట్ : www.nift.ac.in

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-284.11 ▼	-95.05 ▼	150 ▲	29,280	200 ▲	41,900	
33,033.09	10,154.20	29,300	ప్రొద్దుటూరు 29,280	39,900	ప్రొద్దుటూరు 41,552	64.88
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఐటీసీ	259.20	1.05
మారుతీ సుజికి	8,679.00	0.70
ఏషియన్ పెయింట్స్	1,107.95	0.47
టాటా మోటార్స్	354.90	0.40
బజాజ్ ఆటో	2,939.95	0.36

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
అదానీ పోర్ట్స్	377.45	-6.53
ఎస్‌బీఐ	246.65	-3.84
బీహెచ్ఇఎల్	85.45	-3.12
ఐసీఐసీఐ బ్యాంక్	294.00	-2.85
భారతీ ఎయిర్‌టెల్	416.00	-2.53

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	64.96	64.88
యూరో	80.59	80.52
పౌండ్	90.33	89.97
ఆస్ట్రేలియా డాలర్	50.85	50.67
సింగపూర్ డాలర్	49.38	49.34

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,090	31,112
చెన్నై	29,090	31,112
బెంగళూరు	28,650	30,641
ముంబై	30,000	32,085
విజయవాడ	29,300	31,600
విశాఖపట్నం	29,280	31,315
ప్రొద్దుటూరు	29,280	30,740
ముడి చమురు		65.79

నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

284 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

10,200 దిగువన నమోదైన నిఫ్టీ

ముంబై: దేశీయ మార్కెట్లు రుసగా రెండోరోజు కూడా నష్టాల్లో ముగిశాయి. దాదాపు సూచీలు 1శాతం వరకు నష్టాల్లో నమోదయ్యాయి. అంతర్జాతీయ పరిణామాలు , పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించి మంగళవారం చోటు చేసుకున్న పరిణామాలతో మార్కెట్లు బుధవారం కూడా నష్టాల బాటపట్టాయి. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 284 పాయింట్లు పతనమై 33.,033 వద్ద , నిఫ్టీ 95 పాయింట్లు నష్టపోయి 10,154 వద్ద ముగిసింది. సెక్టరల్ సూచీల్లో, నిఫ్టీ పీఎస్‌యూ సూచీ 3.57శాతం విలువ కోల్పోయింది. ముఖ్యంగా ఆంధ్రాబ్యాంక్, కెనరా బ్యాంక్, అలహాబాద్ బ్యాంకుల షేర్లు భారీగా నష్టపోయాయి. మంగళవారం ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ సీఈవోలు సీఎఫ్ఐవో ఆఫీస్‌లో విచారణకు హాజరుకావడం మార్కెట్ భయాలను మరింత పెంచింది.

మరో మోసం....!

- వెయ్యి కోట్లు హాంఫట్ !
- ప్రభుత్వ, పీఎస్‌యూ ఉద్యోగుల అతితెలివి
- నకిలీ ధ్రువపత్రాలతో ట్యాక్స్ రిఫండ్స్ కోసం దరఖాస్తులు
- ఐటీ శాఖ విచారణలో బట్టబయలు



న్యూఢిల్లీ : మొన్న పీఎన్‌బీ కుంభకోణం.. నిన్న కార్పొరేట్ల మాయాజాలం.. నేడు ప్రభుత్వ ఉద్యోగుల అతితెలివి. కారణాలు ఏమైనా.. వరుసగా వెలుగు చూస్తున్న మోసాలు భయాందోళనలకు గురిచేస్తున్నాయి. తాజాగా మరో రూ.వెయ్యి కోట్ల మోసాన్ని ఆదాయం పన్ను (ఐటీ) శాఖ బయటపెట్టింది. సోమవారం 447 సంస్థలు.. రూ.3,200 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన ఘరానా మోసాన్ని కనుగొన్న ఐటీ అధికారులు.. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల వల్ల కలిగిన వెయ్యి కోట్ల నష్టాన్ని గుర్తించినట్లు మంగళవారం వెల్లడైంది. 2016-17 మదింపు సంవత్సరానికిగాను ఆదాయం పన్ను రిటర్నుల సవరణ (రివైజ్)కు గడువు దగ్గర పడుతున్న సమయంలో.. వివిధ నగరాల్లో జరిగిన ఈ భారీ మోసాన్ని ఐటీ శాఖ తమ విచారణలో కనుగొన్నది. నకిలీ ధ్రువపత్రాలు, ఖర్చులు ఎక్కువగా చూపి ప్రభుత్వ, పీఎస్‌యూ ఉద్యోగులు పెద్ద ఎత్తున ట్యాక్స్ రిఫండ్స్ (పన్నుల వాపసు)కు క్లెయిమ్ చేసుకున్నారు. ఒక్క ముంబైలోనే ఈ తరహాలో దాదాపు 17వేల రివైజ్డ్ రిటర్నులు దాఖలు కావడం గమనార్హం. గృహ రుణాలకు చెల్లింపుల కారణంతో బెంగళూరులో ఇంకో వెయ్యి రిటర్నుల్ని క్లెయిమ్ చేశారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 24 కింద గృహ రుణ వడ్డీకి పన్నుల నుంచి మినహాయింపున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఐటీ శాఖ విచారణ కొనసాగుతుండగా. దీంతో ఐటీ శాఖకు కనీసం రూ.వెయ్యి కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మరోవైపు లెక్కల్లోకి రాని సంపదను వెలికి తీయడంలో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అన్ని వివరాల్ని ఐటీ శాఖ అందిస్తోంది. కాగా, ఈ క్లెయిమ్‌లలో ఎక్కువగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లోని సిబ్బందివే ఉన్నాయని ఐటీ శాఖ తెలిపింది. వీరందరి వాస్తవ రిటర్నులను ఇప్పటికే ఐటీ శాఖకు చెందిన కేంద్రీకృత ప్రాసెసింగ్ సెంటర్ పరిశీలించిందని, కానీ సవరించిన రిటర్నుల్లో రిఫండ్స్ కోసం సంబంధిత డాక్యుమెంట్లనూ జోడించారని ఐటీ శాఖ అధికారి ఒకరు అంటున్నారు. గడిచిన మూడేళ్లలో రివైజ్డ్ ట్యాక్స్ రిటర్నుల దాఖలు గణనీయంగా పెరిగిందంటున్న సదరు అధికారి.. ఎలా నకిలీ ధ్రువపత్రాలతో రిఫండ్స్ కోసం దరఖాస్తు చేస్తున్నారో కూడా మేము కనుగొన్నామని చెప్పారు. ఇక పన్ను చెల్లింపుదారులు గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రివైజ్డ్ రిటర్నులను ఈ ఏడాది చివరికల్లా దాఖలు చేసుకోవచ్చున్నారు. 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాలకుగాను ఈ నెల 31 వరకు క్లెయిమ్ చేసుకోవచ్చున్నమాట. కాగా, గత నెల ఫిబ్రవరి 10దాకా 4.19 కోట్లకుపైగా ఐటీ రిటర్నుల్ని పరిశీలించి.. 1.62 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులకు రూ.1.42 లక్షల కోట్లు మేర రిఫండ్స్‌ను ఐటీ శాఖ అందజేసింది. సాధారణంగా రూ.50వేల లోపు రిఫండ్స్ చేసుకునే చిన్న ట్యాక్స్‌పేయర్లకే ఐటీ శాఖ ప్రాధాన్యమిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18)లోనూ ఇప్పటివరకు జారీ అయిన రిఫండ్స్‌ల్లో 90 శాతం వేతన జీవులు, చిన్న ట్యాక్స్‌పేయర్లకు చెందినవే. ముందుగా చెల్లించిన పన్నుల మొత్తాల్లో.. నిర్దేశిత సెక్షన్ల కింద పన్ను మినహాయింపులు చూపిస్తే, పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ తిరిగి చెల్లించేవే రిఫండ్స్ అన్న సంగతి విదితమే.

ఆర్‌కామ్‌పై కోర్టుకెళ్లిన ఎరిక్సన్

ముంబై: అనుమతులు లేకుండా రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఎటువంటి ఆస్తులను విక్రయించకూడదని ఆర్బిట్రేషన్ కోర్టు ఆదేశించింది. రిలయన్స్‌తోపాటు మారో రెండు కంపెనీలకు కూడా ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తనకు చెల్లించాల్సిన బకాయిలపై ఎరిక్సన్ సంస్థ ఆర్బిట్రేషన్ కోర్టుకు వెళ్లడంతో ఈ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా ఆర్బిట్రేషన్ కోర్టు ఆదేశాలతో ఆర్‌కామ్‌కు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. 2017 డిసెంబర్‌లో తన ఆస్తులను జియో ఇన్ఫోకామ్‌కు విక్రయించి అప్పులు తీర్చాలనే ప్రణాళికను ఆర్‌కామ్ ప్రకటించింది. ఇప్పటికే ఆర్‌కామ్ వివిధ బ్యాంకులకు రూ.45,516 కోట్ల బకాయిలు ఉంది. దీనిపై అటు జియోకానీ, ఇటు ఆర్‌కామ్ కానీ స్పందించలేదు.

స్పైకర్‌చే నూతన వస్త్రశ్రేణి



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: వేసవికాలానికి అనుగుణంగా భారతదేశపు అగ్రగామి బ్రాండ్ డెనిమ్ నూతన వస్త్రశ్రేణిని ఆవిష్కరించింది. డెనిమ్ భాగమైన స్పైకర్ సహజసిద్ధమైన రంగులతో ఈ వస్త్రశ్రేణిని విహార యాత్రలకు అనువుగా రూపొందించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన ఈ దుస్తులను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. పేస్టల్స్, చెక్స్ డిజైన్లతో పాటు వైట్ బేస్ కూడిన బ్రైట్, డీప్ రంగులను వినియోగించినట్లు స్పైకర్ పేర్కొంది.

లాండ్‌లైన్ నంబర్లకూ వాట్సాప్..

న్యూఢిల్లీ : ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ వినియోగించా లంటే మనకు మొబైల్ ఫోన్ తప్పనిసరి. లాండ్‌లైన్ నంబర్లు ఉన్నవారు ఈ సేవలను వినియోగించు కోలేరు. అయితే వాట్సాప్ సేవలు ఇప్పుడు లాండ్‌లైన్ నంబర్లకు కూడా అందుబాటులోకి వచ్చాయి. లాండ్‌లైన్ నంబర్ ఉన్నవారు ఎవరైనా ఈ సేవలను ఎంచక్కా వినియోగించు కోవచ్చు. అయితే ఈ సేవలు పొందడానికి మొబైల్ ఫోన్ మాత్రం ఉండాల్సిందే. ఇందుకోసం వాట్సాప్ బిజినెస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీన్ని వాణిజ్య సేవల కోసం రూపొందించినప్పటికీ ఎవరైనా మొబైల్ ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్న అనంతరం రిజిస్టర్ నంబర్ వద్ద పది అంకెల మొబైల్ నంబర్ కాకుండా.. లాండ్‌లైన్ నంబర్‌ను ఇవ్వాలి. సాధారణంగా ఇలాంటి సందర్భంలో వాట్సాప్ మన మొబైల్ నంబర్‌కి ఓటీపీ పంపించి వెరిఫై చేస్తుంది. అయితే ఇక్కడ మాత్రం మనం కాల్‌మీ ఆప్షన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. లాండ్‌లైన్ నంబర్‌కు కాల్ వచ్చిన అనంతరం వెరిఫై ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం లాండ్‌లైన్ నంబర్‌ను వినియోగించుకునే అన్ని రకాల వాట్సప్ సేవలను పొందవచ్చు.

అదానీ.. మాయగాడు : స్వామి



హైదరాబాద్: పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీపై బీజేపీ ఎంపీ సుబ్రమణ్య స్వామి మొండి బకాయిల బాంబు పేల్చారు. 'ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉన్న స్థూల నిరర్థక (మొండి బకాయిలు) ఆస్తుల మాయగాడు' అన్న అర్థం వచ్చేలా ట్వీట్ చేశారు. అయితే తాము క్రమం తప్పకుండా బాకీలు చెల్లిస్తున్నామని సంస్థ స్పష్టం చేసింది. గుజరాత్‌కు చెందిన వ్యాపారవేత్త గౌతమ్ అదానీ ప్రధాని నరేంద్రమోడీకి అత్యంత సన్నిహితుడిగా అందరూ భావిస్తున్న సంగతి తెలిసిందే. 'ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అత్యధిక స్థూల నిరర్థక ఆస్తులు ఉన్నవి గౌతమ్ అదానీ పేరిటే. ఆయన జవాబుదారీ అవ్వాలి లేదంటే ప్రజా ప్రయోజన వ్యాజ్యం తప్పదు' అని సుబ్రమణ్య స్వామి చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విస్తృతంగా షేర్లు, లైకులు, కామెంట్లు లభిస్తున్నాయి. సుబ్రమణ్య స్వామి చేసిన ట్వీట్‌ను ఉద్దేశించి అదానీ గ్రూప్ స్పష్టతనిచ్చింది. తాము క్రమం తప్పకుండా బాకీలు చెల్లిస్తున్నామని వెల్లడించింది. తమ గ్రూప్‌నకు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉన్న దీర్ఘ కాలిక రుణాల భారం 50 శాతానికి తగ్గిందని చెల్లించాల్సిన సొమ్ము రూ.34వేల కోట్లే అని తెలిపింది. క్రమం తప్పకుండా బాకీ చెల్లిస్తున్నామని పేర్కొంది.

'అదానీ గ్రూప్ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆస్తులను సృష్టించింది. భారత్‌లో నిర్వహిస్తున్న వ్యాపార విలువే రూ.1,10,000 కోట్లు ఉంటుంది. ఇక నమోదిత సంస్థల విలువ (నెట్‌వర్త్) రూ.40,000 కోట్లు, వడ్డీలు, పన్నులు, తరుగు తీసివేయక ముందు విలువ (ఈబీఐడీటీ) రూ.24,000 కోట్లు' అని సంస్థ తెలిపింది. అదానీ సంస్థ లాజిస్టిక్స్, విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ పంపిణీ, వ్యవసాయ, గనులు, పునరుత్పాదక విద్యుత్ వ్యాపారాలను నిర్వహిస్తోంది. కంపెనీ ఎన్ని చెప్పినప్పటికీ బ్లూమ్‌బర్గ్ 2017 సెప్టెంబర్ నాటి సమాచారం ప్రకారం, అదానీ పవర్ అప్పులు రూ.47,609.43 కోట్లు, అదానీ ట్రాన్స్‌మిషన్ అప్పు రూ.8,356.07 కోట్లు, అదానీ ఎంటర్‌ప్రైజెస్ అప్పు రూ.2,424 కోట్లుగా ఉంది.

విజ్ఞానం

విటమిన్-డి లోపంతో...



శరీర బరువు పెరుగుతున్నారా...మూడ్ బాగోలేదా......అయితే విటమిన్ డి సమస్యతో ఉన్నట్లు పరిగణించవచ్చు. శరీరంలో కాల్షియం, ఫాస్ఫేట్‌ల నియంత్రణకు విటమిన్ డి తోడ్పడుతుందని తెలుస్తోంది. కండరాల నొప్పులు, ఎముకలు గుల్లబారడాన్ని నిరోధించేందుకుగాను సూర్యరశ్మిద్వారా ఉత్పన్నమయే విటమిన్‌డి సహకరిస్తుంది. సూర్యరశ్మినుండి లభ్యమయే విటమిన్-డి శీతాకాలం, వర్షాకాలాల్లో శరీరానికి సరిపోయేతంత లభ్యంకాక కొంత ఇబ్బంది పడవలసిందే...విటమిన్-డిని మందుల రూపంలో తీసుకోవడం ద్వారా కొంతవరకు ఈ సమస్యను అధిగమించ వచ్చునని నిపుణులుసూచిస్తున్నారు. విటమిన్-డి లోపించడంతో నీరసం, మానసిక అనారోగ్యంతోపాటు కండరాల సమస్యలు తలెత్తడం ప్రధానంగా ఉన్నాయి. ఇన్‌ఫెక్షన్లనుండి కాపాడేందుకు విటమిన్-డి సహకరిస్తుందని తెలుస్తోంది. మెదడులోని విటమిన్‌డి సహకారంతో మెదడు కణాలకు, సాంకేతిక సిగ్నల్స్‌ను గ్రహించేందుకు తోడ్పడు తుంది. విటమిన్-డి లోపంతో మెదడు కమ్యూనికేషన్‌పై ప్రతికూల ప్రభావంచూపుతుందని తెలుస్తోంది. 'హాపీ హార్మోన్' అయిన సెరటోనిన్‌ను విటమిన్‌డి ప్రేరేపిస్తుంది. విటమిన్‌డి లభించే ఆహార పదార్థాలు: ఆయిలీ ఫిష్, రెడ్‌మీట్, ఎగ్ యోక్‌లలో లభ్యమవుతుంది.

మొక్కలో అరుదైన ఖనిజం గుర్తింపు



పరిశోధకులు మొదటిసారి మొక్కలో అరుదైన మినరల్స్ (ఖనిజాలు)ను కనుగొన్నారు. ఆల్పైన్ మొక్కల్లో లభ్యమైన ఖనిజాలు పారిశ్రామికంగా, వైద్యపరంగా దోహదపడే అరుదైన మినరల్ కాల్షియం కార్బొనేట్ రూపంలో తెల్లగా మచ్చలుమచ్చలుగా ఉండటాన్ని గమనించవచ్చు. వెటిరైట్ అనే ఈ ఖనిజం భూమిపై అత్యంత అరుదుగా లభిస్తుంది. సముద్రాల్లో, తాజా నీటిలో లభ్యమయే వెటిరైట్ క్రిస్టల్స్ పక్షుల గుడ్లలోనూ, చేపల చెవుల లోపలిపొరల్లోనూ, రాక్స్ మీద లభ్యమవుతోంది. తాజాగా మొక్కల్లో కూడా లభ్యమవుతున్నట్లు తెలుస్తోంది. బయోకెమిస్టులు వెటిరైట్‌ను మందుల్లో వినియోగించేందుకు గాను తయారుచేసేందుకు ప్రయత్నించినా సాధ్యపడదనేది స్పష్టమైందని కేంబ్రిడ్జియూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారు. వెటిరైట్ నానో పార్టికల్స్‌ను యాంటి కేన్సర్ డ్రగ్స్‌లో వినియోగించడంతో ప్రతిఫలం ఉండవచ్చునని తెలుస్తోంది. వెటిరైట్ వినియోగంగో ఆర్థోపెడిక్‌సర్జరీలో వినియోగించే సిమెంట్‌లో కలపడంతో మంచి ఫలితాలుఉండవచ్చునని గ్రహించారు. దీనిపై మరింత పరిశోధన జరగవలసిఉంది. ఇంక్‌జెట్ ప్రింటింగ్‌లో ఉపయోగించే పేపర్‌లో వినియోగంతో ఇంక్ మరింత వ్యాప్తి చెందకుండా ఉంటుంది. సౌరవ్యవస్థలోని మెటారియోరైట్‌ను గుర్తించేందుకుగాను వెటిరైట్ దోహదం చేస్తుందని తెలుస్తోంది.

బజాజ్ నుంచి కొత్త బీమా పథకం

హైదరాబాద్ : బీమా రంగంలో తనదైన ముద్ర వేస్తున్న బజాజ్ అలియాంజ్ ప్రైవేట్ సంస్థ మరో కొత్త పథకాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. బజాజ్ అలియాంజ్ లైఫ్ గోల్ అస్యూర్ పేరుతో ఈ ప్లాన్‌ను రూపొందించింది. ఈ తరానికి సరిపోయే విధంగా కొత్త పథకాన్ని రూపొందించామని కంపెనీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సంపత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడి ప్రయోజనాలు, జీవిత బీమా రెండూ కలిసివచ్చేలా ఈ పథకం రూపొందించామని చెప్పారు. పాలసీదారుడికి పూర్తి స్థాయి లాభాలు కల్గించేలా ఉండే ఈ యూలిప్ వల్ల పూర్తిస్థాయి భద్రత సమకూరుతుందన్నారు. ఒకవేళ పాలసీదారుడు మరణిస్తే ఈ సందర్భంలో వారి కుటుంబాలు పలు దఫాలుగా ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు బజాజ్ అలియంజ్‌ను ఆశించినదానికంటే ఎక్కువగా ఆదరిస్తున్నారని చెప్పారు.

వామపక్ష మహిళా ఉద్యమ ధృవతారలు

5వ పేజీ తరువాయి

కెప్టెన్ లక్ష్మి



కెప్టెన్ లక్ష్మి...కేరళలోని మలబార్ ప్రాంతంలో స్వాతంత్ర్య వీరుల కుటుంబంలో 1914 ఏప్రిల్ 24న జన్మించారు. ఆమె అసలు పేరు లక్ష్మి స్వామినాథన్. వైద్య విద్య పూర్తిచేసి గైనకాలజిస్టుగా మద్రాస్‌లోని కస్తూర్బా హాస్పిటల్లో పనిచేశారు. 1940లో ఆమె సింగపూరుకు వెళ్ళి అక్కడ పేద భారతీయ కార్మిక కుటుంబాలకు సేవ చేస్తూ, ఉచిత వైద్య సదుపాయం అందించారు. ఇదే సమయంలో (1943లో) నేతాజీ సుభాస్ చంద్రబోస్ సింగపూర్‌లో ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హింద్ ఫౌజ్) లో ఝాన్సీ లక్ష్మిబాయి పేరున ఏర్పాటు చేసిన స్త్రీల రెజిమెంటుకు డాక్టర్ లక్ష్మిని కెప్టెగా నియమించారు. అనతికాలంలోనే 1500 మంది స్త్రీ సైనికులు, 200 మంది నర్సింగ్ వలంటీర్లు ఆ రెజిమెంటులో చేరారు. వారికి అకుంఠిత దీక్షతో సాయుధ శిక్షణ, సైద్ధాంతిక శిక్షణ ఇచ్చి వారిని యుద్ధసన్నద్ధులను చేయించిన ప్రతిభ ఆమెది. నేతాజీ సుభాస్ చంద్రబోస్ అండమాన్ దీవులలోని పోర్ట్ బ్లెయిర్ కేంద్రంగా ఏర్పాటుచేసిన ప్రభుత్వంలో ఆమె మంత్రిగా పనిచేశారు.

ఆమె చక్కని గాయని కూడా. "కదమ్ కదమ్ బఢాయె జా" అనే ఆజాద్ హింద్ ఫౌజ్ సైనిక గీతాన్ని ఆమె ఆలాపించారు. అత్యంత ప్రజాదరణ పొందిన ఆ పాటను రికార్డు కూడా చేశారు. 1944లో సింగపూర్ నుండి బర్మా ద్వారా, భారత సరిహద్దుకు చేరుకుని బ్రిటిష్ సేనలతో ఝాన్సీ లక్ష్మిబాయి రెజిమెంటు తలపడింది. తగనన్ని ఆయుధాలు లేకపోయినా మొక్కవోని ధైర్యంతో కెప్టెన్ లక్ష్మి తన స్త్రీసేనను ముందుకు నడిపించింది. కానీ, బలవంతులైన బ్రిటిష్ సేన ముందు నిలబడటం కష్టమైంది, భారీ నష్టం జరిగింది. క్షతగాత్రులను వెంటబెట్టుకుని ఆమె వెనుతిరిగారు. మలేషియా అడవులలో ఒక హాస్పిటల్‌ను నెలకొల్పి, క్షతగాత్రులైన ఇండియన్ నేషనల్ ఆర్మీ సైనికులకు ఆమె వైద్యసహాయం అందించారు. 1945లో బ్రిటిష్ వాయుసేన దాడిలో హాస్పిటల్ ధ్వంసం అయింది. అనేక మంది సైనికులు చనిపోయారు. కెప్టెన్ లక్ష్మితో సహా అనేక మంది సైనికులు బందీలయ్యారు. వారిని భారత దేశానికి తీసుకు వచ్చి రాజద్రోహ నేరం మోపి, మిలిటరీ ట్రిబ్యునల్లో, ఎర్రకోటలో సైనిక కోర్టులో విచారణ చేశారు. కెప్టెన్ లక్ష్మికి ఉన్న అత్యంత ప్రజాదరణ కారణంగా ఏ విచారణా లేకుండానే ఆమెను బ్రిటిష్ అధికారులు 1946లో విడుదల చెయ్యాల్సి వచ్చింది. విడుదలైన వెంటనే ఆమె దేశం అంతా తిరిగి, ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగాలు, ప్రజలను చైతన్యవంతం చేశాయి. ఇక ఎర్రకోటలో కల్నల్ ప్రేమ్ సహగల్, కల్నల్ గురుబక్ష్ సింగ్ ధిల్లాన్, మేజర్ జనరల్ షా నవాజ్ ఖాన్‌లపై ఆదరణను చూసి, బ్రిటిష్ పాలకులకు దడ పుట్టుకొచ్చింది. బొంబాయి రేవులోని, నావికాదళ సైనికులు చారిత్రాత్మకమైన తిరుగుబాటును నిర్వహించారు. ఇక చేసేదేమీలేక, ఇండియన్ నేషనల్ ఆర్మీ అధికారులను, సైనికులను బ్రిటిష్ పాలకులకు విడుదల చెయ్యటం మినహా మరొక గత్యంతరం లేకపోయింది. విడుదలైన తరువాత, కల్నల్ సహగల్‌తో లక్ష్మి గారి వివాహం జరిగింది. ఆ దంపతులు, కాన్పూరు నగరంలో స్థిరపడ్డారు. కాన్పూరులో వైద్య సహాయం అందిస్తూ, ఆమె తన జీవితాంతం పేదప్రజల సేవలో గడిపారు. 92 ఏళ్ళవయసులో కూడా ఉదయాన్నే హాస్పటల్ తెరిచి, హాస్పటల్ ఆవరణను నిత్యం శుభ్రం చేసేవారు. 1947లో దేశవిభజన కారణంగా, అనేక లక్షలమంది శరణార్థులు, భారత్‌కు వచ్చినప్పుడు, కాన్పూర్‌లో ఆమె శరణార్థుల శిబిరాల్ని కొన్ని ఏళ్ళపాటు నిర్వహించారు. వారికి సహాయం అందజేయడమేకాదు పునరావాసానికీ కృషిచేశారు. 1971లో తూర్పు బెంగాల్‌లో పాకిస్తానుకు వ్యతిరేకంగా ప్రజాతిరుగుబాటు జరిగినప్పుడు, లక్షలాదిమంది ప్రజలు, భారత్‌కు శరణార్థులుగా వచ్చినప్పుడు వారికి సేవలు అందించారు. అప్పటికే ఆమెకు కాన్పూరులో ట్రేడ్ యూనియన్లతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. తన 57వ ఏట ఆమె కమ్యూనిస్టుగా కొత్తజీవితాన్ని ప్రారంభించారు. తన శేషజీవితాన్ని ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలలోనూ, స్త్రీ ఉద్యమాలలోనూ గడిపారు. ఆమె అయిద్వా అధ్యక్షురాలిగా చాలాకాలం పనిచేశారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. 1984లో భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగినప్పుడు అక్కడ మెడికల్ క్యాంపు నిర్వహించి బాధితులకు నెలలపాటు సేవలందించారు. 1998లో ఆమెకు పద్మవిభూషణ్ బిరుదును నిచ్చి భారత ప్రభుత్వం సత్కరించింది. 2002లో రాష్ట్రపతి పదవికి వామపక్ష అభ్యర్థిగా, ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు అబ్దుల్ కలామ్ గారిపై పోటీచేశారు. అప్పట్లో ఆమె దేశవ్యాప్తంగా పర్యటించి ఇచ్చిన సందేశాలు ప్రత్యర్థుల ప్రశంశలూ పొందాయి. ఒక విదేశీ ఛానలుకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆమె "స్వాతంత్ర్యం అనేది మూడు దశలలో సాధించాలి. మొదటిది విదేశీ పాలన నుండి పోరాడి సాధించుకునే స్వాతంత్ర్యం. దాన్ని మనం పొందగలిగాము. ఇక రెండవది ఆర్థిక స్వాతంత్ర్యం. మూడవది సామాజిక సమానత్వం. ఈ రెండూ సాధించటంలో మనం ఇంకా సఫలీకృతులం కాలేదు." అన్నారు. ఆమె చెప్పిన నిజమైన స్వాతంత్ర్యం యొక్క ఈ మూడు దశల సాధనకోసం ఆమె ఒక డాక్టరుగా, సైనికురాలిగా, సంఘ సేవకురాలిగా, తన బిడ్డలకే కాకుండా, తన చుట్టూ ఉండే ప్రజలందరికీ మాతృమూర్తిగా 65 ఏళ్ళపాటు చేసిన నిర్విరామ కృషి అజరామరమైనది, భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. కాన్పూర్ ప్రజలకు పెద్దదిక్కుగా, అన్నిటికీ తోడుగా పేదప్రజల పక్షాన నిలిచిన ఆ మాతృమూర్తి తన 98వ ఏట, 2012 జూలై 23న గుండెపోటుతో ఆఖరి శ్వాస విడిచారు. డాక్టర్ కెప్టెన్ లక్ష్మీ సహగల్ బహుశా మొత్తం భారత చరిత్రలోనే అసామాన్య స్త్రీమూర్తిగా ప్రజల హృదయాలలో కలకాలం నిలచి వుంటారనటంలో ఏమాత్రం సందేహం లేదు. ఆమె సమాజంలో ఎంత ఉన్నతమైన పాత్రను పోషించినా, తనను తాను ఒక సామాన్యమైన కమ్యూనిస్టు కార్యకర్తగానే చెప్పుకొనేవారంటే ఆమె ఔన్నత్యానికి వేరే నిదర్శనం ఇంకేమి కావాలి!

> **మహిళల అభ్యున్నతి అంటే పురుషుల పతనంకాదు**
>
> -----
>
> **మహిళలు ఇంటి పనులకు తక్కువ ప్రాధాన్యతనిచ్చి అత్యధికంగా సామాజిక ఉత్పత్తిలో భాగస్వాములైనప్పుడు మహిళలకు విముక్తి లభిస్తుంది.**
>
> **- ఫ్రెడరిక్ ఏంగిల్స్**

గీతా ముఖర్జీ



నేటి బంగ్లాదేశ్‌లోని జెస్సూర్‌లో 1924లో జన్మించిన గీతా రాయ్ చౌదరి. స్కూలు రోజులనుండే వామపక్ష విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. 1947-51 కాలంలో ఆమె బెంగాల్ ఛాత్ర పరిషద్ (బెంగాల్ విద్యార్థి సమాఖ్య) కార్యదర్శిగా పనిచేశారు. చిన్నవయసులోనే ఆమె మంచి వక్తగా పేరుపొందారు. 1942లో ఆమె కమ్యూనిస్టు పార్టీలో చేరి, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడైన బిశ్వనాథ్ ముఖర్జీ గారిని వివాహమాడారు. కలకత్తాలోని అశుతోష్ కాలేజీనుండి బెంగాలీ సాహిత్యంలో డిగ్రీ పొందారు. ఆమె తన పూర్తికాలాన్ని కమ్యూనిస్టు కార్యకర్తగా గడుపుతూ, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. బీడీ కార్మిక నాయకురాలిగా, ఆమెకు దేశవ్యాప్త కీర్తి ప్రఖ్యాతులు లభించాయి. 1965 నుండి మహిళా సమాఖ్య నాయకురాలిగా ఆ సంస్థలో ఆమె అనేక బాధ్యతలు నిర్వర్తించారు. ఏ సమస్యపై పోరాటాలను నిర్వహించినా, ప్రసంగాలు చేసినా, ఆ సమస్యపై పూర్తి అవగాహనను ఏర్పరుచుకున్న తరువాతనే ఆమె ముందుకెళ్ళేవారు. ఈ లక్షణం కారణంగానే చట్ట సభలలో ఆమె లేవనెత్తిన అంశాలకు అత్యంత ప్రాముఖ్యత లభించేది. 1967 నుండి 1977 వరకూ పశ్చిమ బెంగాల్ ఎమ్మెల్యేగా పదేళ్ళపాటు బాధ్యతలు నిర్వహించారు. బెంగాల్‌లోని పంస్కురా నుండి పార్లమెంటుకు 1980 నుండి 2000 వరకూ కొనసాగారు. అతి సామాన్య జీవన విధానం, అకుంఠిత దీక్ష, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఆమె విశిష్ట లక్షణాలు. చట్ట సభలలో స్త్రీలకు మూడవవంతు రిజర్వేషన్ కావాలనే డిమాండుతో ఆమె పార్లమెంటులోనూ, బయట ప్రజా ఉద్యమాలలోనూ విరామమెరుగని పోరాటాన్ని నలిపి విశేషమైన మద్దతును పొందగలిగారు. జాతీయ మహిళా కార్మిక కమిషన్, జాతీయ బాలల బోర్డు, జాతీయ మహిళ కమిషన్‌లలో సభ్యురాలిగా ఆమె అనేక అంశాలను పార్లమెంటు దృష్టికి తీసుకురాగలిగారు. స్నేహపూర్వకంగా మాట్లాడుతూనే నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని చెప్పడం ఆమె విశిష్టత. ఐ.కె. గుజ్రాల్ ప్రభుత్వంలో ఆమెకు మంత్రి పదవి ఇచ్చినా, ఆమె ప్రజాపోరాటాలకు ప్రాధాన్యతనిచ్చి, మంత్రిపదవిని తిరస్కరించారు. చట్టసభల బాధ్యతలలో ఎప్పుడూ తలమునకలై ఉండే ఆమె, బెంగాలీ భాషలో చిన్న పిల్లల పుస్తకాలు వ్రాయటంలో ఎంతో ఆసక్తి కనబరిచేవారు. బాలల కోసం అనేక పుస్తకాలను రచించారు. బెర్లిన్‌లోని అంతర్జాతీయ మహిళా సమాఖ్యకు కార్యదర్శివర్గ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. వరకట్నానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ, వామపక్ష కార్యకర్తలు తమ నిజజీవితాలలో కమ్యూనిస్టు విలువలను అనుసరించాలని, ప్రజలకు ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతూ, ప్రజల మన్నలను పొందాలని ఉద్బోధించేవారు. సిద్ధాంతానికి, ఆచరణకు వ్యత్యాసం ఉండరాదని ఆమె యువకార్యకర్తలకు గుర్తుచేస్తుండేవారు. మరొకరికి నీతులు చెప్పేముందుగా, మనం మన జీవితంలో అనుసరించి, చూపించాలని ఆమె యువకార్యకర్తలకు నేర్పారు. ఆ కారణంచేతనే పార్లమెంటులోనూ, బయటా ఆమెకు విశేష గౌరవ మర్యాదలు, ఆదరణ లభించాయి. తన ప్రత్యర్థులు కూడా మెచ్చుకునే విధంగా ఆమె తన ప్రజాజీవితాన్ని గడిపారు. గుండె జబ్బుతో బాధపడుతూ, ఆపరేషన్ చేయించుకున్నా, ఆమె విరామమెరుగక విప్లవోద్యమంలో ఎప్పుడూ ముందుండేవారు. ఆరోగ్యం బాగులేకపోయినా, పార్లమెంటు జరుగుతూన్నంతకాలం ఆమె సభకు హాజరయ్యేవారు. ప్రజసమస్యలపై కమ్యూనిస్టు వాణిని వినిపించారు. ఒక ప్రజాఉద్యమానికి వెళ్ళటానికి సిద్ధమవుతూ, మార్చి 3, 2000వ సంవత్సరంలో తుదిశ్వాస విడిచారు.

విజయ పథంలో గోఆనియన్స్

యువ ఇంజినీర్ల వినూత్న ఆలోచనకు వినియోగదారుల బ్రహ్మారథం



ఈరోజుల్లో ఇంటర్నెట్ ఉంటే చాలు..! మనకు కావలసిన వస్తువులను.. ఉన్నచోటు నుంచే ఆన్ లైన్‌లో బుక్ చేసి తెప్పించుకోగలుగుతున్నాము. అదేవిధంగా.. మనం రోజువారీ వినియోగించే తాజా కాయగూరలు, పండ్లు, మాంసం లాంటి పదార్థాలను కూడా ఆన్ లైన్‌లో బుక్ చేసి తెప్పించుకోగలిగితే ఎంత బావుంటుందని అనిపించక మానదు. ముంబై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి మహా నగరాల్లో నివసించే వారు.. ఈరకమైన బిగ్ బాస్కెట్, లోకల్ బన్యా లాంటి సేవలను వినియోగించుకుంటున్నా... గుర్గావ్ ప్రాంతంలో మాత్రం అలాంటి సేవలు అందుబాటులో ఉండేవి కావు. ఇక ఇప్పుడు గుర్గావ్ వాసులకు ఆ చింత తీరిపోయింది.

గోఆనియన్స్ స్టార్టప్ ద్వారా.. గుర్గావ్ వాసులు తమకు కావలసిన రకరకాల పండ్లు, కాయగూరలు, చికెన్, చేపలు, రొయ్యలు, మాంసం మొదలైన ఆహారపదార్థాలను ఫోన్, వెబ్, ట్విట్టర్, వాట్సాప్‌ల ద్వారా బుక్ చేసి తెప్పించుకునే సువర్ణావకాశం అందుబాటులోకి వచ్చింది. లోకల్ బన్యా, బిగ్ బాస్కెట్‌ల మాదిరిగా కాకుండా, మనేసార్, సోనా, ఫరీదాబాద్ సహా... గుర్గావ్‌లోని ఎక్కడికైనా రెండంటే రెండు గంటల్లో అన్ని రకాల ఆహార పదార్థాలను సరఫరా చేస్తుంది... గోఆనియన్స్..! "గుర్గావ్ నగరవాసుల సమయాభావాన్ని.. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని గో ఆనియన్స్ ఆలోచన పురుడు పోసుకుంది" అంటారు.. రాఘవ్. గో ఆనియన్స్.. అన్నది రాఘవ్ వోరా, కైలాశ్ త్రిపాఠి, శివాని కపూర్‌ల మానసిక పుత్రిక. ప్రతిరోజూ.. ఉద్యోగాలు, వ్యాపారాల్లో సతమతమై పోతూ.. నిత్యావసర కూరగాయలు, పండ్లు, మాంసం తదితరాలను కొనుగోలు చేసేంతటి సమయం లేక.. గుర్గావ్ వాసులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఈ మిత్రత్రయం గోఆనియన్స్ కు రూపమిచ్చారు.

సివిల్ ఇంజనీరింగ్ నుంచి రిటైల్ వైపు

రాఘవ్, కైలాశ్ త్రిపాఠిలు ఇద్దరూ సివిల్ ఇంజనీర్లు. సివిల్ ఇంజనీరింగ్ అప్లికేషన్ల వ్యాపారాభివృద్ధి, అమ్మకాల్లో సుమారు ఆరు సంవత్సరాల అనుభవం ఉంది. శివానికపూర్ కంప్యూటర్ ఇంజనీరింగ్ పూర్తి చేసి.. వ్యాపార నైపుణ్యాల అభివృద్ధిలో దశాబ్దం పాటు కొనసాగారు. గతంలో ఈమెకు ఆన్ లైన్ మీడియాను నిర్వహించిన అనుభవమూ ఉంది.

గత ఏడాది మొదట్లో ప్రారంభమైన ఈ గోఆనియన్స్ ప్రయోగం.. వినియోగదారులను విపరీతంగా ఆకట్టుకుంది. "మేము ప్రతిరోజూ.. సగటున ఒక్కోటి రూ.750 విలువ చేసే.. కనీసం 35 ఆర్డర్లను వినియోగదారులకు చేర్చగలుగుతున్నాము. ప్రస్తుతం గోఆనియన్స్ సగటున ప్రతి నెలా రూ5 లక్షల రూపాయల ఆదాయాన్ని సముపార్జిస్తోంది. మొదట మాకు సుమారు మూడు వేల మంది దాకా వినియోగదారులున్నారు. ఇందులో కనీసం 50 శాతం మంది ప్రతినెలా మాకు లాభసాటి ఆర్డర్లను ఇస్తుంటారు. వీరి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది" అని శివాని చెప్పారు.

'ఆన్ లైన్‌లో ఆర్డర్ చేసే నిత్యావసరాల తాజాతనం, నాణ్యతల విషయంలో వినియోగ దారులకు ఎన్నో అనుమానాలు ఉంటాయి. వాటిని తొలగించడం గోఆనియన్స్‌కి పెద్ద సవాలే. వీటితో పాటు.. పదార్థాల నాణ్యతను పాటించడం, కచ్చితమైన సమయానికి సరుకులు అందజేయడం, సరైన మానవ వనరులను గుర్తించడం లాంటి ప్రాథమిక సవాళ్లు ఉన్నాయి' అని అంటారు రాఘవ్.

"గోఆనియన్స్ వ్యాపారం పెరిగే కొద్దీ లాభాల బాట పట్టింది. భౌగోళికంగాను, ఉత్పత్తుల స్థాయి పరంగాను ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని ఈ మిత్రత్రయం భావిస్తోంది. గోఆనియన్స్ సంస్థ.. పర్యావరణానికి చేటు రాకూడదని గట్టిగా నమ్ముతోంది. అందుకే.. మా బృందం సభ్యులంతా.. 'ఈబిబైక్స్'నే వాడుతూ.. కాలుష్య రహిత, ఆరోగ్యకర పర్యావరణ పరిరక్షణకు కృత నిశ్చయులమై ఉన్నాము" అని వివరించారు రాఘవ్. ఉదయం ఏడుగంటల నుంచి రాత్రి పది గంటల లోపు... నాలుగు నిర్దిష్ట సమయాల్లో మా సభ్యులు ఆర్డర్లను వినియోగదారులకు చేరుస్తుంటారు. దీనికోసం మా బృందంలో.. సంస్థ ప్రతినిధులతో పాటు.. బయటి వారి సేవలనూ వినియోగించుకుంటున్నాము.





మొత్తం రవాణాలో మా సంస్థ ప్రతినిధులు 30 శాతం మేర, మిగిలిన 70 శాతాన్ని బయటి వ్యక్తుల సేవలను వినియోగించుకుంటున్నాము. అని రాఘవ వెల్లడించారు. 'గుర్గావ్ మొత్తంగా.. మా సంస్థ తన విధి విధానాలు, విశిష్టమైన ప్రచార ప్రణాళికల ద్వారా ఓ సంచలనాన్ని సృష్టించిందనే చెప్పాలి. రూపాయికే కిలో ఉల్లి లాంటి పథకాలు సంస్థకు ఎంతో మంచి పేరును తెచ్చిపెట్టాయి. ఈ పథకాన్ని మేము 2014 జనవరి 27 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు నిర్వహించాము. కేవలం ఆరు రోజుల వ్యవధిలో మేము ఏడు వేల కిలోలకు పైగా ఉల్లిపాయలను పంపిణీ చేశాము. ఈ పథకం కింద సుమారు రెండువేల మంది దాకా వినియోగదారులు మా వద్ద రిజిస్టర్ చేసుకున్నారు' అంటారు శివాని.

గోఆనియన్స్‌ను ముందుగా ఢిల్లీ అంతటా విస్తరించాలని, ఆ తర్వాత, దేశంలోని ఇతర ప్రధాన నగరాలకు వ్యాప్తి చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం గోఆనియన్స్ మంచి ఫలితాలనే ఇస్తోంది. అయితే దీన్ని సక్రమంగా నడిపేందుకు, భారీగా విస్తరించేందుకు.. నిర్దిష్టమైన సాంకేతికతను సమకూర్చుకునేందుకు.. మరిన్ని పెట్టుబడులు అవసరం. పైగా, గోఆనియన్స్ తరహా వ్యాపారం ప్రారంభం కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో.. ఐబిఐబిఓ సంస్థ సీఈఓ ఆశిష్ కశ్యప్ గారి శ్రీమతి అనితాకశ్యప్ ఫుడ్ మండిని ప్రారంభించారు. అయితే.. ఆ ప్రయత్నం ఆరు నెలలలోపే మూలపడింది. దానికి భిన్నంగా... గోఆనియన్స్ విజయపథాన దూసుకుపోతోంది.

నీటితో వంటగ్యాస్ తయారీ



- కేరళ కుర్రాళ్ల అద్భుత ప్రయోగం విజయవంతం
- వినియోగదారుల ఇబ్బందులు తీర్చడమే లక్ష్యం
- భద్రత విషయంలో భయమేలేదంటున్న హైడ్ గ్యాస్ టీం...
- ఎల్పీజీ గ్యాస్ కంపెనీలకు చెక్ చెప్పాలని భారీ లక్ష్యం..

హైడ్ గ్యాస్ .. కరెంట్ సాయంతో నీటిని ఇంధనంగా ఉపయోగించుకుంటుంది. వాస్తవానికి చెప్పాలంటే ఇంధనాన్ని తనంతట తానుగా ఉత్పత్తి చేసుకొనే ఓ పొయ్యి (cooktop) ఇది. అవసరం అయినప్పుడు నీటిని ఆక్సిజన్, హైడ్రోజన్‌గా మార్చి ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తుంది. దీంతో గ్యాస్ నిల్వ ఉంచాల్సిన పనిలేదు. గ్యాస్ బండలతో అసలు పనే లేదు. ఎల్పీజీతో పోలిస్తే ఇది ఎంతో భద్రం. సోలార్ పవర్‌తో కూడా అనుసంధానిస్తున్నట్లు దీని తయారీ దారులు రిఇన్వో ల్యాబ్స్ ప్రకటించింది. ఇది తమకు గర్వంగా ఉందని రిష్విన్ ఎంహెచ్ చెబుతున్నారు.

2014లో రిఇన్వో ల్యాబ్స్ స్టార్టప్ ప్రారంభమైంది. కాలేజీ పూర్తి చేసుకొని బయటకొచ్చిన కొంతమంది యువకులు పెట్టిన కంపెనీ ఇది. కాలుష్య రహిత క్లీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలనే ఆలోచన నుంచి మొదలైంది. రెయిన్ (REIN) రీ ఇన్వెంటింగ్ ద వరల్డ్ నుంచి తామీ కంపెనీ ప్రారంభించామని రిష్విన్ వివరించారు.

హైడ్ గ్యాస్ టీమ్

రిఇన్వో ల్యాబ్స్ వ్యవస్థాపకులు డిగ్రీ రెండో ఏడాదిలో వెబ్ సైట్లు, ఆండ్రాయిడ్ యాప్‌లు చేయాలని ఆలోచించేవారట. కానీ నేడు వాళ్లు అద్భుతాన్ని చేసి చూపించారు. వాళ్ల సామర్థ్యంతో విప్లవాత్మకమైన హైడ్రోజన్ గ్యాస్‌ని మనముందుకు తీసుకువచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇలాంటి వాటికెంతో ఆవశ్యకత ఉంది.

ఇళ్ల కోసం తయారు చేసిన మోడల్

ట్యాప్ (వాటర్) నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా మార్చేస్తుంది ఇది. ఇళ్లతోపాటు హోటళ్లలో చాలా ఉపయుక్తం కానుంది. ఎంతో శుద్ధమైన పొయ్యి ఇది. సాధారణ గ్యాసైన ఎల్పీజీతో పోలిస్తే ఇది చాల చవగ్గా దొరకడమేకాదు మరెంతో సురక్షితం కూడా అనేది ఈ కుర్రాళ్లు ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు. అవకాశాలన్నింటినీ పూర్తిగా ఎలా వినియోగించుకోవచ్చో అని చెప్పడానికి ఓ క్లాసిక్ ఉదాహరణగా హైడ్ గ్యాస్ ఆవిష్కరణను అభివర్ణించవచ్చు. ఇంజనీరింగ్ మూడో ఏడాది చదువుతున్నప్పుడు.. తమ డిజిటల్ థింకింగ్‌తో అసంతృప్తికి లోనై ఏదో చేయాలనుకున్నారు. కానీ ఏం చేయాలనే దానిపై స్పష్టత రాలేదు. అంతర్ కాలేజీ రేసింగ్ కాంపిటీషన్‌లలో పాల్గొనడానికి వచ్చిన టీం అంతా కలిసారు. ప్రతి టీం తయారు చేసిన కార్‌తో ప్రఖ్యాత బుద్ధ సర్క్యూట్ దగ్గర.. జరిగే రేస్‌లో పాల్గొనాలి. తమ కారు కోసం మంచి బ్యాటరీని తయారు చేసే క్రమంలో హైడ్రోజన్‌ను కనుగొన్నారు. పనిగట్టుకొని పునరుత్పాదక శక్తిపై ప్రయోగాలు మొదలు పెట్టారు.

కొన్ని గ్యాస్ ఏజెన్సీలు, ప్రభుత్వ చేతకానితనం వల్ల గ్యాస్ డిస్ట్రిబ్యూషన్‌పై గుత్తాధిపత్యం ఎంతో క్రూరంగా తయారైంది. అవసరాలకు తగిన గ్యాస్ లభించకపోవడం అనేది అటు పట్టణ వినియోగదారులనే కాదు ఇటు పల్లె జనాలను సైతం నిస్సహాయతకు గురి చేస్తోంది. గ్యాస్ సిలిండర్లు (బండలు) వల్ల జరిగే ప్రమాదాలు ఇక సరేసరి. ఇలాంటి ఎన్నో విషయాలు హైడ్ గ్యాస్ కార్యరూపం దాల్చడానికి ఆజ్యం పోశాయని తమ ఆలోచనలను తెలియజేస్తున్నారు.

'భారతదేశంలో పెద్ద కంపెనీల చేతిలో గ్యాస్ పంపిణీ కేంద్రీకృతం కావడం మాకు నచ్చలేదు. సాధ్యమైనంతలో దీన్ని వికేంద్రీకరిద్దామనే సంకల్పించాం' అని రిష్విన్ అన్నారు. ప్రమాదం జరగడానికి అవకాశం శూన్యం. ఇదే హైడ్ గ్యాస్ మార్కెట్ అజెండా. నీటిని ఇంధనంగా ఉపయోగిస్తుంది కనుక ఆచరణాత్మకంగా చూస్తే కాలుష్యం కూడా సున్నా శాతమే. ఇక్కడ గ్యాస్ నిల్వ ఉండే అవకాశం లేదు కాబట్టి రక్షణ విషయంలో ఆందోళన కూడా లేదు. "ఉచితమేకాదు సురక్షితంగా వంటచేయొచ్చు" అని గర్వంగా చెప్పుకుంటారు. రెండురకాల వినియోగదారులను తాము లక్ష్యంగా పెట్టుకున్నామని రిష్విన్ చెప్పారు. ఇందులో మొదటిది రెస్టారెంట్, హోటళ్లు. సాధారణ హోటళ్లు రోజుకి సరాసరి 3నుంచి 4 సిలిండర్లను ఉపయోగిస్తాయి. వినియోగంతో పోలిస్తే దీనికి ప్రత్యామ్నాయంగా హైడ్ గ్యాస్ ఎంతో లాభదాయకం అవుతుందని భావిస్తున్నాం. ఇకపోతే రెండో టార్గెట్ గృహ వినియోగదారులు. ఈ మార్కెట్ చాలా పెద్దది కావడంతో టార్గెట్ కస్టమర్లు వీళ్లేనని చెబుతున్నారు.


ముందుగా హోటల్స్‌లో ప్రొడక్టును సేల్ చేస్తాం. హోం వర్షన్ ప్రొడక్ట్ పై పరిశోధన - అభివృద్ధి కొనసాగుతోంది. అయితే మొత్తం ప్రొడక్ట్ బయటకి వచ్చే క్రమంలో ఎన్నో అవాంతరాలు. టీంకి సంబంధించిన రిలేటివ్స్ అనుభవాలను లెక్కలోనికి తీసుకున్నారు. హైడ్ గ్యాస్ అనేది ఫస్ట్ ఆఫ్ ఇట్స్ కైండ్ అనే విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు. పరిమిత సూచనల మేరకు డెవలప్ చేసి ప్రొడక్ట్ ఇది. ఇంటి అవసరాలకు దీన్ని అమ్మాల్సి వస్తే.. కచ్చితంగా ధరను తగ్గించాలనే నిర్ణయించుకున్నామని రిష్విన్ చెప్పారు. అన్నింటినీ అధిగమించి ఇప్పుడిక్కడికి వచ్చాం. వినూత్నంగా మార్కెటింగ్ చేసేక్రమంలో ఎలాంటి సమస్యలొస్తాయో చూడాలి. ఇప్పటికైతే ఉన్న ఒకే ఒక్క క్లయింట్ కెఫెటేరియా ఆఫ్ కుస్టా మాత్రమే. మార్కెట్‌లో స్పందన బాగానే ఉందని రిష్విన్ అంటున్నారు. తామిప్పటికే కొంతమంది కార్పొరేట్, హోటళ్లతో మాట్లాడారట. కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా ఆసక్తి చూపడం తమలో భరోసా నింపిందని ఈ యువ బృందం ఉత్సాహంగా చెబ్తోంది.

మొదటి రెండు నెలలు రెయిన్వో ల్యాబ్స్ సొంత నిధులతోనే (సెల్ఫ్ ఫండెడ్)నెట్టుకొచ్చింది. కేరళ రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ శాఖతో పాటు స్టార్టప్ విలేజి నుంచి ప్రారంభ నిధుల(ఇనీషియల్ ఫండింగ్) సమీకరణ చేశారు. మరిన్ని నిధుల సమీకరణ కోసం చర్చలు జరుపుతున్నారు. "వ్యాపారవేత్త కావాలంటే అన్నింటికంటే ప్రధానమైనది బాధ్యత. చిన్నవైనా, పెద్దవైనా నిర్ణయాలు తీసుకోవడం కష్టమైన పనే. మాకు ప్రతీదీ కొత్తే. టెక్నాలజీ పరంగా చూసినా మేం కొత్తవాళ్లమే. ప్రతిదానిలో చాలారకాలైన సమస్యలను ఎదుర్కొన్నాం. కానీ దేన్నీ త్యాగం చేయలేదు. నచ్చిన పని ఇష్టంగా చేశాం. అంతే ఇందులో త్యాగానికి తావులేనే నేను అనుకుంటున్నా" అని రిష్విన్ అన్నారు. "ఇంతకీ మా టీంని పరిచయం చేయలేదు కదా! విమల్ గోపాల్, విజీష్ టివి, నితిన్ మోహన్, ప్రవీణ్ శ్రీధర్ తోపాటు నేను. ఎంట్రపెన్యూవర్‌గా ఉంటానికి ఇష్టపడతామని చెబుతూనే.. "మాకోసం మేం పనిచేస్తున్నాం.. మేం అనుకున్నదే చేస్తాం" ఏదో ఒకరోజు ప్రపంచాన్ని మార్చేయబోతున్నాం. కస్టమర్ల అవసరాలకు తీర్చడంతోపాటు కంపెనీ అభివృద్ధిని ఓ స్మార్ట్ వేలో చేయాలనేదే ప్రస్తుతానికి మా ముందున్న లక్ష్యం" అని వివరించారు రిష్విన్.

అమెరికా వెళ్లిన రామ్ చరణ్, ఎన్టీఆర్

త్రివిక్రమ్ సినిమా మేకోవర్ పని మీద ఎన్టీఆర్ బిజీగా ఉన్నాడని అంతా అనుకుంటున్నారు. మరోవైపు రంగస్థలం సినిమా వర్క్‌లో రామ్ చరణ్ బిజీగా ఉన్నాడని కూడా అందరికీ తెలుసు. కానీ ఊహించని విధంగా ఈ ఇద్దరు హీరోలు కలిసి అమెరికా వెళ్లారు. నిన్న ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో చరణ్, ఎన్టీఆర్ కలిశారు. అట్నుంచి అటే అమెరికా వెళ్లారు. ఈ స్టిల్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీళ్లిద్దరూ రాజమౌళి సినిమా కోసం ఎన్టీఆర్-చరణ్ లాస్ ఎంజెల్స్ వెళ్లారు. వీళ్లిద్దరిపై అక్కడ టెస్ట్ షూట్ జరగనుంది. ఈ టెస్ట్ కట్ ఎన్ని రోజులు ఉంటుందనే విషయంపై క్లారిటీ లేదు. జులై నుంచి ఎన్టీఆర్, చరణ్‌తో వర్క్ షాప్ స్టార్ట్ చేయబోతున్నాడు జక్కన్న. దీనికి ప్రీ-విజువలైషన్ అనే పేరు కూడా పెట్టారు. అంతకంటే ముందు టెస్ట్ కట్ కోసం ఇద్దరు హీరోలు అమెరికా వెళ్లారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించి స్క్రీన్ ప్లే పూర్తిచేశాడట రాజమౌళి. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఆగస్ట్ నుంచి ఈ మల్టీస్టారర్ మూవీ సెట్స్ పైకి వస్తుంది.





సూర్య 36 ఫస్ట్‌లుక్ విడుదల

సెల్వరాఘవన్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న 36వ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కొన్ని రోజులుగా చెన్నైలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న ఈ చిత్రంలో సూర్యకు జోడీగా రకుల్‌ప్రీత్ సింగ్, సాయిపల్లవి నటిస్తున్నారు. తాజాగా సెల్వరాఘవన్ పుట్టినరోజు సందర్భంగా 'సూర్య 36' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. అయితే ఎవరూ ఊహించని విధంగా ఈ పోస్టర్‌లో 'ఎన్‌జీకే' అని ఇంగ్లీషులో టైటిల్ ఉండడం, సూర్య చేగువేరా తరహా గెటప్‌లో కనిపించడం అభిమానులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంతకుముందు సూర్య నటించిన చిత్రాలకు 'ఆరు', '24' వంటి వైవిధ్యమైన టైటిల్స్ పెట్టారు. ఇప్పుడు 36వ చిత్రానికి 'ఎన్‌జీకే' అని పెట్టడంతో కథ ఏమై ఉంటుందోనని అభిమానుల్లో ఉత్సుకత పెరిగింది. ఈ చిత్రాన్ని దీపావళికి విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

బాలీవుడ్ సినిమా రీమేక్ తమిళంలో మంచు లక్ష్మి

మంచు లక్ష్మి మరో తమిళ సినిమా చేయబోతోంది. మంచి కథలకే నా ఓటు అని ముందు నుంచి చెబుతోన్న లక్ష్మి అందుకు తగ్గట్టే కంటెంట్ ఉన్న కథలనే సెలెక్ట్ చేసుకుంటోంది. ప్రస్తుతం 'వైఫ్ ఆఫ్ రామ్' అనే ఓ కొత్త తరహా కథతో రాబోతోన్న లక్ష్మికి మరో మంచి ఆఫర్ వచ్చింది. అది కూడా తమిళ్‌లో. బాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన తుమ్హారీ సులు అనే చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేస్తున్నారు. బాలీవుడ్‌లో విద్యాబాలన్ పోషించిన పాత్రను తమిళంలో జ్యోతిక చేస్తోంది. ఇదే సినిమాలో నేహా ధూపియా క్యారెక్టర్‌కు మంచు లక్ష్మిని అప్రోచ్ అయ్యారు. గతంలో ఒకట్రెండు తమిళ సినిమాలు చేసినా, ఈ పాత్ర తనకు ఖచ్చితంగా గుర్తింపు తెస్తుందని వెంటనే ఈ ప్రాజెక్ట్ ఒప్పుకున్నానంటోంది లక్ష్మి. ఈ విషయాన్ని స్వయంగా తెలియపరిచి ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. "బాలీవుడ్‌లో వచ్చిన తుమ్హారీ సులు నేను చూడలేదు. కానీ నేహా ధూపియా పాత్ర గురించి తెలుసు. ఆమె పాత్ర సినిమాలో చాలా స్టైలిష్‌గా ఉంటుంది. అలా ఉండటానికి నాకూ ఏ ఇబ్బంది లేదు. ఇప్పటికే చాలా డీ గ్లామర్ పాత్రలు చేసి బోర్ కొట్టేసింది. అందుకే ఈ పాత్ర కోసం చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాను. ఎప్పుడెప్పుడు సెట్స్‌లోకి వెళతానా అన్నంత ఆసక్తిగా ఉంది. అసలు ఈ ప్రాజెక్ట్‌లో నన్ను అనుకున్నందుకు సూర్య, జ్యోతికలకు థాంక్స్. నా గురించి తెలుసు, నేనెంత కమాండింగ్‌గా ఉంటానో అనేది. ఒక రకంగా చెప్పాలంటే తుమ్హారీ సులులో నేహాధూపియా పాత్రలా నా మైండ్ కమాండింగ్‌గా ఉంటుంది. ఇవన్నీ తెలిసే నేనైతేనే ఈ పాత్రకు కరెక్ట్ అనుకున్నారట"అని చాలా ఎగ్జైటింగ్‌గా చెప్పింది మంచు లక్ష్మి. ఈ చిత్రం మే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లబోతోంది. ఇక ప్రస్తుతం 'వైఫ్ ఆఫ్ రామ్' అనే మరో డిఫరెంట్ మూవీలో నటిస్తోంది లక్ష్మి. నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా నమ్మే ఒక విచిత్రమైన పాత్రలో తను కనిపిస్తుంది.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోన్న వైఫ్ ఆఫ్ రామ్ త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది..

మూడు నెలల్లో రణవీర్ సింగ్, దీపికా పదుకొనె వివాహం

రణవీర్ సింగ్, దీపికా పదుకొనె ఏడడుగులు కలసి నడిచే దూరం ఇంకెంతో దూరంలో లేదు ముచ్చటగా మూడంటే మూడు నెలల్లో దీపిక మెడలో రణవీర్ మూడు ముళ్ళు వేస్తాడని, ఇద్దరూ విడివిడిగా ఉండే ప్రసక్తి లేదని హిందీ సినిమా జనాలు చెవులు కొరుక్కుంటున్నారు. ఎందుకంటే... ఇటీవల దీపిక తల్లిదండ్రులు ముంబయ్ వెళ్ళి రణవీర్ తల్లిదండ్రులతో పెళ్ళి విషయమై మాట్లాడారట ఇరువురి కుటుంబ పెద్దలు గతంలో కలిసినప్పుడూ ఇటువంటి వార్తలే వచ్చాయి. వాటిని దీపిక సవ్వుతూ ఖండించారనుకోండి ఈసారి రెండడుగులు ముందుకు వేసి, పెళ్ళి వేదికతో పాటు ఏ సంప్రదాయంలో జరుగుతుందో కూడా చెబుతున్నారు. దీపిక బెంగళూరు



అమ్మాయి కాబట్టి పెళ్ళి దక్షిణాది సంప్రదాయం ప్రకారం జరపాలని నిశ్చయించినట్టు సమాచారం. నిజానికి, విదేశాల్లో పెళ్ళి చేసుకోవాలనుకున్నా బంధువులంతా ఇండియాలోనే ఉన్నారనీ, వారు విదేశాలు రావడం కష్టమవుతుంది కనుక ముంబయ్‌లో పెళ్ళి చేయాలని రణవీర్ తల్లిదండ్రులు కోరగా... హీరో హీరోయిన్లు ఇద్దరూ సరేనన్నారట.

విశాలాంధ్ర సినిమా



'అభిమన్యుడు' మొదటి పాట విడుదల నేడు

మాస్ హీరో విశాల్ కథానాయకుడిగా పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అభిమన్యుడు'. ఈ చిత్రం తెలుగు రైట్స్‌ను హరి వెంకటేశ్వర పిక్చర్స్ అధినేత జి.హరి ఫ్యాన్సీ ఆఫర్‌తో దక్కించుకున్నారు. ఎం.పురుషోత్తమన్ సమర్పణలో హరి వెంకటేశ్వర పిక్చర్స్ పతాకంపై జి.హరి ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయనున్నారు. కాగా, ఈ చిత్రంలోని తొలి పాటను యూత్ స్టార్ నితిన్ చేతులమీదుగా మార్చి 8న విడుదల చేస్తున్నారు.

ఈ సందర్భంగా హరి వెంకటేశ్వర పిక్చర్స్ అధినేత జి.హరి మాట్లాడుతూ "ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మార్చి 8న ఈ చిత్రంలోని మొదటి పాటను హీరో నితిన్ విడుదల చేయనున్నారు. విశాల్ కెరీర్‌లోనే హయ్యస్ట్ బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమా ఇది. హై టెక్నికల్ వేల్యూస్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. యాక్షన్ కింగ్ అర్జున్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు" అన్నారు. విశాల్, సమంత, అర్జున్‌తోపాటు భారీ తారాగణం ఈ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రా నికి సంగీతం: యువన్ శంకర్‌రాజా, సినిమా టోగ్రఫీ: జార్జి సి.విలియమ్స్, ఎడిటింగ్: రూబెన్, ఫైట్స్: దిలీప్ సుబ్బరాయన్, ఆర్ట్: ఉమేష్ జె.కుమార్, మాటలు: రాజేష్ ఎ.మూర్తి, నిర్మాత: జి.హరి, దర్శకత్వం: పి.ఎస్.మిత్రన్.

భరత్ అనే నేను టీజర్

మహేష్ బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ ఎవెయిటింగ్ మూవీ భరత్ అనే నేను. గతంలో వీళ్లిద్దరూ కలిసి చేసిన శ్రీమంతుడు సినిమా పెద్ద హిట్ అవ్వడంతో.. తాజా ప్రాజెక్టుపై అంచనాలు పెరిగాయి. ఇలా భారీ అంచనాల మధ్య భరత్ అనే నేను సినిమా టీజర్ విడుదలైంది. విజన్ ఆఫ్ భరత్ పేరిట విడుదలైన ఈ టీజర్ ఎలా ఉందో చూద్దాం. "మనం సమాజంలో ఉన్నాం. ప్రతి ఒక్కరికి భయం, బాధ్యత ఉండాలి", "నా జీవితంలోనే అతిపెద్ద ప్రామిస్ చేయాల్సిన రోజు ఒకటి వచ్చింది. పెద్దదే కాదు, కష్టమైంది కూడా." ఈ రెండు డైలాగ్స్ చాలు.. సినిమా ఎలా ఉండబోతోందో చెప్పడానికి. అవును భరత్ అనే సినిమా ఔట్ అండ్ ఔట్ సీరియస్ సబ్జెక్ట్‌గా కొనసాగబోతోంది. పొలిటికల్ బ్యాక్ డ్రాప్‌తో ఈ సినిమా రాబోతోందనే విషయం అందరికీ తెలిసిందే. ఇక టీజర్ విషయనికొస్తే ముఖ్యమంత్రి భరత్ రామ్ పాత్రలో మహేష్ ఎనర్జిటిక్‌గా కనిపించాడు. అతడు చెప్పిన డైలాగ్స్ భలే పేలాయి. టీజర్‌లో దర్శకుడు కొరటాల మార్క్ స్పష్టంగా కనిపించింది. దేవిశ్రీ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, రవి కె.చంద్రన్ సినిమాటోగ్రఫీ ఈ టీజర్‌కు మరింత అందం తీసుకొచ్చాయి. ఓవరాల్‌గా భరత్ రామ్ టీజర్ తోనే బ్లాక్ బస్టర్ అనిపించుకున్నాడు.





కాజల్, కళ్యాణ్ రామ్ పాట చిత్రీకరణ

కళ్యాణ్ రామ్, కాజల్ అగర్వాల్ హీరోహీరోయిన్లుగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో విశ్వప్రసాద్, భరత్ చౌదరి నిర్మాతలుగా తెరకెక్కుతున్న సినిమా 'ఎం.ఎల్.ఎ'. దాదాపు షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం అజీర్ భాయ్జాన్‌లోని బాకు ప్రాంతంలో పాట చిత్రీకరణను జరుపుకుంటోంది. జానీ మాస్టర్ నేతృత్వంలో ఈ సాంగ్ రూపొందుతోంది. మణిశర్మ సంగీతం అందిస్తోన్న ఈ సినిమాలోని మొదటి పాట ఇటీవలే విడుదలై మంచి స్పందన తెచ్చుకుంది. మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కామెడీ కంటెంట్ కూడ బాగానే ఉంటుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్ కొత్త లుక్‌లో కనిపించబోతున్నాడు. ఈనెల 23న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

కిరాక్ పార్టీ టీం ప్రీ రిలీజ్ ఫంక్షన్

ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థపై సుంకర రామబ్రహ్మం నిర్మిస్తోన్న సినిమా 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి ఈ సినిమా ద్వారా దర్శకుడిగా మారారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ప్రీ లుక్ కు మంచి స్పందన లభించింది. కాలేజ్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఈ నెల 13 న చెయ్యబోతున్నారు. ఇండస్ట్రీ నుండి కొంతమంది యువహీరోలు ఈ వేడుకకు హాజరు కానున్నారు. రాజమండ్రి పరిసర ప్రాంతంలో ఎక్కువ షూటింగ్ జరుపుకున్న ఈ సినిమా ఈనెల 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సంయుక్తా హెగ్డే, సిమ్రాన్ పరీన్జా కథానాయికలుగా నటించిన ఈ మూవీకి అజనీష్ లోకనాథ్ సంగీతం అందించాడు. ఒకరిద్దరు తప్ప దాదాపు అందరూ కొత్తవాళ్ళే ఈ చిత్రంలో నటించారు.

రానున్న యూపీ ఎన్నికల్లో

ఎస్పీ, బీఎస్పీ అవగాహనకు పరీక్ష



లక్నో : ఈ నెలలో గోరఖ్‌పూర్, పుల్పూర్‌లలో లోక్‌సభ ఉప ఎన్నికలు, రాజ్యసభ్య ఎన్నికలు బీఎస్పీ, ఎస్పీ ఎన్నికల అవగాహనకు ప్రధాన పరీక్షలుగా నిలవనున్నాయి. వీరి కొత్త కలయిక, భవిష్యత్ కూటమి పట్ల ప్రజల అశలను నిర్ధారించనున్నది. ఈ ఎన్నికలు విపక్ష ఐక్యతకు ఒక అవకాశంగా కూడా నిలవనున్నాయి. ప్రత్యేకించి రాజ్యసభ ఎన్నికలకు కాంగ్రెస్, ఎస్పీతో క్విడ్ ప్రో కో ఒప్పందానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి సూచనప్రాయంగా పేర్కొంది. లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఒక ఎన్నికల కూటమి ఏర్పడే అవకాశాలున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. మాయావతి మాట్లాడుతూ రాజ్యసభ, యూపీ లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీ ఓటమి కోసం ఎస్పీ, బీఎస్పీ లెజిస్లేటర్లు తమ ఓట్లను బదిలీ చేసినట్ల యితే దానిని ఎన్నికల కూటమిగా చూడకూడదని అన్నారు. 'రాజ్యసభకు మా పార్టీ కార్యకర్తను పంపేం దుకు ఎస్పీతో చర్చలు జరిపాం. అటుతర్వాత లెజిస్లేటీవ్ కౌన్సిల్ ఎన్నికల్లో వారికి సహాయం చేయనున్నాం' అని మాయావతి చెప్పారు. కాగా మార్చి 11న లోక్‌సభ ఉప ఎన్నికలు, మార్చి 23న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గత ఏడాది యూపీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రిగా కేశవ్ ప్రసాద్ మౌర్యలు బాధ్యతలు చేపట్టడంతో లోక్‌సభ స్థానాలు ఖాళీ అయ్యాయి.

తొగాడియాకు తృటిలో తప్పిన ప్రమాదం

సూరత్ (గుజరాత్) : విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా తృటిలో ప్రాణాపాయం తప్పించుకున్నారు. సూరత్‌లో ఒక వేడుకకు హాజరవడం కోసం ఆయన కారులో ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వచ్చిన ట్రక్ కారును ఢీకొట్టిందని పోలీసులు తెలిపారు. తన వాహనం బుల్లెట్ ప్రూఫ్‌ది కానట్లయితే మృతి చెంది ఉండేవాడినన్నారు. ఇప్పటికే కేంద్రం తన జెడ్ ప్లస్ భద్రతా సిబ్బందిని తొలగించిందని ఆయన విమర్శించారు. ట్రక్ డ్రైవర్‌ను అరెస్టు చేశామని, సూరత్ రూరల్ ఎస్పీ ఎంకే నాయక్ తెలిపారు.

'రామమందిరం'లో రవిశంకర్ జోక్యమెందుకు..? : శివసేన

ముంబై : రామమందిరం విషయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ 'జోక్యం' చేసుకోవడాన్ని శివసేన తప్పుబట్టింది. బీజేపీ కోరుకున్నట్లయితే, 24 గంటల్లో అయోధ్య వద్ద రామమందిరం నిర్మాణ ప్రారంభిస్తుంది. దాని కోసం ఆర్డినెన్స్ జారీ చేస్తుంది. 'గత రెండేళ్లుగా రామమందిరం విషయంలో దేవుడుగా చెప్పు కుంటున్న శ్రీశ్రీ రవిశంకర్ చర్చలకు ఒక పార్టీగా ఉండాలని ప్రయత్నిస్తున్నారు. ఇపుడేమో ఈ సమస్య పరిష్కారం కానట్లయితే సిరియా వంటి పరిస్థితి ఉత్పన్నమవుతుంది' అని తన పార్టీ పత్రిక 'సామ్నా'లో ఒక సంపాదకీయంలో సేన పేర్కొంది. ఆధ్యాత్మిక గురువు బెదిరిస్తున్నట్లయితే దీనిపై దర్యాప్తు జరపాలి. ఈ విషయంలోకి ఐసిస్‌ను తీసుకురావడం లేదా భవిష్యత్తులో చట్టవిరుద్ధమైన స్థితిని సృష్టించడం, దేశ భద్రతకు ముప్పు కలిగే ప్రకటన చేసిన ఆయనపై దర్యాప్తు నిర్వహించాలి. ఇది ఏ విధమైన ఆర్ట్ ఆఫ్ లివింగ్ అని ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని పార్టీ పేర్కొంది. ప్రజల్లో అసంతృప్తి ఉన్నపుడు రవిశంకర్ ఎక్కడా కనిపించలేదని అన్నారు. పార్లమెంటులో మెజార్టీ కలిగి ఉన్న బీజేపీ కోరుకున్నట్లయితే, ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చి 24 గంటల్లో రామమందిర నిర్మాణం ప్రారంభిస్తుందన్నారు. ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ నేత మోహన్ భగవత్‌లకు ఆ సమస్యను వదిలి వేయాలి. మహి ళలు, నిరు ద్యోగులు, పేదలు, రైతుల దుస్థితిపై రవిశంకర్ దృష్టిసారించాలని శివసేన పేర్కొంది.

కదం తొక్కిన రైతాంగం

సంపూర్ణ రుణమాఫీ కోసం లాంగ్ మార్చ్ : 12న మహారాష్ట్ర విధానసభ ఘెరావ్



నాసిక్ : మహారాష్ట్రలో రైతులు కదంతొక్కారు. సంపూర్ణ రుణమాఫీతో సహా తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నాసిక్ నుంచి ముంబై వరకు 'లాంగ్ మార్చ్' ప్రారంభించారు. ఈ మార్చ్‌లో సుమారు 25వేల మంది రైతులు పాల్గొన్నారు. సెంట్రల్ నాసిక్‌లోని సీబీఎస్ చౌక్ వద్ద నుంచి ఆలిండియా కిసాన్‌సభ (ఏఐకేఎస్) నేతృత్వంలో మంగళవారం సాయంత్రం 180కిమీల మార్చ్‌కు శ్రీకారం చుట్టిన రైతులు రాత్రి విరామం అనంతరం తిరిగి మార్చ్‌ను ప్రారం భించారు. ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావ్లే, స్థానిక ఎమ్మెల్యే జేపీ గావిట్, ఇతర నేతలు లాంగ్ మార్చ్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ముంబై-ఆగ్రా జాతీయ రహదారి గుండా మార్చ్ సాగింది. ఈ నెల 12న ముంబైకి చేరుకోనున్న రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం మహారాష్ట్ర విధానసభను ఘెరావ్ చేయనున్నట్టు ఏఐకేఎస్ నాయకుడు సునీల్ మలుసరె తెలిపారు. విద్యుత్ బిల్లు, రుణాల సంపూర్ణ మాఫీతో పాటు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు. సూపర్ హైవేస్, బుల్లెట్ ట్రైన్స్ వంటి అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట రైతుల నుంచి సాగుభూముల సేకరణను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని కూడా డిమాండు చేస్తున్నట్టు ఏఐకేఎస్ కార్యదర్శి రాజు దస్లే వెల్లడించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో రైతులు నిరంతరాయంగా పోరాటాలు చేయడంతో ప్రభుత్వం గతేడాదిలో రుణమాఫీని ప్రకటించింది. గతేడాదిలో రూ.34వేల కోట్ల షరతులతో కూడిన రుణమాఫీని బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నాటి నుంచి 1,753 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్టు రాజు తెలిపారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోని ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. గిరిజన గ్రామాలు నీటమునగకుండా, కరవు ప్రాంతాలతో పాటు ఆయా జిల్లాలకు నీటి సరఫరా ఉండేలా ప్రతిపాదిత నాసిక్, థానే, పాల్ఘర్ నదుల అనుసంధానం పథకాన్ని పూర్తిగా మార్చాలని డిమాండు చేస్తామన్నారు. ఏళ్లతరబడి సాగు చేసుకున్న వారికి అటవీభూముల బదిలీ చేయాలని, వడగండ్ల వాన, పురుగుల కారణంగా పంట నష్టపోయిన రైతులకిచ్చే పరిహారాన్ని పెంచాలని కూడా డిమాండు చేస్తున్నట్టు తెలిపారు.

తప్పంతా చిదంబరందే



- డీఆర్ఐ వ్యతిరేకించినా..
- '80:20' పథకాన్ని ప్రవేశపెట్టారు
- పీఏసీ సబ్ కమిటీ పరిశీలనలో వెల్లడి


న్యూఢిల్లీ : డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) వ్యతిరేకించినప్పటికీ 2013లో అప్పటి ఆర్థికమంత్రి పి.చిదంబరం 80:20 బంగారం దిగుమతి పథకాన్ని ప్రవేశపెట్టారని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) సబ్‌కమిటీ కనుగొన్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ పథకాన్ని అమలు చేసేందుకు నాటి ఆర్థికమంత్రి అనుసరించిన విధివిధానాలపై సీబీఐతో విచరణ జరిపించాలని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె నేతృత్వంలోని పీఏసీ సబ్ కమిటీ సిఫార్సు చేసినట్టు తెలిసింది. ఈ పథకం నల్లధనం రౌండ్ ట్రిప్పింగ్ (విదేశాలకు తరలించి తెల్లగామార్చి తిరిగి దేశానికి తేచ్చే ప్రక్రియ) ద్వారా వాడుకలోకి రావచ్చునని, మనీలాండ రింగ్‌కు దారితీసే అవకాశాలున్నట్టు డీఆర్ఐ సూచిం చింది. 2013, ఆగస్టులో అప్పటి యూపీఏ ప్రభుత్వం కూడా 80:20 పథకాన్ని అమలు చేసింది. ఇంతకు ముందు దిగుమతి చేసుకొన్న దానిలో 20శాతం బంగారాన్ని ఎగుమతి చేసిన తర్వాతే బంగారాన్ని దిగుమతి చేసుకునేందుకు వ్యాపారవేత్తలకు అనుమతి నిచ్చింది. ఎన్డీఏ అధికారం లోకి వచ్చిన తర్వాత 2014లో ఈ విధానం రద్దు అయింది. ఆర్థికశాఖ అధికారులు పీఏసీ సబ్‌కమిటీ సభ్యులకు అందించిన సమాచారం మేరకు 80:20 బంగారం దిగుమతి పథకానికి డీఆర్ఐ పూర్తిగా వ్యతిరేకమని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

గత వారంలో 2016లో జరిగిన పసిడి దిగుమతులపై వెలువడిన కాగ్ నివేదికను సభ్యులు పరిశీలించారని, ఈ పథకం దుర్వినియోగంలో చిదంబరం పాత్రపై ఆరాతీశారని వెల్లడించాయి. రెవెన్యూశాఖ కార్యదర్శి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ప్రత్యక్ష పన్నుల కేంద్రబోర్డు (సీబీడీటీ), ఎక్సైజ్, కస్టమ్స్ కేంద్ర బోర్డు (సీబీఈసీ)ల ఉన్నతాధికారులు ప్యానల్ ఎదుట హాజరయ్యారు. ఈ పథకం వల్ల ఖజానాకు రూ.లక్షకోట్ల నష్టం వచ్చినట్టు సభ్యులు తెలిపారు. స్వర్ణకారులకు ఒక డాలరు (అప్పట్లో రూ.60)ఆదాయం కలిగేలా మద్దతిచ్చేందుకు ప్రభుత్వం రూ.221.75 మేర సుంకాన్ని భరించేదని కాగ్ నివేదిక వెల్లడించినట్టు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మీ వద్ద ఉన్న పూర్తి సమచారాన్ని మాకివ్వండంటూ ఈడీ డైరెక్టర్, సీబీడీటీ, సీబీఈసీ ఛైర్మన్, రెవెన్యూ శాఖ కార్యదర్శిని పీఏసీ సబ్‌కమిటీ సభ్యులు కోరారు. ఈ పథకానికి, పీఎన్‌బీ కుంభకోణానికి మధ్య ఏమైనా సంబంధా లున్నాయా అన్నదీ ఆరా తీయాల్సిందిగా సూచించారు.

కావేరి కలిపింది

బోర్డు కోసం తమిళ ఎంపీల ఆందోళన

- ప్ల కార్డుల ప్రదర్శన
- ఏర్పాటు చేసే వరకు కొనసాగిస్తాం : ఎంపీల స్పష్టీకరణ



చెన్నై : ఐక్యతకు సంబంధించి అసాధారణ సంఘటన చోటుచేసుకున్నది. కావేరి జలవివాదం తమిళనాడులోని అధికార, ప్రతిపక్షాలు ఢిల్లీలో ఏకం చేసింది. కావేరి జల నిర్వహణ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తూ ఏఐఏడీఎంకే, డీఎంకే, సీపీఐ, సీపీఐ(ఎం) ఎంపీలు ప్లకార్డులతో పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలిపారు. బోర్డును ఏర్పాటు చేసే వరకు నిరసనను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ బోర్డు కనుక ఏర్పడితే కర్ణాటక రిజర్వాయర్ల నుంచి నెలకు ఎంత నీటిని విడుదల చేయాలో చెప్పే యంత్రాంగం ఏర్పడుతుంది. తమిళనాడుకు చెందిన ఎంపీలంతా ఈ అంశంపై ఒకే వేదికపైకి రావడం, వీరికి ఇతర రాష్ట్రాల ఎంపీలు మద్దతుపలకడం శుభపరిణామంగా డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. "నిరసన తెలపాలని మేము కోరుకుంటున్నాం. ఏఐఏడీఎంకే కూడా ఇదే విధమైన ఆందోళనను రూపొం దించాలి." అని అన్నారు. బోర్డును ఏర్పాటు చేయడంలో జాప్యంతో తమిళ నాడు రాష్ట్ర రైతులు, ప్రజలకు అన్యాయం జరుగుతుంది. ప్రత్యేకించి ఇప్పటికే కేటాయించిన జలాల్లో 14.75 టీఎంసీల నీటిని నష్టపోయామని చెప్పారు. "బోర్డు నోరులేనిదానిలా ఉండకూడదు. సుప్రీంకోర్టు ఆదేశాలను మొత్తంగా అమలుచేసే దానిలా ఉండాలి. ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం నెలనెలా నీటి విడుదల జరిగేలా ఉండాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది" అని కనిమొళి చెప్పారు.

ప్రజాప్రయోజనాలకు సంబంధించిన అంశం అయినందున తక్షణం చర్చించాలని కోరుతూ పార్లమెంట్ ఉభయ సభలలో ఈ అంశంపై వాయిదా తీర్మానాన్ని ఇచ్చారు. లోక్‌సభ ఉప సభాపతి, అన్నాడీఎంకే సీనియర్ నేత తంబిదురై మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పార్టీలకు చెందిన ఎంపీలు న్యాయమైన సమస్యపై ఆందోళన చేస్తున్నారని తెలిపారు. డీఎంకే ఎంపీలు కూడా తమతో కలిసి ఆందోళనలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. "తమిళనాడు ప్రయోజనాలకు ద్రోహం చేయొద్దు" అని వారు నినాదాలు చేశారు. తరువాత డీఎంకే రాజ్యసభ సభ్యులు కనిమొళి, తిరుచి శివ, ఆర్ఎస్ భారతి నిరసనలో పాల్గొన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు డి. రాజా, సీపీఎం సీనియర్ నాయకులు టీకే రంగరాజన్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ ఎంపీ ఎల్ గణేశన్ కూడా వచ్చి ఆందోళన చేస్తున్న సభ్యులకు మద్దతు తెలిపి వారితో కరచాలనం చేశారు. "రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం మన కర్తవ్యం. బోర్డును ఏర్పాటు చేసే వరకు మేము ఆందోళనను కొనసాగిస్తాం" అని ఏఐఏడీఎంకే ఎంపీ వి. మైత్రేయన్ తెలిపారు.

పార్లమెంటులో మూడోరోజూ...

పీఎన్‌బీ కుంభకోణంపై ప్రధాని మాట్లాడాలి : కాంగ్రెస్

పెరియార్ విగ్రహం ధ్వంసంపై ఏఐఏడీఎంకే నిరసన



న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉభయ సభలు వరుసగా మూడోరోజు కూడా తుడిచిపెట్టుకుపోయాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో కుంభకోణం, ద్రావిడ నాయకుడు పెరియార్ విగ్రహం విధ్వంసానికి నిరసనతో సహా వివిధ అంశాలపై పార్టీల సభ్యులు నిరసన తెలపడంతో ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ఉభయ సభలు వాయిదాపడ్డాయి. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి సంబంధం ఉందని ఆరోపణలు వస్తున్న రూ. 12,700 కోట్ల పీఎన్‌బీ కుంభకోణంపై ప్రధానమంత్రి సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టారు. వెల్లూరులో పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఆయన ఫొటోలు పట్టుకుని ఏఐఏడీఎంకే, అమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) సభ్యులు వెల్ వద్దకు దూసుకువచ్చి నినాదాలు చేశారు. రిజర్వేషన్లలో తెలంగాణా కోటా పెంచాలని డిమాండు చేస్తూ టీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండు చేస్తూ టీడీపీ, వైఎస్సార్‌సీపీ సభ్యులు నిరసన కొనసాగించారు. మరాఠకు ప్రాచీన భాష హోదా కల్పించాలని ఎన్డీయే మిత్రపక్షం శివసేన నిన్నటిలానే ఈ రోజు కూడా ఆందోళనకు దిగింది.

ఈ రోజు ఉదయం లోక్‌సభ ప్రారంకాగానే టీడీపీ, శివసేన , టీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్, ఏఐడీఎంకే, టీఎంసీ సహా వివిధ పార్టీల సభ్యులు ఆయా అంశాలపై నినాదాలు చేయడం ప్రారంభించారు. తీవ్రగందరగోళం మధ్య స్పీకర్ సుమిత్రా మహాజన్ తన డిమాండుపై మాట్లాడవలసిందిగా శివసేన సభ్యుడు ఆనందరావు అడ్సూల్‌ని కోరారు. మరాఠ ప్రాచీన భాష అని, ప్రాచీన భాష హోదా కల్పించేందుకు అన్ని అర్హతలు మరాఠకు ఉన్నాయని అడ్సూల్ చెప్పారు. తెలుగు, కన్నడ, మళయాలం, ఒడియా భాషలకు ప్రాచీన హోదా కల్పించారన్నారు. "మా సభ్యులు అనేక మంది పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇందుకు అవసరమైన వాటిని మంత్రికి మేము అందజేస్తున్నాం. కానీ, మా డిమాండు ఇప్పటికీ నెరవేరలేదు" అని అడ్సూల్ అన్నారు. అప్పుడు సభలోనే ఉన్న హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఈ అంశాన్ని పరిశీలిస్తామని అడ్సూల్‌కి హామీ ఇచ్చారు. "ఈ అంశం హోం మంత్రిత్వ శాఖకు సంబంధించింది కాదు, ఇందుకు సంబంధించి సాంస్కృతిక శాఖ మంత్రితో నేను మాట్లాడుతాను" అని సింగ్ చెప్పారు. అంతటితో ఈ అంశంపై నిరసనను శివసేన ఆపివేసినప్పటికీ, ద్రావిడ ఉద్యమ వ్యవస్థాపకులు పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేయటాన్ని నిరసిస్తూ ఏఐడీఎంకే సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. "పెరియార్ విగ్రహాన్ని బీజేపీ కార్యకర్తలు ధ్వంసం చేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం" అన్న ప్ల కార్డులను ఏఐడీఎంకే సభ్యులు చేబూనారు. సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభను గంటపాటు వాయిదావేశారు. తరువాత సమావేశ మైన తరువాత కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో రేపటికి వాయిదా వేశారు.

రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి. పీఎస్‌బీ కుంభకోణం, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ, కావేరి బోర్డు తదితర అంశాలపై టీడీపీ, ఏఐఏడీఎంకే, తృణమూల్ తదితర పార్టీలు సభలో నిరసన వ్యక్తం చేశాయి. సభ్యులు వెల్‌లోకి దూసుకు వచ్చారు. కొంత మంది సభ్యులు ప్లకార్డులను చేబూనారు. ఒకదాని తరువాత ఒకటి వినంటానని కురియన్ సభ్యులకు హామీ ఇచ్చారు. అయితే, సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. "ఏ అంశంపైనైనా చర్చకు అనుమతించేందుకు సిద్ధంగా ఉన్నాను" అని కురియన్ చెప్పారు. "ఇది జరగాలంటే మీరు గందరగోళం సృష్టించడాన్ని ఆపాలి" అని అన్నారు. ప్ల కార్డులను ప్రదర్శించడం నిబంధనలకు వ్యతిరేకమని అన్నారు. "మీరు అలా చేయడం తగదు. సభ్యులు హుందాతనంగా ఉండాలి...ఇలా జరుగుతుందని సభ్యుల నుంచి ఆశించకూడదు" అని చెప్పారు. "చర్చలు, సంప్రదింపులు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పద్ధతిలో సాగాలి. మీ డిమాండ్లకు స్పందించమని ప్రభుత్వాన్ని నేను కోరుతాను" అని కురియన్ తెలిపారు. అయినప్పటికీ సభ్యులు సంతృప్తి చెందక ఆందోళన కొనసాగిస్తుండడంతో సభను గురువారానికి వాయిదావేశారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయెల్ ఆందోళన చేస్తున్న సభ్యులతో అన్నారు. "చర్చకు మేము సిద్ధం. బ్యాంకింగ్ రంగంలో అక్రమాలు, ఇతర అంశాలు ఈ నాటివికావు, వీటి నుండి ప్రభుత్వం పారిపోదు" అని చెప్పారు. ఈ నెల ప్రారంభంలో మృతిచెందిన జైనేంద్ర కుమార్ జైన్ (73)కి సభ సంతాపం తెలిపింది. అయితే, కాంగ్రెస్, టీఎంసీ, వామపక్షాల, ఎన్డీయే మిత్రపక్షం టీడీపీ, ఏఐఏడీఎంకే సభ్యులు వెల్‌వద్దకు వెళ్లి నినాదాలు చేస్తూ ప్ల కార్డులను ప్రదర్శించారు.

ఇసుక మాఫియాకు పాలకుల అండ

- కావేరి బోర్డు ఏర్పాటుపై నమ్మకం లేదు
- త్రిపురలో అక్రమ పద్ధతిలో బీజేపీ గెలుపు
- సీపీఐ నేత నల్లకన్ను



రాజపాళెం : తమిళనాడులో పాలకుల అండతో ఇసుక దోపిడీ జరుగుతోందని సీపీఐ సీనియర్ నాయకులు నల్లకన్ను ఆందోళన వ్యక్తం చేశారు. రాజపాళెంలో పార్టీ ప్రముఖుడి ఇంట్లో జరిగిన వివాహానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక దోపిడీతో 33 చెరువులు నాశనం అయ్యాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి చట్ట విరుద్ధంగా మూడు అడుగులకు బదులు వంద అడుగులకు పైగా ఇసుక తవ్వుతున్నారని చెప్పారు. పర్యవసానంగా వంద అడుగుల లోతు వరకు భూగర్భ జలాలు తగ్గిపోయా యన్నారు. అంతేకాకుండా నదీ పరీవాహక ప్రాంతాల్లో చెట్లు అంతరించిపోయి, రాష్ట్రం ఎడారిగా మారిందన్నారు. ఇసుక కొరతకు రాష్ట్ర పాలకులే కారణమని, కొన్ని జిల్లాల కలెక్టర్లు కూడా ఇసుక దోపిడీకి పాల్పడే వారికి అండగా ఉన్నారని చెప్పారు. శేఖర్‌రెడ్డి వంటి ఇసుక మాఫియాకు మంత్రుల మద్దతు ఉందని నల్లకన్ను విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా కావేరీ యాజమాన్య మండలి ఏర్పాటు అవుతుందన్న నమ్మకం తనకు లేదని అన్నారు. కావేరీ యజమాన్య మండలి ఏర్పాటుకు అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన గడువు ఇంకా రెండు వారాలు మాత్రమే ఉందని, అయితే కర్ణాటకలో బీజేపీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉన్నందున యాజమాన్య మండలి ఏర్పాటు అవుతుందని తాను అనుకోవడం లేదన్నారు. త్రిపురలో 25 సంవత్స రాలుగా మానిక్ సర్కార్ చక్కగా, సమర్థవంతంగా పరిపాలన చేశారని ప్రశం సించారు. గత నెలలో జరిగిన ఎన్నికలలో బీజేపీ కుతంత్రాలు చేసి గెలిచిందని విమర్శించారు. పథకం ప్రకారం గిరిజనులను ఉపయోగించుకుని అక్రమం గా గెలిచిందని, ఇది దేశానికి ప్రమాదమని నల్లకన్ను అభిప్రాయపడ్డారు.

భువనేశ్వర్ స్టేషన్‌లో 'నాప్‌కిన్స్'

భువనేశ్వర్ : ఒడిశాలోని భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌లో ఆటోమాటిక్ శానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మిషన్‌ను ఏర్పాటుచేసినట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ (ఈసీఓఆర్‌డబ్ల్యూడబ్ల్యూఓ) అధికారి తెలిపారు. సెకండ్ క్లాస్ మహిళల వెయిటింగ్ హాల్‌లో 'హ్యాపీ నారి' పేరుతో మిషన్‌ను సోమవారం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. న్యాప్‌కిన్ కోసం రూ.5లు మాత్రమే చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. మహిళా ప్రయాణీకులు సౌకర్యవంతంగా ప్రయాణించేం దుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇటువంటి మిషన్‌ను స్టేషన్‌లో ఏర్పాటు చేయడం రాష్ట్రంలో ఇదే ప్రథమం.

'మహా' అసెంబ్లీ నుంచి ప్రతిపక్షాల వాకౌట్

ముంబై : అంగన్‌వాడీల్లో చిన్నారులు, గర్భిణీలులకు పౌష్టికాహారం అందించేందుకు సంబంధించిన నిధుల మంజూరులో జాప్యం అవ్వడాన్ని నిరసిస్తూ మహారాష్ట్ర శాసనసభ నుంచి ప్రతిపక్షాలు బుధవారం వాకౌట్ చేశాయి. అంగన్‌వాడీలకు కేటాయించిన రూ.800 కోట్ల బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని కాంగ్రెస్, ఎన్‌సీపీ సభ్యులు ఆరోపించాయి. సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్)కు కేంద్రం సగం నిధులనే ఇచ్చిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పంకజ ముండే చర్చలో సందర్భంలో తెలిపారు.

'హురియత్' నాయకుడు ఫారూఖ్ గృహనిర్బంధం

శ్రీనగర్ : దక్షిణ కాశ్మీర్‌లోని షోపియాన్ పట్టణంలో ప్రదర్శనకు ప్రయత్నించిన హురియత్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ మిర్వైజ్ ఉమర్ ఫారూఖ్‌ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఆదివారం రాత్రి సైన్యం కాల్పుల్లో పౌరులు ప్రాణాలు కోల్పోయిన ఘటనకు నిరసనగా ఫారూఖ్, ఆయన మద్దతుదారులు హురియత్ నాయకుడు నిగీన్ నివాసం నుంచి ప్లకార్డులు, బ్యానర్లతో ప్రదర్శనకు బయలు దేరారు. రక్షణ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం కింద పౌరులను బలి తీసుకోవడానికి స్వస్తి పలకాలంటూ వారు డిమాండు చేశారు.

అసెంబ్లీలో గొడవ కేసు ఉపసంహరణ

తిరువనంతపురం : మూడేళ్ల క్రితం అసెంబ్లీలో గొడవలకు పాల్పడిన ఘటనలో సభ్యులపై నమోదైన కేసును ప్రభుత్వ ఉపసంహరించుకుంటున్నట్టు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం సభలో ప్రకటించారు. 2015లో అసెంబ్లీలో ఆందోళనకు దిగిన ఆరుగురు ఎల్‌డీఎఫ్ ఎమ్మెల్యేలపై కేసు నమోదైంది. అయితే ఈ కేసు ఉపసంహరణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై యూడీఎఫ్ నాయకత్వంలోని కాంగ్రెస్, కాంగ్రెస్ (ఎం), బీజేపీ ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నాయకుడు రమేష్ చెన్నితల మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ తాము కోర్టుకు వెళతామని చెప్పారు.

ప్రశ్నాపత్రాల లీక్ కేసులో నలుగురి అరెస్ట్

ముంబై : 12వ తరగతి పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీకైన కేసులో నలుగురిని మధ్య ముంబైలోని బోయివాడలో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పరేల్‌లోని జూనియర్ కళాశాలలో ఫిబ్రవరి 28న పరీక్షకు జరగడానికి ఒక గంట ముందు మొబైల్‌ఫోన్‌లో రసాయనశాస్త్రం పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాన్ని చూస్తుండగా ఓ విద్యార్థి టీచర్‌కు పట్టుబడ్డాడని తెలిపారు. ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంలో కొంతమందికి ప్రమేయం ఉన్నట్టు విచారణలో తేలిందని చెప్పారు.

శ్రీనగర్, షోపియాన్‌లలో ఆంక్షలు

శ్రీనగర్ : ఇటీవల కాల్పుల ఘటనలో ఖైదీలను కాశ్మీర్‌లోని జైలు నుండి వేరే ప్రాంతంలోని జైలుకు తరలించడాన్ని నిరసిస్తూ వేర్పాటువాదులు ప్రదర్శనకు పిలుపుచ్చిన నేపథ్యంలో శ్రీనగర్‌లోని అనేక ప్రాంతాల్లో అధికారులు బుధవారం ఆంక్షలు విధించారు. శ్రీనగర్‌లోని ఏడు పోలీసుస్టేషను పరిధిలోని ప్రాంతాల్లో, షోపియాన్ జిల్లాలో ఆంక్షలు విధించినట్టు చెప్పారు. షోపియాన్‌లో 144వ సెక్షన్ విధించినట్టు తెలిపారు.

నాన్‌బెయిలబుల్ నేరంగా గుట్కా అమ్మకం

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో నిషేధించిన గుట్కా అమ్మకంను నాన్-బెయిలబుల్ నేరంగా పరిగణించాలని నిర్ణయించినట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వం శాసనమండలిలో పేర్కొంది. గుట్కా అమ్మకం కేసులో మూడేళ్ల జైలు, జరిమానా విధించాలని నిర్ణయించినట్టు తెలిపింది. ఈ సందర్భంలో ప్రతిపక్ష నేత ధనుంజయ్ ముండే మాట్లాడుతూ, పొరుగురాష్ట్రాల నుంచి గుట్కాల రవాణాపై నిఘా పెట్టాలని సూచించారు.

మిజోరాం కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నేత

ఐజ్వాల్ : మిజోరాంలో చక్మా అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ (సీఏడీసీ)లో ఏకైక బీజేపీ సభ్యురాలు లక్ష్మీ బికాష్ చక్మా బుధవారం కాంగ్రెస్‌లో చేరారని మిజోరాం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఎంపీసీసీ) ప్రకటనలో తెలిపింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయోత్సాహంతో ఉన్న నేపథ్యంలో చక్మా పార్టీ నుంచి వైదొలిగారు.మిజోరాంలో కమలం వికసించదని చక్మా తీసుకున్న నిర్ణయం సూచిస్తుందని ఎంపీసీసీ పేర్కొంది.

లోకల్ రైళ్ల వల్ల రూ.4 వేల కోట్లు నష్టం

న్యూఢిల్లీ : ముంబైలో నడుస్తున్న లోకల్ రైళ్ల వల్ల మూడేళ్లలో రైల్వేకు రూ.4 వేల కోట్లు నష్టం వాటిల్లిందని లోక్‌సభలో రైల్వేశాఖ సహాయమంత్రి రైన్ గొహైన్ లిఖితపూర్వకంగా బదులిచ్చారు. 2014 నుంచి 2017 వరకు ముంబై శివారుల్లో రైళ్లు నడపడం వల్ల రూ.4280.50 నష్టం సంభవించినట్టు తెలిపారు. మూడేళ్లలో లోకల్ రైళ్లు నడపడంతో వచ్చిన ఆదాయం రూ.5206.16 కోట్లు ఉండగా, రూ. 9486.66 కోట్లు ఖర్చు అయ్యిందని తెలిపారు.

సరిహద్దులో పాక్ కాల్పులు

జమ్మూ : జమ్మూ, రాజౌరీ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి సుందర్‌బనీ సెక్టార్‌లో బుధవారం పాక్‌దళాలు దాడులకు పాల్పడిందని ఆర్మీ అధికారులు తెలిపారు. భారత సైనిక దళాలు వెంటనే ఎదురుదాడులకు దిగి వాటికి ధీటైన సమాధానమిచ్చిందని చెప్పారు. సుందర్‌బనీలో ఉదయం 10.30 గంటలకు పాక్ సైన్యం విచక్షణారహితంగా కాల్పులు జరిపిందని, మోర్టార్లతో దాడులు చేసిందని తెలిపారు. జమ్మూ జిల్లాలోని అక్నూర్ సెక్టార్‌లోని ఖౌర్‌లో కాల్పులు విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని చెప్పారు.

ఇంజనీరులా వచ్చి ఏటీఎంలో నగదు దోపిడీ

ముజఫర్‌నగర్ : ఏటీఎంను రిపేర్ చేయడానికి వచ్చిన ఇంజనీరులా వచ్చి ఓ వ్యక్తి ఏటీఎం నుంచి రూ.18 లక్షలు దోచుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులోని ఏటీఎంలో చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. బ్యాంకులో ప్రవేశించిన దొంగను ఇంజనీరుగా భావించామని, ఆయన స్ట్రాంగ్ రూంలోకి వెళ్లి సీక్రెట్ పాస్‌వర్డ్‌ను ఛేదించి నగదును దోచుకెళ్లినట్టు బ్యాంకు అధికారులు చెప్పారన్నారు. ఏటీఎంలో నగదు కొరతపై బ్యాంకు అధికారులకు కస్టమర్లు ఫిర్యాదు ఇవ్వ దంతో ఈ విషయం వారికి తెలిసిందని చెప్పారు. కేసు దర్యాప్తు సాగుతోందని తెలిపారు.

బీజేపీ కార్యాలయంపై పెట్రో బాంబు

కోయంబత్తూరు : పట్టణంలోని బీజేపీ కార్యాలయంపై బుధవారం ఉదయం 4 గంటలకు పెట్రో బాంబు విసిరారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని పోలీసులు వెల్లడించారు. ఆటోరిక్షాలో వచ్చిన దుండగులు బీజేపీ ఆఫీసుకు కొద్ది దూరం లోకి దీన్ని విసిరారని, ఇవి సీసీటీవీలో నమోదయ్యాయని స్పెషల్ టీం దుండగులను గుర్తించే పనిలో ఉందన్నారు. త్రిపురలో కమ్యూనిస్టు నాయకుడు వ్లాదిమీర్ లెనిన్ విగ్రహ కూల్చివేత తర్వాత పెరియార్‌గా గుర్తించబడిన ద్రవిడ నాయకుడు ఈవీ రామస్వామి విగ్రహాన్ని కూల్చివేయాలని బీజేపీ జాతీయ కార్యదర్శి హెచ్ రాజా వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ ఘటన జరిగింది.

ఢిల్లీ శాంతి భద్రతలపై హైకోర్టు ఆరా

న్యూఢిల్లీ : ఢిల్లీ శాంతి భద్రతలపై హైకోర్టు ఆరా తీసింది. ఢిల్లీ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అన్షు ప్రకాష్‌పై దాడి చేసిన ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేల బెయిలు అభ్యర్థనతో ఢిల్లీ హైకోర్టు పై విధంగా స్పందించింది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఎదుటే ఒక వ్యక్తి దాడికి గురయ్యాడంటే మిగతా చోట్లకూడా భద్రత ఉండదని కోర్టు అనుమానిస్తోంది. డియోలీ ఎమ్మెల్యే ప్రకాష్ జర్వాల్ బెయిలు పిటిషన్ వాదనలపై జస్టిస్ ముక్తాగుప్తా మాట్లాడుతూ,భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కావని భరోసా ఇవ్వాలన్నారు. సీఎస్‌పై దాడిజరిపిన కేసులో జర్వాల్‌ను ఫిబ్రవరి 20న అరెస్టు చేశారు. ఆయన గత నేర చరిత్రను కూడా తెలుసుకోవాలని కోర్టు కోరింది.



ట్రాక్టర్ బోల్తా : 31 మందికి గాయాలు

విశాలాంధ్ర - మైలవరం : ట్రాక్టర్ ట్రక్ బోల్తా పడి 31 మందికి గాయాలైన ఘటన బుధవారం జరి గింది. కృష్ణాజిల్లా మైలవరం మండలంలోని పొందు గుల యస్టీ కాలనీకి చెందిన 31 మంది వ్యవసాయ కూలీలు సమీప గ్రామమైన అనంతవరంలో ఓ రైతుకు చెందిన మిర్చి కోత కోయు నిమిత్తం ట్రాక్టర్‌లో వెళ్ళారు. పనులు ముగించుకుని తిరిగి సాయంత్రం వెళుతూ గ్రామ శివారులో ద్వి చక్రవాహ నాన్ని తప్పించ బోయి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి ట్రక్ బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న 31 మంది కూలీ లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మైలవరంలోని సాయి బాలాజీ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మైలవరం సీఐ రామచంద్రరావు తెలిపారు.

కల్తీ మద్యం సేవించి ఇద్దరు మృతి

విశాలాంధ్ర - జె.పంగులూరు : మద్యం సేవించి ఇద్దరు వ్యక్తులు మరణించిన ఘటన ప్రకాశంజిల్లా జే పంగులూరు మండలంలోని కొండ మంజులూరు గ్రామంలో జరిగింది. కల్తీ మద్యం సేవించి ఇద్దరు వ్యక్తులు మరణించారని ఒక ఛానల్ లో రావడంతో ఈ వార్త రాజధానికి పాకి ఎక్సైజ్ శాఖామంత్రి జవహర్ జోక్యం చేసుకోవడంతో ఎక్సైజ్ అధికారులు కొండ మంజులూరు వచ్చి విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి... కొండ మంజులూరు దళితవాడకు చెందిన విశ్రాంత ఉద్యోగి నందెపోగు ఏసోబు (66), అతని అన్న కుమారుడు కందిపోగు పేతురు (39) మంగళ వారం సాయంత్రం మద్యం సేవించారు. ఏసోబు మద్యం సేవించిన అరగంటలోపే వాంతులు, విరేచనాలు అయి నీరసించిపోయాడు. అతనిని ఆర్ఎంపీ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళేలోపే మరణించాడు. అనం తరం పేతురు పంగులూరు వచ్చేందుకు బస్సులో బయలుదేరగా అతనికి కూడా వాంతులు, విరేచనా లు కావడంలో అతనిని ఇంటికి తీసుకెళ్ళారు. అనంతరం నీరసించి బుధవారం వేకువజామున 4 గంటలకు మరణించాడు. ఓ టీవీ ఛానల్‌లో కల్తీ మద్యం సేవించి ఇద్దరు మృతి చెందారని వార్తలు రావడంతో స్థానిక విలేకరులు, మీడియా ప్రతినిధు లు పరుగులు తీసి వార్త సేకరించారు. ఈ విషయం రాజధానిలో ఉన్న మంత్రి జవహర్ దృష్టికి వెళ్ళడంతో ఆయన వెంటనే సమాచారం కావాలని అధికారులను ఆదేశించారు. దీనితో ఎక్సైజ్ డీఎస్పీ, ఎక్సైజ్ సీఐ కొండమంజులూరుకు చేరుకొని విచారణ చేపట్టారు. కల్తీ మద్యం సేవించడం వలనే మరణించారన్న ప్రచారం జరగడంతో ఎక్సైజ్ అధికారులు పేతురు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రిపోర్టు వచ్చిన వెంటనే అధారాలను బట్టి కల్తీ మద్యం వలన మరణించారో, లేదా వేరే కారణం వలన మరణించారా అనేది పరిగణనలోకి తీసుకుంటా మన్నారు. మృతి చెందిన పేతురుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



మావోయిస్ట్ లొంగుబాటు



విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రా, ఒడిశా స్పెషల్ జోనల్ పరిధిలోని పప్పులూరు ఏరియా కమిటీ దళంలో పనిచేసిన మడకం ఎర్రయ్య తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ విశాల్ గున్ని ఎదుట లొంగిపోయాడు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ విలేకరుల సమావేశం లో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్ట్ ఎర్రయ్య ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన వాడని, 15 ఏళ్ల వయస్సులో 2000 సంవత్సరంలో దళంలో చేరాడన్నారు. కొంతకాలం సహాయకునిగా, దళం సభ్యునిగా పనిచేసిన ఎర్రయ్య 2005లో ఏసీఎంగా పదోన్నతిపొంది కలిమెల, మోటు, పప్పులూరు దళాలలో పనిచేసి, ఆరు నేర ఘటనల్లో పాలుపంచుకున్నాడని తెలిపారు. 2012లో పార్టీ సిద్ధాంతాలు నచ్చక బయటకు వచ్చి పోలీసులకు దొరక్కుండా హైదరాబాద్‌లో కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, అయితే ఎవరు ఏమి చేస్తారోననే భయంతోనూ, పోలీసులు వెతుకుతున్నారని తెలుసుకుని స్వచ్ఛందంగా లొంగిపోయాడన్నారు. ఇతనికి తక్షణ ఆర్థిక సహాయం కోసం కలెక్టర్‌కు సిఫార్సు చేస్తున్నామని, ఇతనిపై ఉన్న రివార్డు కోసం మల్కాన్‌గిరి జిల్లా ఎస్పీకి లేఖ రాస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని ఎటపాకలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో ఒక మావోయిస్ట్, ఇద్దరు కొరియర్లను అరెస్ట్ చేసినట్టు ఎస్పీ వివరించారు. దండకారణ్యం కిసాన్ మజ్దూర్ సంఘ్‌కు చెందిన మావోయిస్ట్ దళ సభ్యుడు మడివి రామకు గతనెల 23న చత్తీస్‌ఘడ్ రాష్ట్రం పాలోడ్ ఏరియాలో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో కుడి కన్నుకు గాయమైందన్నారు. మావోయిస్ట్‌లకు కొరియర్‌లుగా పనిచేస్తున్న వ్యవ సాయకూలీ పాయం జోగారావు, ఆర్ఎంపీ డాక్టర్ మోలుమూరి శ్రీనివాసరావులు గాయపడ్డ మావోయిస్ట్ మడివి రామను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకు వెళుతుండగా పట్టుబడినట్టు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) వై.రవిశంకర్‌రెడ్డి, రంపచోడవరం ఏఎస్పీ అజిత వెజెండ్ల, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

23-25 తేదీలలో తిరుపతిలో ప్రపంచ ఆధ్యాత్మిక ఉత్సవాలు




విశాలాంధ్ర - తిరుపతి : దేశ, విదేశాలకు ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి నగరమని, ఏ మంచి కార్యక్రమమైనా ఇక్కడి నుండే ప్రారంభించే ఆనవాయితీ ఉందని, ప్రపంచ ఆధ్యాత్మిక ఉత్సవాలు తిరుపతిలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరగనున్నాయని జిల్లా కలెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్న అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యాటకశాఖ ప్రపంచ ఆధ్యాత్మిక ఉత్సవాలను తిరుపతిలో నిర్వహించనున్న సందర్భంగా స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉదయం కలెక్టర్ పోస్టర్‌ను విడుదల చేసి మీడియాకు వివరాలను అందించారు. కలెక్టర్ ప్రద్యుమ్న మాట్లాడుతూ తిరుపతి నగరానికి ప్రత్యేక స్థానం ఉన్నదని, స్మార్ట్ నగరంగా రూపుదిద్దుకుంటున్నదని అందుకే తిరుపతిలో రూ.3 కోట్లతో ప్రపంచ ఆధ్యాత్మిక ఉత్సవాలు నిర్వహించనున్నామని అన్నారు. ఉత్సవాల నిర్వహణ ఉద్దేశ్యం మన ఆధ్యాత్మిక చరిత్ర, సూత్రాలు సామాన్య ప్రజలకు సరైన మార్గంలో అందడం లేదని, విద్యార్థులు, సామాన్య ప్రజలు, కూలీలు, ఉద్యోగస్తులు పాల్గొనేలా చేసి ఆధ్యాత్మికతను పెంపొందించి సరైన మార్గంలో మన జీవన విధానం లో మార్పు కోసం చేపడుతున్నామని అన్నారు. ఆధ్యాత్మికత అంటే వయసు మళ్ళిన వారికే అనే విధానం పోవాలని, ఇందులో యువతను భాగస్వామ్యం చేస్తున్నామని అన్నారు. విదేశాలలో ఆర్థికంగా ప్రగతి ఉన్నా ఒంటరి తనం అనేది ఉంటుందని దీనికి భిన్నంగా మన దేశ కుటుంబ వ్యవస్థ అద్భుతమైనదని, ఈ వ్యవస్థను కాపాడుకోవలసిన అవసరం ఉందని అన్నారు. ఆధ్యాత్మికత - విజ్ఞానం - యువత అనే అంశం పై కార్యక్రమాలు ఉంటాయని నగర ప్రజలు అందరు ఆహ్వానితులే అని, 90 శాతం కార్యక్రమాలలో ఉచిత ప్రవేశం ఉంటుందని కొన్నిటికి ప్రవేశ రుసుం ఉంటుందని చెప్పారు. గతంలో దీపావళి ఉత్సవాలు, క్రాఫ్ట్ మేళా నిర్వహించిన విబ్రి మీడియా, శ్రీ శ్రీ ఆర్ట్ ఆఫ్ లివింగ్ నాలెడ్జ్ వారి సహకారంతో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ నెల 24న గురూజీ రవి శంకర్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ నరసింహ యాదవ్, జేసీ గిరిషా, కార్పొరేషన్ కమిషనర్ హరికిరణ్, సబ్ కలెక్టర్ నిశాంత్ కుమార్, టూరిజం ఆర్‌డీ జయ ప్రకాష్, జిల్లా టూరిజం అధికారి చంద్రమౌళి రెడ్డి పాల్గొన్నారు.

సాగర్ కుడికాలువలో పడి వ్యక్తి మృతి



విశాలాంధ్ర - మాచర్ల : ప్రమాదవశాత్తూ నాగార్జున సాగర్ కుడికాలువలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన గుంటూరుజిల్లా మాచర్ల పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. మాచర్ల 16వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అన్నెం అనంతరావమ్మ భర్త వెంకటేశ్వరరెడ్డి (45) బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కుడికాలువలోకి జారిపడటంతో కొంతదూరం కాలువలో కొట్టుకొనిపోయి మృతిచెందాడు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను హింసించిన వారిపై కేసు నమోదు



విశాలాంధ్ర - బంటుమిల్లి : కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలంలోని బీఎస్ఆర్ కాలనీకి చెందిన ఎమ్.సాయిలక్ష్మి(14)ని రెండురోజులుగా ఆమె కుటుంబ సభ్యులు చిత్రహింసలకు గురి చేసిన ట్లు సమాచారం అందుకున్న ఎస్సై దుర్గామహేశ్వర రావు ఘటనా స్థలానికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి అన్న, వదిన, అత్తపై కేసు నమోదు చేశారు. సాయిలక్ష్మితో అన్న వేణు, వదిన ఆదిలక్ష్మిలు ఇంట్లో పని చేయించుకుంటూ, అన్నం సరిగా పెట్టకుండా వంటి పై వాతలు పెట్టి, కర్రలతో చితకబాదారు. కుళాయివద్ద నీళ్లు పట్టలేదని ఆమె నాలుకను వదిన ఆదిలక్ష్మి పట్టకారుతో నొక్కడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఆమెను స్థానికులు బంటుమిల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఫిర్యాదు చెయ్యగా స్పందించిన ఎస్సై ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారం

విశాలాంధ్ర - సోంపేట : అభం శుభం తెలియని చిన్నారిపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. రెండు రోజుల క్రితం శ్రీకాకుళం జిల్లా సోంపేటలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సంచలనంగా మారింది. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. నిర్భయ సెక్షన్ కింద కేసు నమోదు చేసారు.

వార్నర్‌పై నిషేధం..?



దర్బన్:
ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌పై ఒక్క మ్యాచ్ నిషేధం పడనుందా! అంటే అవుననే అంటున్నాయి క్రీడా వర్గాలు. సఫారీ గడ్డపై ఆస్ట్రేలియా- దక్షిణాఫ్రికా మధ్య జరిగిన తొలి టెస్టులో డేవిడ్ వార్నర్-డికాక్ మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఐతే, వీడియో ఫుటేజీలో వార్నర్‌దే ఎక్కువ పాత్ర కనిపిస్తోంది. సహచర ఆటగాళ్లు వద్దని వారిస్తున్నా డికాక్‌పైకి దూసుకెళ్లడంతో ఐసీసీ క్రమశిక్షణ చర్యలను ఉల్లంఘించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికే దీనిపై ఐసీసీ విచారణ చేపట్టింది. ఐతే 'గేమ్ ఆఫ్ డిస్ప్యూట్' కింద వార్నర్ ఐసీసీ లెవల్-2 నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. ఐసీసీ ఇదే చెబితే అతని ఖాతాలో నాలుగు డీమెరిట్ పాయింట్లు చేరతాయి. ఐసీసీ నిబంధనల ప్రకారం ఏ ఆటగాడి ఖాతాలో నాలుగు డీమెరిట్ పాయింట్లు ఉంటే అతడిపై ఒక టెస్టు మ్యాచ్ నిషేధం విధిస్తారు. అంతేకాదు మ్యాచ్ ఫీజులో 100శాతం కోత విధిస్తారు. ఈ లెక్కన వార్నర్ ఆతిథ్య దక్షిణాఫ్రికాతో జరగబోయే రెండో టెస్టులో ఆడటంపై అనుమానాలు నెలకొన్నాయి. ఈ నెల 9 నుంచి పోర్ట్ ఎలిజబెత్‌లో ఇరు జట్ల మధ్య రెండో టెస్టు జరగాల్సి ఉంది. ఐతే, ఆస్ట్రేలియా బోర్డు మాత్రం వార్నర్ తదుపరి టెస్టులో ఆడాలని, జట్టులో అతడెంతో కీలక ఆటగాడని అంటోంది. ఇదిలా ఉంటే వార్నర్‌తో వాగ్వాదంలో ఉన్న డికాక్ ఐసీసీ లెవల్-1 నిబంధనలు ఉల్లంఘించినట్లు మాత్రమే తెలుస్తోంది. ఇదే జరిగితే అతని ఖాతాలో రెండు డీమెరిట్ పాయింట్లతో పాటు మ్యాచ్ ఫీజులో కొంత మేర కోత పడుతోంది. మరి ఐసీసీ ఎవరిపై వేటు వేస్తుందో, ఏం చేస్తుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే.

'షమీ.. వేధిస్తున్నాడు'

భార్య హసిన్ జహాన్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ:
టీమిండియా ఆటగాడు మహమ్మద్ షమిపై ఆయన భార్య హసిన్ జహాన్ సంచలన వ్యాఖ్యలు చేసింది. సామాజిక మాధ్యమాల్లో భార్య హసిన్ జహాన్, కుమార్తెతో కలిసి దిగిన ఫొటోలను షేర్ చేస్తూ తరచూ అభిమానుల ఆగ్రహానికి గురయ్యే షమి ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఒక్కసారిగా హాట్‌టాపిక్‌గా మారాడు. తాజాగా హసిన్ మీడియాతో మాట్లాడుతూ..'రెండేళ్ల నుంచి షమితో పాటు ఆయన కుటుంబసభ్యులు నన్ను వేధింపులకు గురి చేస్తున్నారు. అంతేకాదు నన్ను చంపడానికి కూడా ప్రయత్నిస్తున్నారు. ఎందుకంటే షమికి ఎంతో మంది అమ్మయిలతో సంబంధాలు ఉన్నాయి. ఆ విషయం నాకు తెలియడంతో నన్ను వేధించడం మొదలుపెట్టారు' అని హసిన్ చెప్పారు. 'దేశంలో చాలా మంది అమ్మాయిలతో షమికి అక్రమ సంబంధాలు ఉన్నాయి. ఒక రోజు షమి కారులో మొబైల్ ఫోన్ దొరికింది. దాన్ని ఓపెన్ చేసి చూస్తే అసభ్యకర సందేశాలు కనిపించాయి. అవన్నీ చదవడానికి ఒక రాత్రి సరిపోలేదు. చాలా మంది అమ్మాయిల ఫొటోలు కనిపించాయి. పాకిస్థాన్‌కు చెందిన ఓ అమ్మాయితో షమికి పెళ్లి అయ్యింది. దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్ అనంతరం షమి ఆ అమ్మాయి కోసం పాకిస్థాన్ కూడా వెళ్లాడు. గతంలో ధర్మశాలలో టీమిండియా మ్యాచ్‌కు నన్ను తీసుకెళ్లమని షమిని కోరాను. అతడు వద్దన్నాడు. అక్కడితో ఊరుకోకుండా అక్కడి నుంచి నాకు ఫోన్ చేసి మరీ నన్ను తిట్టాడు. టీమిండియా ఎక్కడికి వెళ్లినా కుల్‌దీప్ అనే వ్యక్తి.. షమికి అమ్మాయిలను సప్లై చేస్తాడు. బీసీసీఐకి ఈ విషయం తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు'అని హసిన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'త్వరలో షమితో పాటు ఆయన కుటుంబసభ్యులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటా' అని ఆమె తెలిపారు. షమి-హసిన్‌ది ప్రేమ వివాహం. 2014 జూన్ 6న వీరు పెళ్లి చేసుకున్నారు. 2012లో ఓ ఐపీఎల్ మ్యాచ్‌లో షమి తొలిసారి హసిన్‌ను చూశాడు. అప్పటి నుంచి వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారు. రెండేళ్ల తర్వాత పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక పాప. ఈ వార్తలపై మహమ్మద్ షమి ట్విటర్ ద్వారా స్పందించాడు. 'హాయ్. నేను మహమ్మద్ షమిని. నా వ్యక్తిగత జీవితం గురించి ఏవేవో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వాటిల్లో ఏమాత్రం నిజం లేదు. నాపై జరుగుతున్న కుట్ర ఇది. నా క్రికెట్ జీవితాన్ని నాశనం చేసేందుకే ఎవరో ఇదంతా చేస్తున్నారు' అని షమి పేర్కొన్నాడు..

రూ. 7 కోట్లు




రూ. 7 కోట్లు



రూ. 7 కోట్లు



రూ. 7 కోట్లు



రూ. 7 కోట్లు



రూ. 5 కోట్లు



క్రికెటర్లపై కాసుల వర్షం



- గ్రేడు దిగిన ధోనీ
- గ్రేడులోనే లేని షమీ
- ర్యాంకులు ప్రకటించిన సీవోఏ

న్యూఢిల్లీ:
బోర్డు ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ (బీసీసీఐ) అడ్మినిస్ట్రేటర్స్ కమిటీ (సీవోఏ) బుధవారం సంచలన నిర్ణయం తీసుకుంది. అక్టోబరు 2017 నుంచి సెప్టెంబరు 2018 వరకూ వార్షిక ఆటగాళ్ల కాంట్రాక్టు జాబితాను బుధవారం విడుదల చేసింది. అనూహ్యంగా ఈ జాబితాలో టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఒక గ్రేడు దిగాడు. అయితే సీవోఏ విడుదల చేసిన జాబితాలో పేసర్ మహ్మద్ షమీ మాత్రం కనబడలేద. అతడిపై తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పక్కన పెట్టినట్లు సమాచారం. దీని ప్రకారం.. బుధవారం సీవోఏ కమిటీ విడుదల చేసిన ఆటగాళ్ల జాబితా ఈ విధంగా ఉంది. సీనియర్ జట్టు ఆటగాళ్లతో పాటు మహిళ జట్టు ప్లేయర్లకు బీసీసీఐ జీతాలు పెంచింది. వీరిలో ఏ గ్రేడ్ ప్లేయర్లకు రూ.50 లక్షలు, బీ గ్రేడ్ ఆటగాళ్లకు 30 లక్షలు, సీ గ్రేడ్ ఆటగాళ్లకు 10 లక్షలు పెంచుతున్నట్లు పేర్కొంది. వీరిలో ఏ గ్రేడ్‌లో మిథాలీ రాజ్, ఝులన్ గోస్వామి, హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన ఉన్నారు. బీ కేటగిరీలో పూనమ్ యాదవ్, వేదా కృష్ణ మూర్తి, రాజేశ్వరి గైక్వాడ్, ఏక్తా బిస్త, శిఖా పాండే, దీప్తీ శర్మ ఉన్నారు. అంతేకాక.. డొమెస్టిక్ మ్యాచ్‌లో అందించే ఫీజ్ 200శాతం పెంచుతున్నట్లు బీసీసీఐ తెలిపింది.

ఏ+ గ్రేడ్ :
విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బూమ్రా..... వీరికి సంవత్సరానికి రూ. 7 కోట్లు

ఏ గ్రేడ్ :
మహేంద్రసింగ్ ధోనీ, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, మురళీ విజయ్, ఛెతేశ్వర్ పుజారా, అంజిక్యా రహానె, వృద్ధిమాన్ సాహా... వీరికి సంవత్సరానికి రూ.5 కోట్లు

బి-గ్రేడ్ :
కేఎల్ రాహుల్, ఉమేష్ యాదవ్, కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్, హార్దిక్ పాండ్య, ఇషాంత్ శర్మ, దినేష్ కార్తీక్.... వీరికి సంవత్సరానికి రూ.3 కోట్లు

సి-గ్రేడ్ :
కేదార్ జాదవ్, మనీష్‌పాండే, అక్షర్ పటేల్, కరుణ్‌నాయర్, సురేష్ రైనా, పార్థివ్ పటేల్, జయంత్ యాదవ్... వీరికి సంవత్సరానికి రూ.1 కోటి

ఢిల్లీ కెప్టెన్‌గా గంభీర్



న్యూఢిల్లీ:
ఇండియన్ ప్రీమియర్ లీగ్-2018 సీజన్‌కు ఢిల్లీ డేర్ డెవిల్స్ కెప్టెన్‌గా సీనియర్ క్రికెటర్ గౌతం గంభీర్‌ను ఎంపిక చేశారు. ఢిల్లీ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ గంభీర్ కెప్టెన్సీపై నమ్మకం ఉంచడంతో ఈ మేరకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. యువ ఆటగాళ్లకు సరైన సారథి గంభీరేనని పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు సారథిగా అతను ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వలేదని, గత సీజన్‌లో గంభీర్ అద్భుతంగా రాణించాడని కొనియాడాడు. యువ ఆటగాళ్లకు అనుభవం ఉన్న కెప్టెన్ కావాలని కోరుకున్నామని, గంభీరే సరైన సారథి అని భావించి నిర్ణయం తీసుకున్నామన్నారు. గంభీర్ సారథ్యంలోనే ఢిల్లీ టైటిల్ గెలుస్తోందని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశాడు. ఇక 2011లో కేకేఆర్ పగ్గాలు చేపట్టిన గంభీర్ అటు సారథిగా ఇటు బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. కొన్ని సీజన్‌లలో టాప్ స్కోరర్‌గా సైతం నిలిచాడు. గంభీర్ సారథ్యంలోనే కేకేఆర్ రెండు సార్లు (2012, 2014 సీజన్‌లలో) టైటిల్ కైవసం చేసుకుంది. కెప్టెన్‌గా రెండు సార్లు టైటిల్ అందించిన గంభీర్‌ను ఈ సీజన్‌లో కేకేఆర్ వదులుకోవడంతో ఫ్రాంచైజీపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హోమ్ టౌన్‌కు ఆడాలనే తన కోరిక మేరకే వదులుకున్నామని కేకేఆర్ ఆ తర్వాత స్పష్టం చేసింది. ఇక ఢిల్లీ రూ.2.80 కోట్లకు గంభీర్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. దీంతో గంభీర్ సొంత గూటికి చేరినట్టైంది. ఐపీఎల్ ప్రారంభ సీజన్‌లలో గంభీర్ ఢిల్లీకే ప్రాతినిథ్యం వహించాడు.

భారత్‌పైనే ఒత్తిడి..!

- నేడు బంగ్లాదేశ్‌తో రెండో టీ20
- పుంజుకుంటాం: రోహిత్ శర్మ

కొలంబో:
నిదాహస్ ముక్కోణపు సిరీస్‌లో భాగంగా భారత్ బంగ్లాదేశ్‌ల మధ్య గురువారం రెండో మ్యాచ్ జరగనున్నది. శ్రీలంకపై అనూహ్యంగా ఐదు వికెట్లతో తేడాతో ఓటమి చవిచూసిన టీమిండియా తీవ్ర ఒత్తిలో రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఐదు వికెట్లకు 174 పరుగులు చేసినా, బౌలింగ్ విభాగంలో సహకారం లోపించడంతో మూల్యం చెల్లించుకోక తప్పలేదు. ఒకరకంగా చెప్పాలంటే సీనియర్లు లేని కొరత కొట్టొచ్చినట్లు కనబడింది. దీనికి తోడు కొత్తగా వచ్చిన బౌలర్లకు అనుభవం కూడా లేకపోవడం ఒక కారణంగా భావించవచ్చు. ఈ నేపథ్యంలో గురువారం బంగ్లాదేశ్‌లో భారత్ తలపడనున్నది. 'మా బౌలర్లు అంతా బాగానే చేశారు. కానీ కొన్నిసార్లు మనకు టైమ్ కలిసిరాదు. ప్రస్తుతం ఉన్న బౌలర్ల అనుభవం, వారి టైమింగ్ సరిపోతుందనే అనుకుంటున్నా. ఇక్కడి పరిస్థితులకు వారి కొత్త అయినా, పుంజుకునే అవకాశం పుష్కలంగా ఉంది. రెండో మ్యాచ్‌పై నాకు నమ్మకం ఉంది' అని రోహిత్ శర్మ తెలిపాడు. మొట్టమొదటి మ్యాచ్‌లోనే చుక్కెదురు అవడంతో భారత్ కొంచెం డీలా పడ్డా, పుంజుకునే అవకాశాలున్నాయి. మొదటి మ్యాచ్‌లోనే రోహిత్ డకౌట్ అవ్వడం, అతడి స్థానంలో బరిలోకి దిగిన రైనా నిర్లక్ష్యంగా ఆడటం ఒకింత భారత్‌కు కుంగదీస్తోంది. రోహిత్, శిఖర్‌ధావన్‌లు ఎప్పటిలా మంచి ప్రారంభాన్నిస్తే రెండో మ్యాచ్‌లో పుంజుకునే అవకాశం ఉంది. అయితే ఈ మ్యాచ్‌లో పెద్దగా మార్పులు చేసేందుకు రోహిత్ శర్మ అంగీకరిం చడం లేదు. జట్టులోకి అక్షర్ పటేల్ వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. అలాగే ఎంతో అనుభవమున్న కేఎల్ రాహుల్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఒకవేళ అతడు బ్యాటింగ్ వచ్చేటట్లయితే మిడిల్ ఆర్డర్‌లో వచ్చే అవకాశం ఉంది. శ్రీలంకపై రెండు వికెట్లు తీసిన వాషింగ్టన్ సుందర్, పరుగులు మాత్రం ధారాళంగా ఇచ్చాడు. సీనియర్ బౌలర్లు అయిన జస్ప్రీత్ బూమ్రా, భువనేశ్వర్ కుమార్‌ల గైర్హాజరుతో పేస్ బౌలింగ్ చేస్తున్న శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనాద్కట్‌లు డెత్ ఓవర్లలో తమ ప్రతిభ చూపాల్సి ఉంది. మొదటి ఓవర్లలోనే 27 పరుగులు ఇచ్చిన శార్దూల్, తదుపరి ఓవర్లలో కోలుకొని ఒకమాదిరిగా బాగానే బౌలింగ్ చేశాడు. అయితే ఇక్కడో కీలక విషయం. బంగ్లాదేశ్‌తో ఎప్పుడు టీ20 జరిగినా భారత్‌కు సవాలే. మరి నేడు జరిగే మ్యాచ్‌లో ఏ చేస్తారో వేచి చూడాలి.



జట్లు (అంచనా)

భారత్:
రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, సురేష్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్ (వికెట్ కీపర్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనాద్కట్, మొహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్

బంగ్లాదేశ్:
మహ్మదుల్లా (కెప్టెన్), తమిమ్ ఇక్బాల్, సౌమ్యా సర్కార్, ఇమ్రుల్ కైయాస్, ముష్ఫికర్ రహీం(వికెట్ కీపర్), సాబిర్ రెహ్మాన్, ముస్తఫిజుర్ రెహ్మాన్, రుబెల్ హసన్, టస్కిన్ అహ్మద్, అబు హైదర్, అబు జయేద్, అరిఫుల్ హక్, నజ్ముల్ ఇస్లాం, నూరుల్ హసన్, మెహిదీ హసన్, లింటన్ దాస్



గేల్ విధ్వంసం

హరారె:
వెస్టిండీస్ విధ్వంసక ఓపెనర్ క్రిస్ గేల్ అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో సచిన్, ఆమ్లాల తర్వాత 11 విభిన్న దేశాలపై శతకాలు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా మంగళవారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో చెలరేగి ఆడిన గేల్ 91 బంతుల్లో 123 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 11 సిక్సర్లు, 7 ఫోర్లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో విండీస్ 60 పరుగుల తేడాతో గెలిచింది. మొదట విండీస్ 4 వికెట్ల నష్టానికి 357 పరుగుల భారీ స్కోరు సాధించింది. గేల్‌తో పాటు హెటీమర్ (127) కూడా చెలరేగాడు. అనంతరం యూఏఈ 50 ఓవర్లలో 6 వికెట్లకు 297 పరుగులు చేసింది. షాజాద్ (112) సెంచరీ సాధించాడు.

సముద్రంలో రవాణా నౌక దగ్ధం

- లక్షద్వీప్ వద్ద ఘటన
- 25మీటర్ల ఎత్తుకు ఎగిసిపడ్డ మంటలు
- ఓ భారతీయుడు సహా నలుగురు సిబ్బంది గల్లంతు

ముంబై:
అరేబియన్ సముద్రంలో లక్షద్వీప్ తీరం వద్ద మార్స్క్ లైన్‌వారి రవాణా నౌకలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. భారీస్థాయిలో మంటలు చెలరేగడంతో నౌక పూర్తిగా దగ్ధమైంది. 'సింగపూర్ నుంచి స్విజ్‌కు వెళుతుండగా మార్గంమధ్యలో సింగపూర్‌కు చెందిన 330 మీటర్ల పొడవైన నౌక 'మార్స్క్ హోనం'లో మంటలు చెలగాయి. ప్రమాదం జరిగినప్పుడు నౌక లక్షద్వీప్‌లోని అగట్టీ ద్వీపానికి 340 నాటికల్ మైళ్ల దూరంలో ఉంది. మంటలు వ్యాపించడంతో నౌకలో ఉన్న 27మంది సిబ్బంది సముద్రంలోకి దూకేశారు. వారిలో నలుగురు గల్లంతయ్యారు. కనిపించకుండా పోయిన వారిలో ఓ భారతీయుడు ఉన్నాడు' అని అధికారులు చెప్పారు. వారిమర్చెంట్ షిప్పులు అక్కడికి చేరుకొనేసరికి నౌక పూర్తిగా దగ్ధమైందని, మంటలు దాదాపు 25మీటర్ల ఎత్తుకు ఎగిసిపడ్డాయని కోస్టగార్డ్ వెస్ట్ రీజియన్ కమాండర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ కేఆర్ నౌటియాల్ తెలిపారు. ఇలాంటి అగ్నిప్రమాదాల వ్యవహారాలను చూసుకునే ఇండియన్ కోస్టగార్డ్ (ఐసీజీ) నౌకను ఘటనాస్థలికి పంపినట్టు చెప్పారు. మర్చెంట్ షిప్పుల సహాయంతో గల్లంతైన సిబ్బంది కోసం గాలిస్తున్నామన్నారు. లాంగ్‌రేంజ్ మేరిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ బోయింగ్ పీ-81ని రంగంలోకి దింపినట్టు నేవీ అధికార ప్రతినిధి తెలిపారు. తమిళనాడు నుంచి రెస్క్యూ సిబ్బంది కూడా గల్లంతైన వారి కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. గల్లంతైన భారతీయుడిని కుక్ సాకీమ్ హెడ్జ్‌గా గుర్తించామని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) సీనియర్ అధికారి తెలిపారు. నౌకలోని 7860 కంటెయినర్లు ఉండగా వాటిలో ఒకదానిలో నుంచి మంటలు వ్యాపించినట్టు అనుమానిస్తున్నామన్నారు. ప్రమాదానికి గురైన రవాణా నౌక 20 అడుగల 15,262 బాక్సులను తీసుకెళ్లగల సామార్థ్యాన్ని కలిగివున్నట్టు తెలిపారు. కాపాడిన సిబ్బందిని దగ్గరలోని కొలంబో పోర్టుకు తరలిస్తున్నట్టు వెల్లడించారు. మొత్తం 27మంది సిబ్బందిలో కెప్టెన్‌తో సహా 13 మంది భారతీ యులు, తొమ్మిది మంది ఫిలిప్పీన్లు, ఇద్దరు థాయిలాండ్ సెయిలర్లు, యూకే, రొమేనియా, దక్షిణాఫ్రికాలకు చెందిన ఒక్కో సెయిలర్ ఉన్నట్టు అధికారి వెల్లడించారు.





Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.